ప్రకటనల కోసం
సంప్రదించండి
9848 328 698




తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.APTEL / 2013 /50370

28.05.2024 మంగళవారం | సంపుటి : 10 సంచిక : 318 | పేజీలు : 12 వెల: రూ. 4/- | Follow :

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్













# అట్టహాసంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

## ఏర్పాట్లపై సీఎస్ శాంతికుమారి సమీక్ష

- జూన్ 2న గన్‌పార్క్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర గీతం ఆవిష్కరణ
- ట్యాంక్‌బండ్‌పై స్వయం సహాయక బృందాల స్టాల్స్, వినోదశాలలు
- 5 వేల మంది పోలీసుల బ్యాండ్ ప్రదర్శన



**జూన్ 2న రాష్ట్ర అవతరణ** ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. తెలంగాణ అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 2న ఉదయం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద అమరులకు సీఎం నివాళులు అర్పించిన అనంతరం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించడంతో పాటు, సందేశం ఉంటుందని తెలిపారు.

హైదరాబాద్, మే 27 (జనంసాక్షి) : తెలంగాణ దశాబ్ది అవతరణోత్సవాలను ధూమ్ ధామ్‌గా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు భారీగా ఏర్పాట్లు చేయబోతున్నారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. జూన్ 2న ఉదయం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధన అమరవీరులకు సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించనున్నారని, అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. పరేడ్ గ్రౌండ్‌లో జూన్ 2న ఉదయం రాష్ట్ర గీతాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించడంతో పాటు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. ట్యాంక్ బండ్‌పై సాయంత్రం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు రాష్ట్రంలోని అన్ని కళారూపాలతో మిగతా 2లో..

## ఉద్యమ స్ఫూర్తి ప్రతిబింబించేలా రాష్ట్ర అధికార చిహ్నం

### చిత్రకారుడు రుద్ర రాజేశంతో సీఎం రేవంత్ రెడ్డి చర్చ



హైదరాబాద్, మే 27 (జనం సాక్షి) : రాష్ట్ర అధికారిక చిహ్నంపై చిత్రకారుడు రుద్ర రాజేశంతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా పలు నమూనాలను సీఎం రేవంత్ పరిశీలించారు. తుది నమూనాపై సీఎం పలు సూచనలు చేశారు. అధికారంలోకి రాగానే తెలంగాణ తల్లి విగ్రహం నమూనాను కూడా మార్చాలని సిఎం రేవంత్ నిర్ణయించారు. అలాగే రాష్ట్రగీతంగా అందెశ్రీ రాసిన జయజయహేకు పచ్చజెండా ఊపారు. అలాగే రాష్ట్ర చిహ్నం కూడా తెలంగాణ కు అద్దంపట్టేలా ఉండాలని ఆకాక్షించారు. ఈ క్రమంలో దానిని మార్చాలని నిర్ణయించారు. అయితే రాష్ట్ర అధికారిక చిహ్నంను మార్చొద్దని పలువురు రాజకీయ నాయకులు, మేధావులు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణ కోడ్ టీఎస్ స్థానంలో టీజీ తీసుకొచ్చారు. టీఎస్ స్థానంలో టీజీ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, కార్పొరేషన్లు, వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు ఏదైనా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్‌ను టీఎస్ బదులుగా టీజీగా ఉపయోగిస్తున్నారు. లెటర్ హెడ్స్ రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్ సైట్లు, ఆన్‌లైన్ జీవోలు ఇతర అధికారిక వెబ్ సైట్లు ఆన్‌లైన్ జీవోల్లో టీజీగా మార్చారు. ఈ క్రమంలో త్వరలోనే అంటే జూన్ రెండు నాటికి రాష్ట్ర చిహ్నం అధికారికంగా ఖరారు అయ్యే అవకాశం ఉంది. మిగతా 2లో..

## నిఫ్టీ, సెన్సెక్స్ సరికొత్త రికార్డు

మొదటిసారిగా 76000 మార్క్ సెన్సెక్స్



2

సోమవారం స్టాక్ మార్కెట్ల సూచీలు లాభాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9.27 గంటల సమయంలో సెన్సెక్స్ 142 పాయింట్ల లాభంతో 75,552 వద్ద ట్రేడ్ అవ్వగా.. నిఫ్టీ 46 పాయింట్లు లాభంతో 23,003వద్ద ఉంది.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ముగింపు వేడుకలు

- జూన్ 1వ తేదీ నుంచి 3 వరకు రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు
- గన్ పార్క్ అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్ బండ్ వద్దనున్న అమరజ్యోతి వరకు క్యాండిల్ ర్యాలీ
- నిర్ణయించిన గులాబీ దళపతి కేసీఆర్



హైదరాబాద్, మే 27 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్దికాలం గడుస్తున్న సందర్భంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ముగింపు వేడుకలు నిర్వహించాలని ఆ పార్టీ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు నిర్ణయించారు. ఇందులో భాగంగా జూన్ ఒకటి నుంచి మూడు రోజుల మిగతా 2లో..

## ప్రశాంతంగా ముగిసిన పట్టభద్రుల పోలింగ్

మొత్తం 600 కేంద్రాల్లో జరిగిన ఓటింగ్ ప్రక్రియ

పోలింగ్ కేంద్రాల్లో బారులుతీరిన గ్రాడ్యుయేట్లు




వరంగల్, మే 27 (జనం సాక్షి) : ఖమ్మం - వరంగల్ - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పోలింగ్ సమయం ముగిసింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. 4 గంటల్లోపు క్యూలైన్లలో నిల్చున్న వారికి ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. సుమారు 60 శాతం దాకా పోలింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం 2 గంటల వరకు 49.53 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఉప ఎన్నిక ఫలితం జూన్ 5వ తేదీన వెల్లడి కానుంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పరిధిలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 605 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దాంతో ఆ నియోజకవర్గానికి ఇవాళ ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల మిగతా 2లో..

## తీరం దాటిన రెమాల్ తుపాన్

### బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లో బీభత్సం

- తుఫాను ధాటికి బెంగాల్‌లో ఇద్దరు మృతి
- విరిగి పడ్డ విద్యుత్ స్తంభాలు.. నిలిచిన విద్యుత్ సరఫరా
- భారీ వర్షాలతో నీటమునిగిన అనేక ప్రాంతాలు
- సహాయక చర్యల్లో నిమగ్నమైన విపత్తు నిర్వహణ బృందాలు




కోల్‌కతా, మే 27 (జనం సాక్షి) : రెమాల్ తుపాను తీరం దాటింది. ఆదివారం అర్ధరాత్రి తర్వాత బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లో తీరం దాటినట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. తీరందాటే సమయంలో తుపాను ఈదురు గాలులతో బీభత్సం సృష్టించింది. 135 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురుగాలుల ధాటికి బెంగాల్, బంగ్లా తీరాలు వణికిపోయాయి. అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీ వర్షాలు కురుస్తుండటంతో చాలా ప్రాంతాలు నీటమునిగాయి. తుపాను ప్రభావంతో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ముందుగానే తీరప్రాంతాల నుంచి సుమారు లక్షమంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు మిగతా 2లో..

### తెలంగాణపై తుఫాన్ ప్రభావం

- ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం
- పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి


2

## మ్యానిఫెస్టోలో వాగ్దానాలను 'అవినీతి'గా పరిగణించలేం

- ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు ఆర్థిక సహాయం చేసినట్లు..
- పిటిషనర్ వాదన విచిత్రంగా ఉందని తోసిపుచ్చిన ధర్మాసనం
- గతేడాది కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం



న్యూఢిల్లీ, మే 27 (జనం సాక్షి) : రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేసే వాగ్దానాలు ఎన్నికల చట్టాల ప్రకారం అవినీతి కిందకు రావని భారత సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. అవి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు ఆర్థిక సహాయం చేసినట్లు అవుతుందని, అంతేకాకుండా పార్టీ అభ్యర్థి కూడా అవినీతి చేయడంతో సమానమని పిటిషనర్ చేసిన వాదనను తోసిపుచ్చింది. ఈ వాదన విచిత్రంగా ఉందని మిగతా 2లో..



## సిట్ ముందుకు ప్రజ్వల్ రేవణ్ణ

విచారణకు సహకరిస్తా..

మే 31న పోలీసుల ఎదుట హాజరవుతానని వెల్లడి

2



## భారీగా గోల్డ్ స్మగ్లింగ్ యత్నానికి బిఎస్ఎఫ్ భగ్నం

బెంగాల్లో ఓ ఇంట్లో 16.07 కేజీల బంగారు బిస్కట్లు స్వాధీనం

## అగ్నిపథ్ స్కీమ్‌ను రద్దు చేస్తాం

- ఇండియా కూటమి అధికారంలోకి రాగానే అమల్లోకి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- రాహుల్ గాంధీ బహిరంగ సభలో కూలిన స్టేజీ
- తప్పిన ప్రమాదం.. ఊపిరిపీల్చుకున్న నేతలు



పాట్నా, మే 27 (జనం సాక్షి) : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా పాట్నాలోని భక్తియార్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఇండియా కూటమి ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అగ్నిపథ్ స్కీమ్‌ను రద్దు చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. జూన్ 4న ఇండియా కూటమి సంకీర్ణ ప్రభుత్వం రాబోతోందని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అగ్నివీర్ పథకాన్ని అంతం చేస్తామని పేర్కొన్నారు. నన్ను దేవుడే పంపించాడంటూ ఇటీవల మోడీ చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. జూన్ 4 తర్వాత అవినీతి గురించి ఈడీ మోడీని అడిగితే, నాకేమీ తెలియదు.. నన్ను పంపింది దేవుడే అని చెబుతారా అని ప్రశ్నించారు. దేశంలోని యువతకు ఉపాధి కల్పించడంలో మోడీ విఫలమయ్యారని ఆరోపించారు. మోడీ జీ సుదీర్ఘ ప్రసంగాలు చేయడం మానేయండి.. దేశాన్ని విభజించడానికి ప్రయత్నించవద్దని రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలోని యువతకు ఎంత ఉపాధి కల్పించారో, ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ముందుగా బీహార్ యువతకు చెప్పాలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 2 కోట్ల ఉద్యోగాల గురించి మాట్లాడిన మీరు ఒక్క యువకుడికి కూడా ఉద్యోగం ఇవ్వలేదని మిగతా 2లో..

## వచ్చేది మళ్లీ మోడీ ప్రభుత్వమే

### ఎపిలోనూ ఎన్డీయే పాలన ఏర్పాటు

- కాంగ్రెస్ 40 సీట్లు దాటదు..
- సమాజ్‌వాదీ పార్టీకి నాలుగు కూడా రావు
- కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలపై అమిత్ షా విమర్శలు
- ఎండాకాలం ఎన్నికలకు ఇక ముగింపు పలుకుతాం
- జమిలి ఎన్నికలతో వరుస ఎన్నికలకు స్వస్తి
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టీకరణ

*ఉత్తర ప్రదేశ్‌లోని బల్లియాలో జరిగిన సమావేశంలో కేంద్ర హోం, సహకార మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదు దశల్లో మోడీ 310 సంఖ్యను అధిగమించారని.. ఆరో దశలో 400 దాటిందని తెలిపారు.*



2

## నాలుగేళ్లుగా నిద్రపోతున్నారా?

- ఇంత దారుణం తరవాత ఇప్పుడు చర్యలా
- ఇంతకాలం ఎందుకు చర్యలకు దిగలేదు
- గేమింగ్ జోన్ అగ్ని ప్రమాదంపై హైకోర్టు ఆగ్రహం



2

## వారంలో చెన్నై ఎయిర్‌పోర్టును పేల్చేస్తాం..

- ఈ మెయిల్స్ ద్వారా బెదిరింపులు
- అప్రమత్తమైన విమాన సిబ్బంది



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
28 మే 2024

## తెలంగాణపై తుఫాన్ ప్రభావం!!



**హైదరాబాద్, మే 27 (జనం సాక్షి) :** తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని పలు జిల్లాలకుఎల్లో అలెర్ట్ జారీ చేసింది ఐఎండీ.. ఈరోజు సాయంత్రం హైదరాబాద్ తో పాటు పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రెమాల్ తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. వాయుగుండంగా మారి తీవ్ర తుఫాన్‌గా మారింది.. నిన్న సాగర్ ఐలాండ్ వద్ద తుఫాన్ తీరం దాటింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి, మెదక్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, సూర్యాపేట్, నల్గొండ, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, భద్రాది కొత్తగూడెం జిల్లాలకు నేడు వర్ష కురిసే అవకాశం ఉంది. 40-50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. రేపు.. ఎల్లుండి రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఇదిలా ఉంటే.. ఆదివారం తెలంగాణలో రెమాల్ తుఫాన్ బీభత్సం సృష్టించింది. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో బలమైన గాలులు వీచాయి. దీంతో పలుచోట్ల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, నాగర్ కర్నూల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కలిపి నల్గొండ, సిద్దిపేట, వికారాబాద్ తదితర జిల్లాల్లో గాలివాన కురిసింది. వేర్వేరు ఘటనల్లో మొత్తం 14 మంది చనిపోయారు. దీంతో మృతుల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వర్షాలు, ఈదురుగాలులకు రాష్ట్రంలో 14 మంది మృతి చెందారు. నాగర్ కర్నూలు జిల్లాలో 8 మంది మృతి చెందగా.. శామీర్ పేటలో చెట్టు విరిగిపడి ఇద్దరు మృతి చెందారు. మియాపూర్ లో గొడ కూలి మూడేళ్ల బాలుడు, సిద్దిపేట జిల్లా క్షీరసాగరలో ఇద్దరు మృతి చెందారు.

## నాలుగేళ్లుగా నిద్రపోతున్నారా?

**గాంధీనగర్, మే (జనంసాక్షి) :** గుజరాత్‌లోని రాజ్‌కోట్ వీడియో గేమ్‌జోన్ అగ్ని ప్రమాద ఘటనలో 28 మంది ఆహుతైన విషయం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదం నింపింది. అందులో చిన్నారులు ఉండటం, వారంతా గుర్తించలేనివిధంగా కాలిపోవడం తీవ్రంగా కలచివేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో స్థానిక మునిసిపల్ అధికారుల తీరుపై ఆ రాష్ట్ర హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అమాయకుల ప్రాణాలు కోల్పోయిన తర్వాత చర్యలు చేపడతామని చెబుతోన్న రాష్ట్ర యంత్రాంగంపై తమకు విశ్వాసం లేదని పేర్కొంది.
అగ్నిప్రమాదం కేసుపై గుజరాత్ హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఈసందర్భంగా రాజ్‌కోట్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులపై తీవ్ర స్థాయిలో మండిపడింది. 'మీ పరిధిలో ఇంతటి భవనం ఉందని మీకు తెలియదా? కళ్లు మూసుకున్నారా? ఫైర్ సేఫ్టీ లేకుండా రెండున్నరేళ్లుగా ఇది ఉందని ఎలా చెబుతారు. టికెట్ వసూలు చేసేటప్పుడు వినోద పన్ను గురించి తెలియదా?' అని జస్టిస్ బైరెన్ వైష్ణవ్, జస్టిస్ దేవాన్‌దేశాయ్‌లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఆ భవనం ప్రారంభ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కూడా పాల్గొన్నట్లు మీడియా కథనాలను చూపిస్తూ.. ఆ అధికారులు ఎవరు? వాళ్లంతా ఆడుకోవడానికి అక్కడికి వెళ్లారా? అని ప్రశ్నించారు. ఆ గేమ్ జోన్ ఏర్పాటైనప్పటి (2021) నుంచి ఈ ప్రమాదం జరిగినంత వరకు రాజ్‌కోట్ కమిషనర్లుగా పనిచేసినవారంతా ఈ విషాదానికి బాధ్యత వహించాల్సిందేనని హైకోర్టు ధర్మాసనం స్పష్టంచేసింది. వారంతా వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. అనుమతుల కోసం టీఆర్‌పీ గేమ్ జోన్ తమను సంప్రదించలేదంటూ ఆర్‌ఎంసీ తరఫు న్యాయవాది వివరించే సమయంలో హైకోర్టు ధర్మాసనం ఈ ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఈ దురదృష్టకర సంఘటన నేపథ్యంలో.. దీనికి ఓ వ్యక్తిని బాధ్యుడిని చేసేందుకు ప్రభుత్వం ముందుకురావాలని, అప్పుడే కఠిన చర్యలు తీసుకోవచ్చని తెలిపింది. పిటిషనర్ చేసిన విన్నపంపై ధర్మాసనం స్పందిస్తూ..'కఠిన చర్యలు ఎవరు తీసుకుంటారని ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంపై మాకు నమ్మకం లేదు. మేం ఆదేశాలిచ్చిన నాలుగేళ్ల తర్వాత కూడా.. ఇలా జరగడం ఇది ఆరోసారి. ప్రాణాలు కోల్పోవడాన్నే వాళ్లు కోరుకుంటారు. ఆ తర్వాత యంత్రాంగాన్ని పురమాయిస్తారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించి ఓ పిల్‌పై గతంలో ఇచ్చిన ఆదేశాలపై ఏం చేశారు. నెలలుగా కార్పొరేషన్ ఏం చేస్తోంది' అని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## సిట్ ముందుకు ప్రజ్వల్ రేవణ్ణ

**న్యూఢిల్లీ, మే 27 (జనం సాక్షి) :** తన సెక్స్ టేపులు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాటు తనపై లైంగిక వేధింపుల కేసుల నేపథ్యంలో కర్ణాటక జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ దేశం విడిచి పారిపోయిన సంగతి తెలిసిందే.. దాదాపు అతను దేశం విడిచి వెళ్లి నెల దాటిపోయింది. అయితే.. తాజాగా కీలక కథనం బయటికొచ్చింది. మే 31న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందు హాజరుకానున్నట్లు ప్రజ్వల్ రేవణ్ణ తెలిపారు. 'నన్ను తప్పుపట్టవద్దు, 31వ తేదీ ఉదయం 10 గంటలకు సిట్ ఎదుట హాజరవుతాను, సహకరిస్తాను. న్యాయవ్యవస్థను నమ్ముతాను, ఇవి నాపై తప్పుడు కేసులు. చట్టాన్ని నమ్ముతున్నాను' అని ఓ మీడియాతో చెప్పినట్లు సమాచారం. జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మనవడు అయిన 33 ఏళ్ల ప్రజ్వల్ రేవణ్ణ.. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన పలు సందర్భాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పలువురి మహిళలను లైంగికంగా వేధించిన పలు వీడియోలు బయటకు రావడంతో ఏప్రిల్ 26న అతను దేశం విడిచి వెళ్లిపోయాడు. కాగా.. ఈ ఆరోపణలను రేవణ్ణ 'రాజకీయ కుట్ర' అని పేర్కొన్నాడు. తాను డిప్రెషన్‌లో ఉన్నానని.. తన ఆచూకీ చెప్పనందుకు పార్టీ కార్యకర్తలకు ప్రజ్వల్ రేవణ్ణ క్షమాపణలు చెప్పారు. ప్రజ్వల్ విదేశాలకు పరారై నెల రోజులైంది. ఇప్పటి వరకు అతని ఆచూకీని స్పెషల్ ఇన్విస్టిగేషన్ ఫోర్స్ గుర్తించలేకపోయింది. నాలుగు సార్లు నోటీసులు, ఒక అరెస్టు వారెంటు, బ్లూ కార్నర్, రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయ్యాయి. దౌత్య పాస్‌పోర్టు రద్దు చేసేందుకు కేంద్ర విదేశాంగ శాఖ చర్యలు చేపట్టింది. విచారణకు హాజరు కావాలని ఆయన తండ్రి హెచ్‌డీ రేవణ్ణ, మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ బహిరంగ విన్నపాలు చేశారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ముగింపు వేడుకలు

పాటు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. జూన్ ఒకటిన గన్ పార్క్ అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్ వద్దనున్న అమరజ్యోతి వరకు సాయంత్రం 7 గంటలకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగాలు చేసిన అమరులకు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పిస్తారు. ఆవిర్భావం రోజున రాష్ట్రం వచ్చి దశాబ్దికాలం గడుస్తున్న నేపథ్యంలో దశాబ్ది ముగింపు వేడుకల సభను హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరుగనున్నది. అదేరోజున హైదరాబాద్‌లోని పలు దవాఖానాల్లో , అనాథ శరణాలయాల్లో పార్టీ ఆధ్వర్యంలో పండ్లు స్వీట్లు పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 3న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యాలయాల్లో.. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను, జాతీయ జెండాను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేయనున్నారు. తెలంగాణను సాధించి.. స్వరాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజల సహకారంతో దశాబ్దకాలం పాటు ప్రగతిని సాధించి దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలిపిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని కేసీఆర్ పునరుద్ఘాటించారు. చారిత్రక సందర్భంలో దశాబ్ది ముగింపు వేడులను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు గులాబీ దళపతి పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా కార్యకర్తలు, పార్టీ అందించే సూచనలను అనుసరించి ముగింపు వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కేసీఆర్ కోరారు.

## మ్యానిఫెస్టోలో వాగ్దానాలను 'అవినీతి'గా పరిగణించలేం

అభిప్రాయపడిన జస్టిస్ సూర్యకాంత, జస్టిస్ వీకే విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం.. తగిన సమయంలో దీనిపై నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొంది. రాజకీయ పార్టీల 'ఉచితాలు'కు సంబంధించిన ఓ కేసు సుప్రీంకోర్టులో పెండింగులో ఉంది. కర్ణాటకలో గతేడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో అనేక హామీలు ఇచ్చింది. చామరాజనగర్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బీ జెడ్ జమీర్ అహ్మద్‌ఖాన్ గెలుపొందారు. అయితే, ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఐదు హామీలు అవినీతి కిందకే వస్తాయని, అందుకే ఆ పార్టీ నుంచి గెలుపొందిన జమీర్‌ను పక్కన పెట్టాలని కోరుతూ శశాంక జె. శ్రీధర అనే ఓటరు స్థానిక హైకోర్టును ఆశ్రయించాడు.

**'ఉచితాలు' సరే.. నిధుల మాటేంటి?**

దీనిపై విచారించిన కర్ణాటక హైకోర్టు.. తాము అమలు చేయాలనుకుంటున్న విధానాల గురించి ఏదైనా పార్టీ ప్రకటించడాన్ని ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123 కింద అవినీతిగా పరిగణించలేమని పేర్కొంది. వాటిని సంక్షేమ విధానాలుగానే చూడాలని, ఆర్థికపరంగా అవి సరైనవేనా, కాదా అనేది వేరే విషయమని అభిప్రాయపడుతూ పిటిషన్‌ను కొట్టివేసింది. దీనిని సవాలు చేస్తూ శశాంక సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. సర్వోన్నత న్యాయస్థానం కూడా ఆయన వాదనను తోసిపుచ్చింది.

## ప్రశాంతంగా ముగిసిన పట్టభద్రుల పోలింగ్

బరిలో మొత్తం 52 మంది అభ్యర్థులు ఉన్నారు. అధికార కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా ప్రేమేందర్ రెడ్డి పోటీపడుతున్నారు.
. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దాంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. బరిలో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా ప్రేమేందర్ రెడ్డి పోటీపడుతున్నారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ సీనియర్ నేత, రాష్ట్ర మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని 457 నెంబర్ పోలింగ్ బూత్‌లో ఆయన తొలి ఓటు వేశారు. ఈ పోలింగ్ బూత్ పరిధిలో మొత్తం 673 మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ ప్రారంభానికి ముందే బూత్‌కు వచ్చిన జగదీశ్ రెడ్డి తొలి ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో పోలైన ఓట్లను లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మరుసటి రోజైన జూన్ 5న లెక్కించనున్నారు.

## అగ్నిపథ్ స్కీమ్‌ను రద్దు చేస్తాం

చెప్పారు. మరోవైపు.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల ఖాతాల్లో ప్రతి నెలా రూ.8,500 జమ చేస్తామని, మహిళలకు ఆర్థిక సాయం అందించడం వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితిలో మార్పులు వస్తాయని రాహుల్ గాంధీ తెలిపారు. మరోవైపు.. ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ కూడా బీజేపీపై విరుచుకుపడ్డారు. కుటుంబ సభ్యులెవరూ మోడీ ప్రసంగాన్ని వినడానికి ఇష్టపడేంతగా ప్రధాని భాష స్థాయి పడిపోయిందని అన్నారు. కాగా.. ప్రస్తుతం దేశంలోని నేతలంతా చివరి దశ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. పాట్నాలోని పాలిగంజ్‌లో భారత కూటమి బహిరంగ సభ జరిగింది. రాహుల్ గాంధీ, తేజస్వి, ఇతర నేతలు కూడా ఈ సమావేశానికి చేరుకున్నారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్, ఇతర భారత కూటమి నాయకులు వేదికపైకి చేరుకున్నారు. వేదిక అకస్మాత్తుగా విరిగిపోయింది. అయితే.. అదృష్టవశాత్తు ఎవరూ గాయపడలేదు. స్టేజ్ కూలిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. వేదిక కూలే సమయంలో మిసా భారతి రాహుల్‌గాంధీ చేయి పట్టుకుని నిలబడ్డారు. కొంత సమయం తర్వాత భద్రతా సిబ్బంది రాహుల్ వద్దకు చేరుకోగా.. తాను క్షేమంగా ఉన్నానని చెప్పడం వీడియోలో కనిపించింది. మరికొందరు నేతలు వేదికపై తేజస్వి యాదవ్ ను పట్టుకున్నారు. అంతకుముందు పాట్నాలోని భక్తియార్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ప్రసంగించారు. భారతీయ జనతా పార్టీని టార్గెట్ చేస్తూ పలు ప్రశ్నలు సంధించారు. కాగా.. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా దేశంలో ఇప్పటి వరకు 6 దశల పోలింగ్ పూర్తయింది. ఆరో దశ ఓటింగ్ మే 25న ముగిసింది. ఏడో, చివరి దశ లోక్‌సభ పోలింగ్ జూన్ 1న ఉంది. ఈ దశలో 57 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఏడు రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్ లో కూడా ఇదే దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. చివరి దశ ఎన్నికల ప్రచారంలో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

## అట్టహాసంగా రాష్ట్ర అవతరణ వేడుకలు



పెద్దఎత్తున కార్నివాల్ నిర్వహించనున్నట్టు సీఎస్ వివరించారు. శిక్షణ పొందుతున్న 5000మంది పోలీస్ అధికారులు బ్యాండ్ ప్రదర్శన ఇవ్వనున్నారని చెప్పారు. ట్యాంక్ బండ్‌పై దాదాపు 80స్టాళ్లను ఏర్పాటు చేసి హస్త కళలు, చేనేత, స్వయం సహాయక బృందాలు తయారు చేసిన పలు వస్తువులలతోపాటు నగరంలోని పేరొందిన హోటళ్లచే ఫుడ్‌స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పిల్లల కోసం పలు క్రీడలతో కూడిన వినోదశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం ఆకర్షణీయమైన బాణసంచా ప్రదర్శన, లేజర్ షో ఉంటుందన్నారు. ట్యాంక్ బండ్‌పై పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశమున్నందున వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సమీక్షలో సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని సూచించారు. సమావేశంలో డీజీపీ రవీ గుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు దాన కిశోర్, శైలజా రామయ్యర్, శ్రీనివాస రాజు, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, అడిషనల్ డీజీలు సంజయ్ కుమార్ జైన్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, నగర పోలీస్ అడిషనల్ కమిషనర్, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ హనుమంత రావు, ఎన్‌పీడీసీఎల్ ఎండీ ముషార్రఫ్, హెచ్ ఎండీఏ అడిషనల్ కమిషనర్ ఆమ్రపాలి కాటా పాల్గొన్నారు.

**పరేడ్ గ్రౌండ్ ఏర్పాట్లపై సమీక్ష**

పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పార్కింగ్ స్థలాలను కేటాయించేటప్పుడు ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు.

## నిఫ్టీ, సెన్సెక్స్ సరికొత్త రికార్డు

**న్యూఢిల్లీ, మే 27 (జనం సాక్షి) :**
ఇక డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ రూ.83.09 వద్ద ప్రారంభమైంది. సోమవారం ఇంట్రాడే ట్రేడింగ్ సెషన్ లో స్టాక్ మార్కెట్ సరికొత్త బెంచ్ మార్క్‌ను అందుకుంది. సెన్సెక్స్, నిఫ్టీ సరికొత్త రికార్డుల్ని నమోదు చేశాయి. ఎస్&పి బిఎస్ఈ సెన్సెక్స్ మొదటిసారిగా 76000 మార్క్ ను దాటింది. నిఫ్టీ 50 కూడా 500 పాయింట్లకు పైగా పెరిగి.. గరిష్ట స్థాయి 23,110.80కి చేరింది. మధ్యాహ్నం 1.26 గంటల ప్రాంతంలో సెన్సెక్స్ 495.85 పాయింట్లు పెరిగి 75,906.24 వద్ద, నిఫ్టీ 126.45 పాయింట్లు పెరిగి 23,083.55 వద్ద ఉన్నాయి. ముంబై దలాల్ స్ట్రీట్ లోనూ మార్కెట్ సూచీలు లాభాలను చూశాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐటీ స్టాక్ లు భారీ లాభాలను అందించాయి. నిఫ్టీ 50లో దివీస్ లాబొరేటరీస్, ఇండస్ ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్ లు లాభాలు పొందిన వాటిలో టాప్ 5లో ఉన్నాయి. అలాగే విప్రో, గ్రాసిమ్, ఓఎన్ జీసీ, అదానీ ఎంటర్ ప్రైజెస్, ఐషర్ మోటార్స్ టాప్ లూజర్ల జాబితాలో ఉన్నాయి. ఒక్కసారిగా కొత్తరికార్డులతో మదుపరులకు లాభాలతో ఆశలు చూపించిన స్టాక్ మార్కెట్లు చివరికి ఫ్లాట్ గా ముగిశాయి. దీంతో సెన్సెక్స్ ఫ్లాట్ గా ముగిసింది. నిఫ్టీ మాత్రం 22,900కి పైనే ముగిసింది. కేంద్రంలో బీజేపీనే మళ్లీ అధికారంలోకి వస్తుందన్న వార్తలు స్టాక్ మార్కెట్లను లాభాల బాటపట్టించాయి. జూన్ 4 ఫలితాల తర్వాత బీజేపీ దేశంలో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించనుందంటూ యూబీఎస్ అంచనా వేసింది. ఒకవేళ బీజేపీ 250 కంటే తక్కువ సీట్లు సాధిస్తే.. ఇన్వెస్టర్లు 10-20 శాతం నష్టపోయే అవకాశాలున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

## అగ్నిపథ్ స్కీమ్‌ను రద్దు చేస్తాం

**పాట్నా, మే 27 (జనం సాక్షి) :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా పాట్నాలోని భక్తియార్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఇండియా కూటమి ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అగ్నిపథ్ స్కీమ్‌ను రద్దు చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. జూన్ 4న ఇండియా కూటమి సంకీర్ణ ప్రభుత్వం రాబోతోందని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అగ్నివీర్ పథకాన్ని అంతం చేస్తామని పేర్కొన్నారు. నన్ను దేవుడే పంపించాడంటూ ఇటీవల మోడీ చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. జూన్ 4 తర్వాత అవినీతి గురించి ఈడీ మోడీని అడిగితే, నాకేమీ తెలియదు.. నన్ను పంపింది దేవుడే అని చెబుతారా అని ప్రశ్నించారు. దేశంలోని యువతకు ఉపాధి కల్పించడంలో మోడీ విఫలమయ్యారని ఆరోపించారు. మోడీ జీ సుదీర్ఘ ప్రసంగాలు చేయడం మానేయండి.. దేశాన్ని విభజించడానికి ప్రయత్నించవద్దని రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలోని యువతకు ఎంత ఉపాధి కల్పించారో, ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ముందుగా బీహార్ యువతకు చెప్పాలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 2 కోట్ల ఉద్యోగాల గురించి మాట్లాడిన మీరు ఒక్క యువకుడికి కూడా ఉద్యోగం ఇవ్వలేదని చెప్పారు. మరోవైపు.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల ఖాతాల్లో ప్రతి నెలా రూ.8,500 జమ చేస్తామని, మహిళలకు ఆర్థిక సాయం అందించడం వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితిలో మార్పులు వస్తాయని రాహుల్ గాంధీ తెలిపారు. మరోవైపు.. ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ కూడా బీజేపీపై విరుచుకుపడ్డారు. కుటుంబ సభ్యులెవరూ మోడీ ప్రసంగాన్ని వినడానికి ఇష్టపడేంతగా ప్రధాని భాష స్థాయి పడిపోయిందని అన్నారు. కాగా.. ప్రస్తుతం దేశంలోని నేతలంతా చివరి దశ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. పాట్నాలోని పాలిగంజ్‌లో భారత కూటమి బహిరంగ సభ జరిగింది. రాహుల్ గాంధీ, తేజస్వి, ఇతర నేతలు కూడా ఈ సమావేశానికి చేరుకున్నారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్, ఇతర భారత కూటమి నాయకులు వేదికపైకి చేరుకున్నారు. వేదిక అకస్మాత్తుగా విరిగిపోయింది. అయితే.. అదృష్టవశాత్తు ఎవరూ గాయపడలేదు. స్టేజ్ కూలిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వేదిక కూలే సమయంలో మిసా భారతి రాహుల్‌గాంధీ చేయి పట్టుకుని నిలబడ్డారు. కొంత సమయం తర్వాత భద్రతా సిబ్బంది రాహుల్ వద్దకు చేరుకోగా.. తాను క్షేమంగా ఉన్నానని చెప్పడం వీడియోలో కనిపించింది. మరికొందరు నేతలు వేదికపై తేజస్వి యాదవ్ ను పట్టుకున్నారు. అంతకుముందు పాట్నాలోని భక్తియార్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ప్రసంగించారు. భారతీయ జనతా పార్టీని టార్గెట్ చేస్తూ పలు ప్రశ్నలు సంధించారు. కాగా.. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా దేశంలో ఇప్పటి వరకు 6 దశల పోలింగ్ పూర్తయింది. ఆరో దశ ఓటింగ్ మే 25న ముగిసింది. ఏడో, చివరి దశ లోక్‌సభ పోలింగ్ జూన్ 1న ఉంది. ఈ దశలో 57 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఏడు రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్ లో కూడా ఇదే దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. చివరి దశ ఎన్నికల ప్రచారంలో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

## భారీగా గోల్డ్ స్మగ్లింగ్ యత్నానికి బిఎస్ఎఫ్ భగ్నం

**కోల్‌కొతా, మే 27 (జనం సాక్షి) :** గోల్డ్ స్మగ్లింగ్ ప్రయత్నాన్ని సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ జవాన్లు అడ్డుకున్నారు. ఒక ఇంటిని చుట్టుముట్టారు. గ్రామస్తుల సమక్షంలో తనిఖీ చేశారు. కోట్ల విలువైన బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు గ్రామంలోని ఒక ఇంట్లో స్మగ్లింగ్ కోసం భారీగా బంగారాన్ని దాచినట్లు బీఎస్ఎఫ్‌కు ఇంటెలిజెన్స్ సమాచారం అందింది. కాగా, బీఎస్ఎఫ్ అధికారులు, జవాన్లు ఆదివారం ఆ ఇంటిని చుట్టుముట్టారు. గ్రామస్తుల సమక్షంలో ఆ ఇంట్లో సోదాలు చేశారు. లోపల దాచిన 86 బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. 16.07 కేజీల బరువున్న గోల్డ్ బిస్కెట్ల విలువ రూ.12 కోట్లకుపైగా ఉంటుందని బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి దీని గురించి ప్రశ్నిస్తున్నారు.

## వారంలో చెన్నై ఎయిర్‌పోర్టును పేల్చేస్తాం..

**చెన్నై, మే 27 (జనం సాక్షి) :** దేశంలోని చాలా ప్రాంతాలకు ఈ మధ్యకాలంలో బెదిరింపులు తీవ్రమయ్యాయి. ఈ జాబితాలోకి చెన్నై కూడా చేరిపోయింది. వారం రోజుల్లో చెన్నై ఎయిర్‌పోర్టును పేల్చేస్తామంటూ ఈ మెయిల్స్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. దీంతో విమాన సిబ్బంది అలర్ట్ అయ్యారు. పోలీసులు, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగాయి. అంతేకాదు ప్రతీ ప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులపై ఓ కన్నేశారు. సీసీ కెమెరాల ద్వారా పదేపదే ఎయిర్‌పోర్టు వచ్చేవాళ్ల పై నిఘా పెట్టారు. నకిలీ వెబ్‌సైట్ల నుంచి ఈ-మెయిల్ పంపించినట్టు సమాచారం. దీని వెనుక డ్రగ్స్ ముఠా ఉంటుందని అనుమానిస్తున్నారు అధికారులు. రెండు రోజులుగా విమానాశ్రయం మొత్తాన్ని గాలిస్తున్నారు పోలీసులు. ఇటీవలకాలంలో చెన్నై ఎయిర్‌పోర్టు లో భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుబడుతోంది. విదేశాల నుంచి భారీగా రావడంతో భద్రతను కట్టుదిట్టం చేశారు . ఈ బెదిరింపుల వెనుక డ్రగ్స్ ముఠాల ప్రమేయం ఉండవచ్చని భావిస్తున్నారు. అయినా అధికారులు వాళ్ల పనిలో వాళ్లు నిమగ్నమయ్యారు. ఈ మధ్యకాలంలో ఢిల్లీలో కూడా ఇలాంటి హడావుడి మొదలైంది. సరిగ్గా వారం కిందట ఢిల్లీ నార్త్ బ్లాక్‌లో ఉన్న హోంమంత్రి కార్యాలయానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. అధికారులు డాగ్ స్క్వాడ్, డిస్పోజల్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. అంతేకాదు ఢిల్లీలోని ముఖ్యమైన స్కూల్స్, ఆసుపత్రులకు ఆ తరహా బెదిరింపులు వచ్చాయి. ఎవరు, ఎక్కడ నుంచి పంపిస్తున్నారనేది మాత్రం తెలియరాలేదు.

## తీరం దాటిన రెమాల్ తుఫాన్

తరలించారు. తుపాను కారణంగా బంగ్లాదేశ్ లో ఇద్దరు మరణించారు. తీర ప్రాంతాల్లో భారీగా వరదలు సంభవించే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి కోల్‌కతాలో విమాన సర్వీసులను నిలిపివేశారు అధికారులు. అలాగే తూర్పు, ఆగ్నేయ ప్రాంతాలకు వచ్చే, వెళ్లే రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. సహాయక చర్యల కోసం 16 బెటాలియన్లు, విపత్తు నిర్వహణ దళాలు సిద్ధంగా ఉన్నాయి. తుపాను కారణంగా నేలకూలిన చెట్లను తొలగించి, కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసే పనుల్లో విపత్తు నిర్వహణ బృందాలు నిమగ్నమయ్యాయి. తుపాను తీరం దాటి అల్పపీడనంగా బలహీన పడినా.. భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ స్పష్టం చేసింది. ప్రజలు ఇళ్లలోనే ఉండి.. తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాల్లో రేపటి వరకూ విస్తారంగా వర్షాలు కురుస్తారని తెలిపింది. మరోవైపు పశ్చిమ గాలుల ప్రభావంతో ఏపీ, యానాంలలో ఉక్కపోత మరింత పెరుగుతుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. అలాగే సాధారణం కంటే 2-4 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని, ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించారు. ఈ నెల చివరినాటికి నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని చెప్పారు. మహానగరంలో గరిష్టంగా గంటకు 74 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచగా, నగరం యొక్క ఉత్తర శివార్లలోని డమ్ డమ్ గరిష్టంగా 91 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్లు వాతావరణ కార్యాలయం తెలిపింది. కోల్‌కతాలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉండి, బాధిత నివాసితుల కష్టాలను మరింత పెంచాయి. దక్షిణ కోల్‌కతాలోని బల్లీగంజ్, పార్క్ సర్కస్, ధాకురియా మరియు అలీపూర్, పశ్చిమాన బెహలా మరియు ఉత్తరాన కాలేజ్ స్ట్రీట్, థాంథానియా కాలీ బారీ, %జ=% అవెన్యూ మరియు సింథిలోని ముఖ్యమైన పాకెట్‌లలోని వీధులు నీటిలో మునిగిపోయాయి. మరోవైపు.. సదరన్ అవెన్యూ, లేక్ ప్లేస్, చెట్లా, డిఎల్ ఖాన్ రోడ్, డఫెరిన్ రోడ్, బల్లిగంజ్ రోడ్, న్యూ అలీపూర్, బెహలా, జాదవ్‌పూర్, గోల్‌పార్క్, హతిబాగన్, జగత్ ముఖర్జీ పార్క్, కాలేజ్ స్ట్రీట్ పక్కనే ఉన్న అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకూలినట్లు నివేదికలు సూచించాయి.

కోల్‌కతాలో దాదాపు 68 చెట్లు నేలకూలాయి. సమీపంలోని సాల్ట్ లేక్, రాజర్‌హత్ ప్రాంతాల్లో మరో 75 చెట్లు నేలకూలాయి. తుఫాను కారణంగా దిఘా, కాక్‌ద్వీప్ మరియు జయనగర్ వంటి ప్రాంతాల్లో బలమైన గాలులతో వర్షం కురిసింది. ఇది సోమవారం ఉదయం తీవ్రమైంది. దక్షిణ బెంగాల్‌లోని ఇతర ప్రాంతాలలో హల్దియా (110 మిమీ), తమ్‌లుక్ (70 మిమీ) మరియు నింపిత్ (70 మిమీ) భారీ వర్షపాతం నమోదైంది. ఉత్తర మరియు దక్షిణ 24 పరగణాలు, పుర్బా మేదినీపూర్ జిల్లాలు విస్తృతంగా నష్టపోయినట్లు నివేదికలు పేర్కొన్నాయి. కోల్‌కతా, నదియా, ముర్షిదాబాద్‌తో సహా దక్షిణాది జిల్లాల్లో మంగళవారం ఉదయం వరకు బలమైన ఉపరితల గాలులతో పాటు ఒకటి లేదా రెండు స్పెల్స్‌తో తీవ్రమైన వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేశారు.

## వచ్చేది మళ్లీ మోడీ ప్రభుత్వమే


**న్యూఢిల్లీ, మే 27 (జనం సాక్షి) :**
కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇండియా కూటమి దుమ్ము తుడిచిపెట్టుకుపోయిందని దుయ్యబట్టారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ 40 సీట్లు కూడా దాటదు, సమాజ్‌వాదీ పార్టీకి నాలుగు సీట్లు కూడా రావని ఆరోపించారు. అనంతరం.. సేలంపూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని బెల్తార రోడ్ హల్దీరాంపూర్‌లో బీజేపీ అభ్యర్థి రవీంద్ర కుష్వాహకు మద్దతుగా జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. ఈ ఎన్నికలు రామభక్తులపై కాల్పులు జరిపిన వారికి, రామమందిరం కట్టిన వారికి మధ్య జరిగే ఎన్నికలని అన్నారు. విభజన సందర్భంగా ఎపికి ఒనగూర్చే ప్రయోజనాల విషయంలో కేంద్రం ఓ రకంగా చేతులు ఎత్తేసిందనే చెప్పాలి. కానీ చాలానే చేశామని బిజెపి ప్రకటించుకుంది. పైగా విశాఖ ఉక్కును తెగనమ్మే ప్రయత్నం చేసింది. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి వైఫల్యాలు అనేకం. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నా ఒక్కటంటే ఒక్క మేలు చేయలేదు. అయినా ఎపిలో గణనీయంగా సీట్లు గెల్చుకో బోతన్నట్లు కేంద్రహోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా వచ్చేది ఎన్డీయే సర్కారేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీలతో కలిసి భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని సంపూర్ణ ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో తాము దాదాపు 17 లోక్‌సభ స్థానాలను గెల్చుకుంటామనీ విశ్వాసం వ్యక్తం చేశారు. సార్వత్రిక సమరంలో దేశవ్యాప్తంగా 400కుపైగా సీట్లు సాధిస్తామన్నారు. దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సమయం వచ్చేసిందని షా అన్నారు. వాటితో ఎన్నికల వ్యయం దిగివస్తుందని పేర్కొన్నారు. మండే ఎండల్లో కాకుండా, మరేదైనా సమయంలో సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడంపై కూడా దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్‌లలోనూ ఈ దఫా కమలదళం ప్రభుత్వాలను ఏర్పాటుచేస్తుందని జోస్యం చెప్పారు. ఓ ప్రముఖ వార్తాసంస్థతో ఆయన పలు అంశాలపై మాట్లాడుతూ ఎపిలో ఎన్‌డిఎ అధికారంలోకి వస్తుతందని అన్నారు. ఈసారి అధికారంలోకి వచ్చాక.. ఐదేళ్ల కాలంలో విస్తృత సంప్రదింపుల అనంతరం దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని తాము అమలు చేయనున్నట్లు షా చెప్పారు. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే కాకుండా, విపక్ష పార్టీల పాలనలోని రాష్ట్రాల్లోనూ ఈ దఫా తమకు మెరుగైన ఫలితాలు వస్తాయని షా ధీమాగా పేర్కొన్నారు. 147 సీట్లున్న ఒడిశా అసెంబ్లీలో కమలదళం 75 స్థానాలు గెల్చుకుంటుందని అంచనా వేశారు. ఆ రాష్ట్రంలో 16-17 ఎంపీ సీట్లను తమ ఖాతాలో వేసుకుంటామని జోస్యం చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 17, పశ్చిమ బెంగాల్‌లో 24-32 లోక్‌సభ స్థానాలు ఎన్డీయేకు దక్కుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. యూసీసీని అమల్లోకి తీసుకురావాల్సిన బాధ్యతను రాజ్యాంగ నిర్మాతలు పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల భుజస్కంధాలపై ఉంచారని షా పేర్కొన్నారు. రాజ్యాంగ పరిషత్ నిర్దేశిరచిన మూలసూత్రాల్లో యూసీసీ కూడా ఉందని చెప్పారు. తమ సర్కారు మూడోసారి అధికారంలోకి వచ్చాక.. అన్ని వర్గాలతో సంప్రదింపులు జరిపి వచ్చే ఐదేళ్లలో దాన్ని అమల్లోకి తీసుకొస్తుందని స్పష్టం చేశారు. సాయుధ బలగాల్లో నియామకం కోసం మోదీ సర్కారు తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకంపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తుండటాన్ని షా తప్పుబట్టారు. అగ్నిపథ్ కంటే ఆకర్షణీయ పథకం యువతకు ఇంకొ కటి ఉండదన్నారు. నాలుగేళ్ల సర్వీసు అనంతరం పదవీవిరమణ పొందే అగ్నివీర్‌లకు రిజర్వేషన్ కారణంగా కేంద్ర సాయుధ పోలీసు దళాల్లో ఉద్యోగావకాశాలు 7.5 రెట్లు అధికంగా ఉంటాయని తెలిపారు. అగ్నిపథ్‌ను సరిగా అర్థం చేసుకోకుండా.. దాన్ని రద్దు చేస్తామని హామీ ఇస్తున్న రాహుల్ గాంధీని చూస్తుంటే జాలేస్తోంద న్నారు. ఏకీకృత వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానాన్ని తీసుకొస్తా మంటూ కాంగ్రెస్ హామీ ఇస్తోందని షా తెలిపారు. ధనవంతులు ఉపయోగించే విలాస వస్తువులపై, పేదలు వాడే సరకులపై ఒకే పన్ను రేటును అమల్లోకి తీసుకురావడం ఎలా సముచితమని ప్రశ్నించారు.
సార్వత్రిక ఎన్నికల్లో తామేమీ మతం ఆధారిత ప్రచారం చేయడం లేదని షా స్పష్టం చేశారు. ఒకవేళ ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడటం, ఆర్టికల్-370 రద్దును చూపుతూ ఓట్లు అడగడం, యూసీసీని అమలు చేస్తామని చెప్పడం మతం ఆధారిత ప్రచార కార్యకలాపాలే అయితే.. భాజపా అలాంటి ప్రచారం చేసిందని, ఇకముందూ కొనసాగిస్తుందని స్పష్టంచేశారు. ఈవీఎంలు, పోల్ డేటాకు సంబంధించి ఈసీపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తుండటాన్ని షా తప్పుబట్టారు. భాజపా ఓడిపోయిన తెలంగాణ, కర్నాటక హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లోనూ ఇప్పుడు అనుసరించిన విధానాలనే ఈసీ అనుసరించిన సంగతిని గుర్తుచేశారు. ఓటమిని ముందుగానే గ్రహించి.. రాహుల్ వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకే పోలింగ్ విధానంపై కాంగ్రెస్ ప్రశ్నలు లేవనెత్తుతోందంటూ ఎద్దేవా చేశారు. దేశంలో నక్సలిజం సమస్య అంతమవుతుందని షా ఉద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని ప్రాంతాల్లో తప్ప మరెక్కడా మావోయిస్టులు లేరని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఈసారి వేర్పాటువాదులు కూడా అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని షా అన్నారు. అక్కడ పోలింగ్ ప్రశాంతంగా ముగియడం మోదీ ప్రభుత్వం సాధించిన విధానపరమైన విజయమని పేర్కొన్నారు.

# తరుచూ లారీ ప్రమాదాలు

**భూపాలపల్లిలో 15 రోజుల వ్యవధిలో రెండు ఘటనలు**

- ఉత్సవ విగ్రహాలుగా అధికారులు
- శృతి మించుతున్నా ప్రమాదాలను అరికట్టడంలో విఫలం



**భూపాలపల్లిలో లారీ ప్రమాదాలు శృతిమించుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ఈ ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. లారీలతో ప్రమాదాలు పెరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఉత్సవ విగ్రహాలుగానే ఉండడం పలు విమర్శలకు తావిస్తుంది. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు జిల్లాలో సర్వత్రా వినిపిస్తున్నాయి.**

**– జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, మే 27 (జనంసాక్షి):**

గత కొద్ది నెలల క్రితం భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ సమీపంలో రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన వాహనాలపైకి లారీ దూసుకెళ్లిన ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గత 15 రోజుల క్రితం మంజూర్ నగర్ సింగరేణి ఏరియా హాస్పిటల్ వద్ద గల బస్సుషెల్టర్ లోకి లారీ దూసుకెళ్లగా ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరికొందరు. ఈ సంఘటన జరిగి 15 రోజుల్లోనే ఆదివారం తెల్లవారుజామున కర్కపల్లి లో మరో లారీ అదుపుతప్పి చెట్లను ఢీకొంటుకుంటూ వెళ్లి చివరికి ఓ తాటిచెట్టును తాకి ఆగింది ఈ సంఘటనలో లారీ డ్రైవర్ గాయాలతో బయటపడ్డాడు. తెల్లవారుజామున కావడంతో ఆ ప్రాంతంలో ఎవరు లేని కారణంగా పెద్ద ప్రమాదం తప్పినట్లు అయింది. తరచూ భూపాలపల్లి, పరకాల ప్రధాన రహదారిపై లారీలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. వరుసగా జరుగుతున్న లారీ ప్రమాదాలతో ఈ ప్రాంత ప్రజల్లో భయాందోళన మొదలైంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో బిక్కు బిక్కుమంటూ ఈ రోడ్డు వెంట ప్రయాణాలు చేస్తున్నారు.

**ప్రమాదాల నివారణకు చర్యలు శూన్యం..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నా నివారణ చర్యలు శూన్యమయ్యాయి. జిల్లాలో లారీల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తుంది. ఆటు సింగరేణి బొగ్గు, ఇటు ఇసుక కోసం లారీలు నిత్యం ప్రధాన రహదారిపై తిరుగుతున్నాయి. వందలాది లారీలు భూపాలపల్లి ప్రధాన రహదారి మీదుగా వెళు తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం ఈ ప్రాంత ప్రజల్లో పట్టుకుంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ప్రమాదాలకు కారణాలను వెతికి ఆ దిశగా నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. లారీ డ్రైవర్ల నిద్రలేమి కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయా.. లేక క్లీనర్లే లారీలను నడుపుతుండడం వల్ల అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయా.. అనేదానిపై అధికారులు లోతుగా విచారణ జరిపి అవగాహన కార్యక్రమాలు చేపట్టి ముందు చూపుతో వెళ్లాల్సిన అధికారులు ఆ వైపు చర్యలేమి తీసుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసు, ఆర్టీవో అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ, యజమానులకు, డ్రైవర్లకు, క్లీనర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా ఆ వైపు చర్యలేమి చేపట్టకుండా నిద్ర మత్తులో ఉండడం కారణంగానే జిల్లాలో లారీలు విచ్చలవిడిగా నడుపుతూ ప్రమాదాలకు గురి చేస్తున్నారని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లాలోని ప్రజలు కోరుతున్నారు.

# ఎమర్జెన్సీ కంటే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దారుణమైన కేసు

- రాజ్యాంగ మౌలిక సూత్రాలనే ఉల్లంఘించిన కేసీఆర్
- రాధాకిషన్ రావు వాంగ్మూలమే ఇందుకు నిదర్శనం
- కేసీఆర్ ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?
- రేవంత్ కు చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్ట్ చేసి ప్రాసిక్యూట్ చేయాలి
- సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



**హైదరాబాద్, మే 27 (జనంసాక్షి) :** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఎమర్జెన్సీ కంటే దారుణమైన కేసని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు రాధాకిషన్ రావు పోలీసుల విచారణలో వెల్లడించారని, రాధాకిషన్ రావు కన్ఫెషన్ స్టేట్ మెంట్‌ను పరిశీలిస్తే ప్రతిపక్షాలపై ముఖ్యంగా బీజేపీపై దాడి కోసమే ఫోన్ ట్యాపింగ్ ను ఉపయోగించుకున్నట్లు అర్థమవుతోందని ఆయన తెలిపారు. లిక్కర్ కేసులో అడ్డంగా దొరికిన బిడ్డను కాపాడుకునేందుకే కేసీఆర్ ఎమ్మెల్యేల కొనుగోలు అంశాన్ని సృష్టించినట్లు రాధాకిషన్ రావు స్టేట్ మెంట్ తో తేలిపోయిందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలుగా తమకున్న ప్రత్యేకమైన హక్కులను కాపాడటం దేవుడెరుగు, దేశ పౌరుడికి ఉండే కనీస ప్రాథమిక హక్కులను కూడా ఫోన్ ట్యాపింగ్‌తో కేసీఆర్ కాలరాశాడని, ఫోన్లో భార్యాభర్తల మాట్లాడుకునే అంశాలను కూడా ట్యాపింగ్ చేయడం ద్వారా కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేసేందుకు యత్నించాడని దుయ్యబట్టారు. ఇట్లాంటి దుర్మార్గులు ఎమ్మెల్యేగానే కాదు.. భవిష్యత్తులో రాజ్యాంగబద్ధంగా ఏ పదవి చేపట్టడానికి కూడా అర్హులు కాదన్నారు. పొరపాటున మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తే ఇదే పని చేస్తారన్నారు. ఆయనపై తక్షణమే అనర్హత వేటు వేయాలి. మళ్లీ ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ లో కేసీఆర్ పాత్ర ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు అమెరికాలోనే ఉన్నట్లు తెలిసినా ఎందుకు భారత్ కు రప్పించలేకపోతున్నారని, ప్రభాకర్ రావును అరెస్ట్ చేస్తే మరిన్ని వాస్తవాలు బయటకొచ్చే అవకాశముంది కదా? అయినా ఎందుకు ఆ పని చేయడం లేదని ప్రశ్నించారు. తక్షణమే కేసీఆర్ ను అరెస్ట్ చేసి ప్రాసిక్యూషన్ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం నమ్మకం ఉన్నా ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకుని తక్షణమే సీబీఐకి లేఖ రాయాలని, సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని, ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ ను అనర్హుడిగా ప్రకటించే అంశంపైనా శాసనసభ స్పీకర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# విద్యుద్ఘాతంతో ఇద్దరు మృతి



**చిట్యాల /మొగుళ్లపల్లి మే 27 (జనంసాక్షి) :** విద్యుత్ షాక్ తో ముదుతనపెల్లి రామ లక్ష్మి, మనవడు దుంప సాయి చరణ్ మృతి చెందిన సంఘటన సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రెండు మండలాలలో విషాద ఛాయలు అల్లుకున్నాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మొగుళ్ళపల్లి మండలంలోని పిడిసిల్ల గ్రామానికి చెందిన దుంప సుధాకర్ అత్త ముదుతనపెల్లి రామలక్ష్మి బట్టలు ఉతికి దండెంపై ఆర వేయుచుండగా కరెంటు షాక్ తగిలింది దీంతో కుమారుడు సాయి చరణ్ వైరును పక్కకు నెట్టుచున్న క్రమంలో విద్యుత్ వైరు తాకి అక్కడికక్కడే మృతి చెందారని దుంప సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.కాగా జెడ్పిటిసి గొర్రె సాగర్ మండల కేంద్రంలోని సామాజిక కేంద్రంలో ముదుతనపెల్లి లక్ష్మి, దుంప సాయి పార్థివదేహానికి నివాళులు అర్పించి తమ సంతాపం తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు తౌటం నవీన్, లాండ్ శివాజీ, రాజు, పాండ్రాల వీరస్వామి, శేరి రవీందర్ పాల్గొన్నారు.

# నాగోల్ హోటల్‌లో కుప్పకూలిన లిఫ్ట్

- 8మందికి తీవ్ర గాయాలు..పోలీసుల దర్యాప్తు





**హైదరాబాద్, మే 27 (జనంసాక్షి) :** శుభమా అని కూతురి ఎంగేజ్‌మెంట్ చేసుకుంటుంటే లిఫ్ట్ ప్రమాదం ఇరు కుటుంబాలను ఇబ్బందికి గురి చేసింది. నాగోల్ పీఎస్ పరిధి సాయినగర్ కినార గ్రాండ్ హోటల్‌లో సాంకేతిక లోపంతో లిఫ్ట్ ప్రమాదం జరిగింది. నాగోల్‌కు చెందిన మాల్యాద్రి అనే వ్యాపారి కుమార్తె ఎంగేజ్‌మెంట్ వేడుక కినార గ్రాండ్ హోటల్లో నిర్వహించారు. 8 మంది అతిథులు ఫోర్త్ ఫ్లోర్ నుంచి లిఫ్ట్‌లో కిందకు వెళుతుండగా సాంకేతిక లోపంతో సెల్లార్ వరకూ అతివేగంగా చేరుకుంది. భయాందోళనలకు గురైన వారు కేకలు పెట్టారు. సెక్యూరిటీ సిబ్బంది లిఫ్ట్ డోర్స్ విరగ గొట్టి లోపల ఉన్న వారిని బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి కాళ్లు ఫ్రాక్చర్ అయ్యాయి. మరో ముగ్గురు స్వల్ప గాయాలయ్యాయి. స్వల్ప గాయాలైన ముగ్గురినీ108 వాహనంలో కామినేని ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు మాత్రం క్షేమంగానే ఉన్నట్టు తెలుస్తోంది. వీరబ్రహ్మం, రవిశంకర్ రెడ్డి, మణికొండ గుప్తాలకు స్వల్ప గాయాలు కాగా.. మనోహర్, షాహిద్ బాబా, కళ్యాణ్ కుమార్ల కాళ్లకు ఫ్రాక్చర్ అయినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్‌హెచ్‌ఓ పరశురామ్, ఎస్ఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మాల్యాద్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమయంలో లిఫ్ట్‌లో ఎంత మంది ఉన్నారన్నది తెలియరాలేదు. అయితే ఎనిమిది మందికి తీవ్రగాయాలైనట్లు తెలుస్తోంది. వీరంతా హోటల్‌లో జరిగిన ఎంగేజ్ మెంట్ ఫంక్షన్‌కి వచ్చినట్లు తెలుస్తుంది. గాయపడినవారిని వెంటనే ఎల్బీ నగర్ కామినేని ఆసుపత్రికి హుటాహుటిన తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి

- రాష్ట్రంలోనే తొలిసారి పెట్రోల్ బంక్ నిర్వహణ
- రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, మే27 (జనంసాక్షి) :** దేశంలోని ఈ ప్రాంతాల్లో తొలిసారిగా ట్రాన్స్‌జెండర్లు నిర్వహిస్తున్న ఇంధన బంక్ త్వరలో జిల్లాలో ప్రారంభం కానుంది. రాజన్న-సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఇంధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. లింగమార్పిడి వ్యక్తుల (హక్కుల పరిరక్షణ) చట్టం 2019లో భాగంగా, గుర్తింపు కార్డులను జారీ చేయడంతో పాటు లింగమార్పిడి చేయించుకున్న వారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వాలు స్వయం ఉపాధి కార్యక్రమాలను ప్రవేశపెడుతున్నాయి. గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవకాశం కల్పించేందుకు, వివిధ స్వయం ఉపాధి యూనిట్లను స్థాపించడానికి ఇప్పటికే కొంతమంది ట్రాన్స్‌జెండర్లకు వంద శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయబడ్డాయి. వారిలో కొందరు ఫోటో స్టూడియోలు , ఇతర యూనిట్లను స్థాపించగా, మరికొందరు టాక్సీ వాహనాలను కొనుగోలు చేశారు. సంప్రదాయ ఉపాధి యూనిట్ల నుంచి ఒక అడుగు ముందుకు వేసి ట్రాన్స్‌జెండర్లతో ఇంధన బంక్‌ను నిర్వహించాలనే ఆలోచనతో జిల్లా యంత్రాంగం ఈ ఏడాది జనవరిలో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఫిబ్రవరిలో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఈ ప్రాజెక్టుపై చర్చించడమే కాకుండా ఇంధన కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం సిరిసిల్ల పట్టణ శివారులోని వీవింగ్ పార్కు సమీపంలోని మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న రెండో బైపాస్ రోడ్డులో 10 గుంటల ప్రభుత్వ భూమిని గుర్తించి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) ఇప్పటికే ఒక ఇంధన బంక్‌ను మంజూరు చేసింది, ఇది రూ.3 కోట్లతో స్థాపించబడుతుంది. ఇంధన కేంద్రం పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఇంధన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్న జిల్లా యంత్రాంగం ట్రాన్స్‌జెండర్లకు నిర్వహణ బాధ్యతలు అప్పగించనుంది. 15 మంది ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యక్షంగా, మరో 10 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అధికారులు తెలిపారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పూజారి గౌతమి ఇటీవల ట్రాన్స్‌జెండర్ల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజ్యం తెలంగాణ టుడేతో మాట్లాడుతూ .. ట్రాన్స్‌జెండర్లకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని ఇంధన కేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. పెద్ద ప్రాజెక్ట్ కావడంతో దాన్ని మెయింటెయిన్ చేయగలమా అనే సందిగ్ధంలో పడ్డారు ట్రాన్స్ జెండర్లు. వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు పరిపాలన యంత్రాంగం కొద్దిరోజుల్లోనే శిక్షణ ఇవ్వనుంది. ఈ ప్రయోజనం కోసం వీ-హబ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది . ట్రాన్స్‌జెండర్లు ముందుకు రాకుంటే, ఫిజికల్ వికలాంగులకు ఇంధన స్టేషన్‌ను అప్పగిస్తామని చెప్పారు. ట్రాన్సజెండర్ మహిళ బి మధుష మాట్లాడుతూ ఇంధన కేంద్రం ద్వారా తమకు శాశ్వత ఉపాధి లభిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా మన్నారు. మరో ట్రాన్స్‌జెండర్ మహిళ పి సుప్రియ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో జీవితాన్ని గడపడానికి ఇదొక గొప్ప అవకాశం.



# రియల్ వ్యాపారి దారుణ హత్య

- కిడ్నాప్ చేసి హత్య చేసినట్లు గుర్తింపు

**హైదరాబాద్, మే27 (జనంసాక్షి) :** మేడ్చల్ జిల్లా జీడిమెట్ల పరిధిలో సోమవారం దారుణం జరిగింది. చింతల్ లో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి దారుణంగా హతమార్చారు. ఈ నెల 24న చింతల్‌లో బిల్డర్ మధు అదృశ్యమయ్యారు. అనంతరం కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ లో ఆయన మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మధును దుండగులు కిడ్నాప్ చేసి హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. దుండగులు బండరాయితో మోది కత్తితో పొడిచి హతమార్చారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వ్యాపారిని కిడ్నాప్ చేసిన వారే హతమార్చి ఉంటారని అనుమానిస్తున్నారు. ఆయన దగ్గర ఉన్న రూ.5 లక్షల నగదు, విలువైన ఆభరణాలు మాయమయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం అయ్యి ఉండొచ్చని తెలుస్తోంది.

# ఏసీబీ వలలో అగ్రికల్చర్ ఏవో

- 38 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వైనం



**ఆసిఫాబాద్, మే 26 (జనంసాక్షి) :** దహెగం మండల కేంద్రంలోఅవినీతికి పాల్పడిన వ్యవసాయ అధికారి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణం రేనువల్ కోసం వ్యవసాయ అధికారిని సంప్రదించగా 38000 రూపాయలు ఇస్తేనే రేనువల్ చేస్తానని ఏఓ అనడంతో ఏసీబీ అధికారులను సంప్రదించిన బద్యుతుడు సోమవారం రోజున ముప్పై ఎనిమిది వేల రూపాయలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

## గుర్రం రాజిరెడ్డి పై సస్పెక్ట్ షీట్ తెరిచిన కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ



**కరీంనగర్ బ్యూరో, మే 27 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన గుర్రం రాజిరెడ్డి 45 (తండ్రి మల్లారెడ్డి) అక్రమంగా భూ ఆక్రమణలకు పాల్పడి పలు కేసుల్లో నిందితుడిగా వుండడమేగాక , వివిధ నేరాల్లో సైతం చురుకుగా ఉంటున్నాడని శాంతి భద్రతల దృష్ట్యా అతనిపై చట్టపరంగా సస్పెక్ట్ షీట్ తెరిచే అవసరమున్నదని కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి అభ్యర్థన మేరకు కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఎ.ప్రదీప్ కుమార్ సిఫారసు చేయగా కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ నిందితుడు గుర్రం రాజిరెడ్డి పై సస్పెక్ట్ షీట్ తెరిచారు. అట్టి ఉత్తర్వులు సోమవారం నాడు వెలువడ్డాయని ఈ నేరస్థుడైన గుర్రం రాజిరెడ్డి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు కదలికలను గమనించాలని కొత్తపల్లి ఎస్సైని రూరల్ ఏసీపీ ఆదేశించారు.

# దేశం ఈ స్థాయిలో ఉందంటే నెహ్రూనే కారణం

- వ్యవసాయంలో, పారిశ్రామికంగా దేశం ఎంతో అభివృద్ధి
- జాతీయ జెండా ఎగరవేసింది కాంగ్రెస్ పార్టీ నే
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆశాభావం

**హైదరాబాద్, మే27 (జనంసాక్షి) :** జాతీయ జెండా ఎగరవేసింది కాంగ్రెస్ పార్టీ నే అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. దేశ తొలిప్రదాని జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఇందిరా భవన్ లో కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశం ఈ స్థాయిలో ఉందంటే దానికి కారణం నెహ్రూ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో వ్యవసాయానికి, పారిశ్రామికంగా దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కొన్ని దృష్ట శక్తులు దేశానికి ఆయన చేసిన సేవలు , త్యాగాన్ని తగ్గించేందు కుట్ర చేస్తున్నారని తెలిపారు. కాశ్మీర్ అంశం అప్పుడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చేర్చిన అంశమే ఉన్నప్పుడు ఆర్టికల్ 370డి అన్నారు. స్వాతంత్రం ఎప్పుడు వచ్చింది కాంగ్రెస్ ఆద్వర్యంలో కాదా? అని ప్రశ్నించారు. జాతీయ జెండా ఎగరవేసింది కాంగ్రెస్ పార్టీ నే అన్నారు. కాంగ్రెస్ నేతలను విమర్శించడం సరికాదన్నారు.దేశంలో మతసామరస్యం కాపాడాల్సిన ప్రధాని నే.. మత విద్వేషం పెంచుతున్నారని మండిపడ్డారు. ఆర్థిక వెనుకబాటు తనం కారణం తో రిజర్వేషన్లు ఇస్తున్న మోడీ.. ఆ కోటా లో మైనార్టీలు కూడా బెనిఫిట్ పొందుతున్నారని తెలిపారు. తెలంగాణకి వచ్చి మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేస్తా అంటాడన్నారు. పదేళ్ళలో హిందు సమాజం కి బీజేపీ ఏదైనా లబ్ది చేకూర్చారా..? అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలో 75 శాతం హిందు సమాజం.. ఈబీడబ్లూసీ రిజర్వేషన్లు లో లబ్ది చేకూర్చకుండా చేసింది మోడీ కదా..? అని మండిపడ్డారు. తెలంగాణలో 4 శాతం మైనార్టీ రిజర్వేషన్లు తొలగిస్తే ఈబీడబ్లూసీ రిజర్వేషన్ లో లబ్ది పొందరా..? అని ప్రశ్నించారు. ముస్లిం రిజర్వేషన్ ఇస్తున్నది మోడీ అన్నారు. ఆర్థిక వెనుకబాటు ఆధారంగా రిజర్వేషన్ ఇచ్చింది మేము అన్నారు. దళితులు బీసీ,ఎస్టీల హక్కులు బీజేపీ కాల రాస్తోందన్నారు. మత విద్వేషాలు పెంచి బీజేపీ లబ్దిపొందాలని చూస్తున్నారన్నారు. కానీ హిందువులకు మేలుచేసింది ఏం లేదన్నారు.

# ఆకలి చక్రాన్ని విచ్ఛిన్నం చేయడమెలా?

ఆకలితో ఉన్నవారికి ముందు అన్నం పెట్టు, ఆ తర్వాత వేదం చెప్పు అంటారు స్వామి వివేకానంద. గాలి, నీరు తర్వాత ఆహారం మూడవ అత్యంత ప్రాథమిక మానవ అవసరం. ప్రతి ఒక్కరికి తగిన ఆహారం పొందే హక్కు ఉంది. ఆహారం, జీవితం, స్వేచ్ఛ,పని, విద్య వంటి మానవ హక్కులు యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ మరియు అంతర్జాతీయ ఒప్పందాల ద్వారా గుర్తించబడ్డాయి. ప్రపంచవ్యాప్త పురోగతి ఉన్నప్పటికీ మిలియన్ల మందికి ఇప్పటికీ తగినంత ఆహారం అందుబాటులో లేదు. ప్రపంచ ఆహార మరియు వ్యవసాయ సంస్థ ( ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ - యఫ్ఎఒ) ప్రకారం ఆకలి అనేది శరీరానికి తగినంత ఆహారాన్ని తీసుకోవడం వల్ల కలిగే అసౌకర్య లేదా బాధాకరమైన శారీరక అనుభూతి. ప్రపంచ రైతులు ఇప్పటికీ ప్రపంచ జనాభా కంటే ఎక్కువ తిండికి తగినంత ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. అయినా ఆకలి కొనసాగుతోంది.

ఆకలిని పోషకాహార లోపంగా కూడా సూచించవచ్చు అని తెలిపింది. ఆహార సంక్షోభాలపై తాజా గ్లోబల్ రిపోర్ట్ ప్రకారం 59 దేశాల్లో దాదాపు 282 మిలియన్ల మంది ప్రజలు 2023లో తీవ్రమైన ఆకలిని అనుభవించారు. ప్రపంచవ్యాప్తంగా మునుపటి సంవత్సరంతో పోలిస్తే 24 మిలియన్ల మంది పెరిగారు. పిల్లలు, మహిళలు ఈ ఆకలి సంక్షోభాలలో ముందంజలో ఉన్నారు. 32 దేశాలలో 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న 36 మిలియన్ల మంది పిల్లలు తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడు తున్నారని నివేదిక చూపిస్తుంది. 2023లో తీవ్రమైన పోషకాహార లోపం మరింత తీవ్రమైంది. ముఖ్యంగా సంఘర్షణలు మరియు విపత్తుల కారణంగా స్థానభ్రంశం చెందిన వ్యక్తులుపెరిగారు. 2023లో 7,05,000 కంటే ఎక్కువ మంది ప్రజలు ఐపిసి ఫేజ్ 5 విపత్తు స్థాయిలో ఉన్నారని నివేదించింది. ఈ రిపోర్ట్స్ చరిత్రలో ఇదే అత్యధిక సంఖ్య. ఇంకా 2016 నుండి నాలుగు రెట్లు పెరిగింది అని తెలిపింది. గాజా స్ట్రిప్, దక్షిణ సూడాన్, బుర్కినా ఫాసో, సోమాలియా, మాలీలతో పాటు 80 శాతం మంది కరువును ఎదుర్కొంటున్నారని తెలిపింది.. జిఆర్ఎఫ్సి 2024 భవిష్యత్తు ఔట్‌లుక్ ప్రకారం గాజా స్ట్రిప్‌లో సుమారు 1.1 మిలియన్లు దక్షిణ సూడాన్‌లో 79000 మంది ప్రజలు జూలై 2024 నాటికి విపత్తు ఐపిసి ఫేజ్ 5 లో ఉంటారని అంచనా వేయబడింది. సంఘర్షణ అభద్రతను తీవ్రతరం చేయడం, ఆర్థిక షాక్‌ల ప్రభావాలు, విపరీతమైన వాతావరణ సంఘటనల ప్రభావాలు తీవ్రమైన ఆహార అభద్రతను కొనసాగిస్తున్నాయి. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ 2023 ప్రకారం, బెలారస్, బోస్నియా, హెర్జెగోవినా, చిలీ, చైనాలు తక్కువ ఆకలి స్థాయిలను కలిగి ఉన్నాయి. యెమెన్, మడగాస్కర్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్లలో పరిస్థితి ఘోరంగా ఉంది.సంక్షోభాలు సామాజిక మరియు ఆర్థిక అసమానతలను తీవ్రతరం చేశాయి. ప్రపంచవ్యాప్తంగా ఆకలిని తగ్గించడంలో పురోగతికి ఆటంకం కలిగించాయి. ప్రపంచ ఆహార మరియు వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ) ఆహార హక్కు మార్గదర్శకాలును విడుదలచేశారు. ఇవి తగిన ఆహారం కోసం మానవ హక్కును గ్రహించడానికి దేశాలు చేపట్టవలసిన కార్యక్రమాలను సూచిస్తాయి. ఆహార హక్కు మార్గదర్శకాలు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కును అర్థం చేసుకొని అమలు కోసం చేపట్టాల్సిన చర్యలను సిఫార్సు చేస్తాయి. వాటిని మూడు విభాగాలుగా విభజించారు. మొదటి విభాగం మార్గదర్శకాల లక్ష్యాన్ని, రెండోది జవాబుదారీ యంత్రాంగాల హక్కు అమలుకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడంతో పాటు పంతొమ్మిది మార్గదర్శకాలను, మూడోది అంతర్జాతీయ సంస్థలు ఆహారం కోసం మానవ హక్కును నెరవేర్చడానికి చేపట్టవలసిన చర్యలను సూచిస్తుంది. మార్గదర్శకాలు 2030 ఎజెండాను సాధించడంలో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించడానికి దోహదపడ్డాయి.

ఆహార అభద్రత ఆర్థిక అస్థిరత, సామాజిక అశాంతికి దారి తీస్తుంది. స్థిరమైన ఆహార సరఫరా గొలుసులు బలమైన కార్మిక మార్కెట్‌లకు మద్దతునిస్తాయి.ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తాయి. స్థిరమైన వ్యవసాయ పద్ధతులు సహజ వనరులను కాపాడతాయి జీవవైవిధ్యాన్ని ప్రోత్సహిస్తాయి. స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అమలు చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు స్థిరమైన ఆహార సరఫరాను నిర్ధారించగలము. చాలా తక్కువ ఆదాయ గృహాలకు తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, తక్కువ కొవ్వు పాల ఉత్పత్తులు, ప్రోటీన్లు వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలు అవసరం. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందరికీ మరింత అందుబాటులోకి తేవాలి. ఆహార అభద్రతను ప్రభావితం చేసే మరో అంశం అసమానత యొక్క లోతుగా పాతుకుపోయిన వ్యవస్థలు. ఆకలి అనేది తరచుగా పేదరికం యొక్క లక్షణం. ఆకలితో పోరాడాలంటే మనం దాని ప్రధాన కారణం అయిన అసమానతలతో పోరాడాలి. ఆహార వృథాన్ని తగ్గించాలి. ప్రపంచ ఆకలిని పరిష్కరించడంలో ఆహార పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుంది. స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించాలి మరియు ప్రోత్సహించాలి. ఆహార వ్యర్థాలను తగ్గించాలి. స్థానిక రైతులకు మద్దతు ఇవ్వాలి. స్థిరమైన పద్ధతులు దీర్ఘకాలిక ఆహార భద్రతను నిర్ధారించడంలో సహాయపడతాయి.

**(మే 28 ప్రపంచ ఆకలి దినోత్సవం సందర్భంగా)**



**డీజే మోహన్‌రావు**
అధ్యాపకులు, శ్రీకాకుళం
8247045230

# మతం మత్తులో జీవితం బానిస!

*మనిషి కులం, మతం ఉచ్చులో, మత్తులో పడి జీవితం ను బానిసగా మార్చడం వల్లే ప్రస్తుతం దేశంలో మనిషి జీవితం అస్తవ్యస్థం గా మారింది.బాధ్యత నుంచి చూపును దొంగిలించే పరిస్థితి ఉంది.బాధ్యత నుంచి తప్పించుకున్నవాడే ధన్యుడు సుమతి అనే విధంగా పరిస్థితి తయారు అయ్యిందంటే అతిషయోక్తి కాదు!బుద్ధి జీవులు ఈ దేశంను, దేశం యువతను, మతోన్మాదం విషపు కోరల్లోకి వెళ్లకుండా, విద్వేషపు ఉపన్యాసాలకు బలి పశువులు కాకుండా, కాపాడాలి! వారిని అందుకు బానిసలుగా కాకుండా కాపాడాలి! సమసమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలి! గత పది పండ్లుగా దేశంలో పెరిగిన కులం, మతం, మందిర్, మస్జీద్ రాజకీయాలే మెజారిటీ మధ్యతరగతి, పేద యువత జీవితం అయిపోయిందంటే అతిషయోక్తి కాదు!అలాంటి బాట ను ఇప్పుడు కేంద్రంలోని అధికారం లో ఉన్న బీజేపీ చూయింస్తున్నది! అబద్దం ను నిజం అని నమ్మిస్తున్నది! ఇదే నేపథ్యంలో 'పీకే' లాంటి ఫేక్ మనుషుల ను ఒక పథకం ప్రకారం పైకెత్తడం చూస్తున్నాం!*





**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

అబ్స్ ల్యూటిజం క్రైసెస్ లో కొందరు మేధావులు, ముఖ్యంగా ఎన్నికల్లో గెలుపు, ఓటములు నిర్ణయించే అంచనాలు వేస్తూ, మైండ్ గేమ్ లను అమలు చేయడానికి తంటాలు పడే పీకే, కొనుగోలు లాంటి,వాళ్ళను చూస్తున్నాము. న్యూస్ క్లిక్ కరణ్ థాపర్ ఇటీవల ప్రశాంత్ కిషోర్ ( పీకే ) ను ఇంటర్వ్యూ చేసినపుడు ఆయన అంచనాలు కొన్ని ఫెయిల్ అయిన విషయాలను చెబితే, అడిగితే యమ రెచ్చిపోయాడు. వీడియోస్ చూపండి అంటాడు, పేపర్లలో వచ్చింది అంటే, పేపర్ వాళ్ళు ఏది బడితే అది రాస్తారు అంటాడు, ఆ పూట కుల్ల పీకే, నిజానికి తెలంగాణ, హిమాచల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలువదు అని పత్రికలకు మాత్రమే చెప్పడం కాదు, ట్వీట్ కూడ చేసిన దాఖలా ఉన్నది. అడుగు లేని చెంబు లాంటి వాడు 'పీకే '!ఈ సారి అయితే మన పీఎం మోడీ మాదిరి, వెయ్యి అబద్దాలు ఆడాడు! జూన్ 4 తర్వాత పీకే ప్రిడిక్షన్ లకు కాలం చెల్లాలని కోరుకుందాం!ప్రస్తుతం కేంద్రంలో అధికారం లో ఉన్న బీజేపీ, పీఎం మోడీ నేతృత్వం లో పది ఏండ్లు దేశం ఎదుర్కొని ఇబ్బంది లేదు. కోట్ల కుటుంబాలు ఆర్థికంగా చితికి పోయాయి. సగం కుటుంబాలు బతుకు బండి లాగడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

**దేశానికి నిజాయితీ గల నేత లేడు!**

ఒక్కరు కూడ సంతోషం గా లేరు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఇటీవల మాట్లాడుతూ, దేశంలో సంపదకు, ప్రభుత్వం లో డబ్బుకు కొరత లేదు, కొరతల్లా నిజాయితీ గా పనిచేసే నేతలదే అంటారు. మొదటిది సంపద, మూడోది నిజాయితీ గల నేతల కొరత అనేది పక్కా మాట, నిజం చెప్పారు గడ్కరి! ఈ దేశం సంపదను అదాని, అంబాని లాంటి వారికి దోచి పెట్టిన వారు ఈ విషయం ను అంగీకరించే దమ్ము తో ఉన్నారా? నిజం వారికి జీర్ణం అవుతుందా? లేక చురక అవుతుందా? అగీర్తి లాగ! దేశంలోని 90 శాతం జనాభా లోని బహుజనులు, లైక్ ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీ లు పేదలు ఉండగా 10 శాతం మంది ఆర్థికంగా పరిపుష్టి కలిగిన వారిగా ఉన్నారు. ఇక అసమానతలు ఉండక, సమానతలు ఎక్కడి నుంచి వస్తాయి.

**40 శాతంకు పెరిగిన కాంట్రాక్టు ఉద్యోగాలు!**

2014 లో పబ్లిక్ సెక్టర్స్ లో పది శాతం మాత్రమే ఉన్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఉద్యోగుల సంఖ్య ఇప్పుడు ఈ పది ఏండ్లలో 40 శాతం అయ్యింది. పర్మనెంట్ ఉద్యోగాలు లేవు, దేశంలో పిఎఫ్ సౌకర్యం ఉన్న ఉద్యోగాలు లేవు, అందుకే పీఎఫ్ ఖాతాదారుల సంఖ్య కూడ భారీగా తగ్గింది. యంత్రం ల వాడుకం వల్ల కూడ ఉద్యోగాలు తగ్గాయి. చాలా తక్కువ, పొదుపు చేసుకోలేని, జీతం బతుకు బండి లాగదానికి సైతం సరిపోని విధంగా తక్కువ జీతం ఉద్యోగాలు దొరకడమే కష్టంగా ఉన్నది. ఒక వైపు 16 లక్షల కోట్ల రుణాలను కార్పొరేట్ లకు మాఫీ చేసిన బ్యాంకులు మూడు దాకా మూత పడ్డాయి. కొన్ని దివాలా తీసాయి.2019 లో బ్యాంకుల నుంచి 1,75,000 కోట్లు, ఇప్పుడు 2023- 24 లో 2,10,000 కోట్లు డివిడెంట్ల ను కేంద్రం పొందడం విశేషం! ప్రభుత్వ రంగం ను అమ్మి 6 లక్షల కోట్లు కేంద్రం సంపాదిస్తున్నది. చదువు పిరం, వైద్యం పిరం, అధిక ధరలు, నిరుద్యోగం, దేని మీద కూడ శ్రద్ధ లేదు!

**సెంట్రల్ యూనివర్సిటీ లలో పెరిగిన ఫీజులు!**

దేశంలోని 45 సెంట్రల్ యూనివరిసిటీ లలో 2016 లోనే లక్షల్లో ఫీజులు పెంచేసారు, ఈ నేపథ్యంలో కొనుగోలు శక్తి భారీగా తగ్గింది. ఉదాహరణకు 2018- 19 లో 21 మిలయన్ ల టూ వీలర్ వాహనాలు అమ్ముడు పోగా 2023-24 లో 14 మిలయన్ ల టూ వీలర్ లు అమ్ముడు పోవడం ను చూడవచ్చు! ఇక ఉద్యోగాల మీద ఆశలు వదులుకున్న యువత ఉద్యోగం వెతకడమే మానేసినట్లు కనిపిస్తున్నది. రెండు గంటలకు ఇద్దరు నిరుద్యోగులు ఆత్మ హత్య చేసుకుంటున్నారు. అయినా ప్రభుత్వం లో చలనం లేదు. ఐఐటి పూర్తి చేసిన 7,000 మందికి ప్లేస్మెంట్ లేని పరిస్థితి ఉన్నది. ఆరు కోట్లకు పైగా కుటుంబాలు శ్రమ లో పెరిగారు. చదువుకున్న వారు కూడ ఉపాధి హామీ పనులకు తరలు తున్నారు. ఐటి సెక్టర్ లోనూ జాబ్స్ భారీగా తగ్గాయి. ఈ పరిస్థితి లో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల దశల వారి పోలింగ్ దాదాపు చివరి దశలోకి చేరింది. ఆరో విడుత పోలింగ్ ఈనెల 25 న శనివారం ముగిసింది. ఏడో దశ మిగిలింది, జూన్ 4 న ఏపార్టీ అధికారం లోకి వస్తుందో, ప్రజలు ఎవరికి పట్టం గట్టారో తేలనుంది.

**ఇండియా కూటమికి 307 కు అవకాశం?**

ఇప్పటికే జరిగిన ఐదు విడుతల పోలింగ్ లో తాము ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సరిపడ సీట్లు వచ్చేసాయి అని పీఎం మోడీ ఒక వైపు, హెూమ్ మంత్రి అమిత్ షా మరో వైపు ఓపెన్ మైండ్ గేమ్ తో చెప్పేసారు. దేశంలో జర్నలిస్ట్ అసోసియేషన్, ఇతర సంస్థ లు నిర్వహించిన సర్వే లు అయితే రాష్ట్రాల వారిగా లెక్కలు వెల్లడి చేస్తూ, కాంగ్రెస్ తో కూడిన ఇండియా కూటమికి 307 సీట్లు వస్తాయని, బీజేపీ, ఎన్డీఎ కూటమిలు 250 దాటవని, ఈ సంఖ్య 212,170 కి కూడ తగ్గవచ్చని, తెలంగాణాలో కాంగ్రెస్, ఇండియా కూటమికి 12 దాటుతాయని, ఈ సర్వే చెబుతున్నది.చూద్దాం, జూన్ 4 దాకా వేచి ఉందాం! మరో సారి యువతకు మతోన్మాద ఉచ్చులో పడి, మానసిక బానిసలుగా కాకూడదని, కర్తవ్యం ను మరచి పోకూడదని వినమ్ర విజ్ఞప్తి!(ఎవరికి వర్తిస్తే వారికి)..

# దేశవ్యాప్త పొగాకు నిషేధంతోనే సత్ఫలితాలు

*ఆరోగ్యానికి హానికరంగా మారిన గుట్కాపై నిషేధాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు గుట్కా తయారీ, క్రయవిక్రయాలను నిషేధిస్తూ ఫుడ్ సేఫ్టీ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. గుట్కా, పాన్ మసాలాల్లో ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకు, నికోటిన్ ఉండడం మూలంగానే వాటిని నిషేధించినట్లు పేర్కొంది. 2025 మే 24 వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని, గుట్కాను తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. అయితే తెలంగాణతోపాటు మరికొన్ని రాష్ట్రాలు గుట్కా విక్రయాలపై ఇలాంటి నిర్ణయమే తీసుకున్నా.. ఇప్పటికీ క్రయవిక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. నిబంధనలు సరిగా అమలు చేయలేకపోవడం, కోర్టు కేసుల కారణంగా అడ్డంకులు వస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా గుట్కా, పొగాకు విక్రయాలను నిషేధిస్తూ పార్లమెంటులో చట్టం చేస్తేనే సత్ఫలితాలు వచ్చే అవకాశముంది.*



ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2011 ప్రకారం పొగాకు ఉత్పత్తులపై 2012 నుంచి పలు రాష్ట్రాలు వాటిని నిషేధించడం మొదలుపెట్టాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ ప్రభుత్వం 2013 జనవరి 9న గుట్కా ఉత్పత్తులను నిషేధించింది. ఏటా నిషేధం కొనసాగించేలా గెజిట్ జారీ చేసింది. అయితే గుట్కాను మాత్రమే నిషేధించడంతో పొగాకుతో తయారయ్యే పాన్‌మసాలా ఉత్పత్తులు మార్కెట్‌లో బాగా పెరిగాయి. దీంతో 2014 జనవరి 9న సమగ్రంగా ఆదేశాలు ఇచ్చింది. నికోటిన్, పొగాకు ఆనవాళ్లు ఉండి నోటి ద్వారా తీసుకునే అన్ని ఉత్పత్తులపైనా నిషేధం విధించింది. చావ్ టొబాకో, ప్యూర్ టొబాకో, ఖైనీ, ఖారా, పొగాకు ముక్కలు, పొగాకు ఆనవాళ్లు ఉండేవన్నీ నిషేధిత జాబితాలో ఉంటాయని వివరణ ఇచ్చింది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత కూడా ఇవే ఆదేశాలు అమలవుతున్నాయి.

**కోర్టు కేసులతోనూ అడ్డంకులు :** గుట్కా, పాన్ మసాలాలపై నిషేధాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో 160 పిటిషన్లు దాఖలు కాగా, 2021 నవంబర్ లో వీటన్నింటిని న్యాయస్థానం కొట్టివేసింది. గుట్కా నిషేధాన్ని సమర్థించింది. అయితే ఆ తర్వాత వ్యాపారులు సుప్రీం కోర్టును ఆశ్రయించి నిషేధంపై స్టే తెచ్చుకున్నారు. గుట్కా క్రయవిక్రయాలు జరిపే వారిపై పోలీసులు కేసులు పెట్టడాన్ని తెలంగాణ హైకోర్టులోనూ సవాల్ చేశారు. దీంతో సరుకులు సీజ్ చేయొద్దని, గుట్కా ఉత్పత్తుల తయారీ, సరఫరా, విక్రయదారులపై కేసులు పెట్టవద్దని హై కోర్టు పోలీసులకు సూచించింది. తమిళనాడులోనూ 2018లో గుట్కాపై నిషేధం విధించగా.. దీన్ని మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ లోనూ దాదాపు ఇలాగే జరిగింది. అయితే తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించగా, 2023 ఏప్రిల్ లో హై కోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. దీంతో నిషేధం కొనసాగినట్లయింది.

**విఫలమవుతున్న నియంత్రణ చర్యలు :** పొగాకు ఉత్పత్తుల వినియోగంపై 2014లో భారత్ చట్టం చేసింది. దీని తరువాత సిగరెట్ పెట్టెపై 'పొగతాగడం ఆరోగ్యానికి హానికరం' అనే పదాలు రాయాలని సూచించింది. ఈ నిర్ణయంపై సిగరెట్ తయారీదారులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. 2016లో సుప్రీం కోర్టు ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది. అంతేకాకుండా పొగతాగే అలవాటును మాన్పించడాన్ని అనేక రకాలైన ఆంక్షలను అమల్లోకి తెచ్చారు. గుట్కాను నిషేధించడం, బహిరంగ ప్రదేశాలలో సిరెట్లు తాగనివ్వకపోవడం, పొగాకు ఉత్పత్తుల ప్రచారాలపై నిషేధం, పద్దెనిమిదేళ్లలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులను విక్రయించకుండా ఉండడం, పాఠశాలలు, కళాశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నిషేధించారు. సిగరెట్ ప్యాకెట్లు, గోడలు, బిల్ బోర్డులు, హోర్డింగులు, సినిమా థియేటర్లలో, ఇంకా అనేక మార్గాల్లో పొగాకు తాగడం హానికరమంటూ విస్తృతంగా ప్రచారం చేశారు. పన్నులు కూడా భారీగా పెంచారు. అయితే వాటితో అనుకున్నంత సత్ఫలితాలు కనిపించలేదు. ఎంతగా ప్రచారం చేసినా... సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీల రూపంలో పొగాకు వాడకం ఏటేటా పెరుగుతోందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

**ఏటా పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు :** పొగాకు, నికోటిన్ ఉత్పత్తుల వినియోగంతో అధిక శాతం మంది నోటి క్యాన్సర్ బారినపడుతున్నారు. గ్లోబల్ అడల్ట్ టుబాకో సర్వే (జీఏటీఎస్) ప్రకారం.. సిగరెట్లు, బీడీల కంటే ఎక్కువగా పొగ రహిత పొగాకుకే ప్రజలు ఆకర్షితులవుతున్నారని తేలింది. దాదాపు 26 శాతం మంది పెద్దలు పొగలేని పొగాకును ఉపయోగిస్తున్నారని, స్మోక్‌లెస్ పొగాకు వాడకం మహిళల్లో 18.4 శాతం ఎక్కువగా ఉందని నిర్ధారించారు. 12 శాతం మంది పురుషులు, 27 శాతం మంది మహిళలు పదిహేనేళ్లు నిండకముందే పొగలేని పొగాకును ఉపయోగించడం ప్రారంభిస్తున్నట్లు గుర్తించారు. పొగాకు సంబంధిత అలవాట్లు కారణంగా ఏటా ప్రపంచ వ్యాప్తంగా 80 లక్షల మంది చనిపోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక చెబుతోంది. పొగాకు ఉత్పత్తులను నేరుగా వాడేవారు 70 లక్షల మంది చనిపోతుంటే 10 నుంచి 13 లక్షలమంది పాసివ్ స్మోకింగ్ కారణంగా మృత్యువాత పడుతున్నారు. వీరిలో మహిళలే అధికం. భారత దేశంలో సుమారు 27 కోట్ల మంది పొగాకును ఉపయోగిస్తుంటే.. ఇందులో పది కోట్ల మంది వరకు సిగరెట్లు, బీడీలు తాగే వారు ఉన్నారు. ఇండియాలో స్మోకింగ్ వల్ల ఏటా 12 లక్షల మంది, పొగాకు నమలడం వల్ల 3.5 లక్షల మంది చనిపోతున్నారు. 2018లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్స్ రిసెర్చ్ చేసిన సర్వేలో సిగరెట్లు తాగే వారిలో 46 శాతం మంది నిరక్షరాస్యులని, 16 శాతం మంది కాలేజ్ విద్యార్థులని తేలింది.

**ప్రత్యామ్నాయ జీవనోపాధిని చూపిస్తే.. :** పొగాకు ఉత్పత్తుల ద్వారా ప్రభుత్వ పన్ను రాబడిలో రూ.50వేల కోట్లకు పైగా జమ అవుతున్నాయి. దీని ద్వారా వార్షిక విదేశీ మారకపు ఆదాయం 2022-23లో రూ. 9,000 కోట్లుగా ఉన్నది. ఇండియాలో 4.64 లక్షల హెక్టార్లలో పొగాకు సాగవుతున్నది. దాదాపు 80 కోట్ల కిలోల వార్షిక ఉత్పత్తితో దేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద పొగాకు ఉత్పత్తిదారుగా ఉన్నది. ముఖ్యంగా పొగాకును ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, బీహార్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఎక్కువగా పండిస్తున్నారు. దాదాపు 2.6 కోట్ల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు పొగాకు ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. మొత్తం 4.57 కోట్ల మంది ప్రజలు పొగాకుపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇందులో పాన్ టేలాలు నడిపే వారు కూడా ఉన్నారు. అయితే పొగాకు ఉత్పత్తులపై పూర్తిస్థాయి నిషేధం విధించే ముందు పొగాకుపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపెట్టాలి. ఆ తర్వాత నియంత్రణ చర్యలు మానుకొని పూర్తిస్థాయి నిషేధం విధించేలా అడుగులు వేయాలి. అవసరమైతే పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేయాలి. అప్పుడే పొగాకు ఉత్పత్తుల ద్వారా కలిగే దుష్పరిణామాల నుంచి దేశాన్ని, దేశప్రజలను కాపాడుకోగలుగుతాం.



**- ఫిరోజ్‌ఖాన్**
సీనియర్ జర్నలిస్ట్
9640466464

# మరుపు రాదు అమ్మ..



ఆడజన్మే ఒక వరం అని
అనిపించే అమ్మ
సృష్టి మూలాల్ని
మైమరిపించే అమ్మ
కష్టాలని చిరునవ్వులుగా
మార్చుకునే అమ్మ
తొమ్మిది నెలల జీవన సహవాసం
చావును ధిక్కరించే ధైర్యం
మరో జీవికి జీవన ప్రసాదం
రక్తాన్ని పంచేది అమ్మ
పాలు ఇచ్చి పెంచేది అమ్మ
ఉగ్గు పట్టేది అమ్మ
జోల పాడేది అమ్మ
ముక్కు చీదిన అమ్మ
ముడ్డి కడిగిన అమ్మ
తానం పోసిన అమ్మ
తనువంతా అమ్మ ప్రేమ
కష్టమొస్తే ముందు కన్నీళ్లు రావు
అమ్మ జ్ఞాపకం తన్నుకొస్తుంది
ఆకలేసిన అమ్మ
తన ఎరుక మరచే అమ్మ
ప్రేమకు ప్రణమిల్లే అమ్మ
బిడ్డకు ప్రాణమిచ్చే అమ్మ
కడుపు చూసేది అమ్మ
జేబు నింపేది అమ్మ
కష్టం దూరం చేసేది అమ్మ
జ్ఞానం ఇచ్చేది అమ్మ
బిడ్డలే అమ్మ ఊపిరి
బిడ్డలే అమ్మ జీవితం
బిడ్డలే అమ్మ జీవన సర్వస్వం
త్యాగం అమ్మ చిరునామా
సృష్టిలో తీయనిది అమ్మ
ఏటికి ఎదురీదేది అమ్మ
వెలకట్టలేని విలువైనది అమ్మ
తీర్చ జాలని రుణం అమ్మ
ఆకాశమంత ప్రేమ అమ్మ
భూలోకమంత ఓపిక అమ్మ
బిడ్డలారా...మా రక్తపు గుడ్డులారా
రవి గాంచనివి సృషిస్తావు
బాధితులకు బాసటవుతావు
అధికారంతో ఊరేగుతావు
జన గీతం ఆలపిస్తావు
పోరు ప్రవాహమై నిలుస్తావు
కానీ
కన్నోళ్ళ మరిచిపోతావు
అప్పుడే నీ జన్మ దేనికని
ఎవరైనా ప్రశ్నిస్తే
నీ అంతరాత్మ నిను నిలదీస్తే...
బతికి సచ్చినట్టే కదా
అవును ..!
ముమ్మాటికి నిజమే కదా...
వృద్ధాప్యం సహజ పరిణామమే
దాని లక్షనాలను జయించే ఔషధమే
వారితో గడిపే క్షణకాలం
అడిగే యోగక్షేమం
వేసుకునే మందులు
బువ్వ తిన్నావా.. అనే పలకరింపు
ఇంటి మంచి చెడు విషయాలు
బంధువుల యోగ క్షేమాలు
ఇరుగు పొరుగు ముచ్చట్లు
వలపోత వడపోత... అంతే ....
కోట్ల ఆస్తులున్నా
కాకి బలగమున్నా
విధించిన అల్లుడి ఆంక్షలు
కన్నెర్ర చేసిన కోడలు
వేసే వెనకడుగు
జీవించే కాలమంతా దుఃఖ భరితమే
జీవితాన్ని దారబోసిన అమ్మ
కాలం చేసాక...
దిక్కులు పిక్కటిల్లేలా రోదించినా
గజ్జ కట్టి ఆడినా
గొంతు ఎత్తి పాడినా
జ్ఞాపకాలు ముద్రించినా
దానధర్మాలు చేసినా
కుమిలి కృషించిపోవడం తప్పు...
తప్పదు ప్రాయశ్చిత్తం
జాగ్రత్త..... జాగ్రత్త సుమా..,

**- మాదాసి రామమూర్తి**

# పొగ ఆరోగ్యానికి సెగ

పొగ ఆరోగ్యానికి సెగ
టైం పాస్కుఆరంభమై పొగ
తాగడం ప్రాణాంతకమైంది
పొగ తాగడమంటె
చావునొట్లే తల పెట్టడమే
మద్యం ఓ వ్యసనం
పొగతాగడం వ్యసనాన్ని
మించిన వ్యసనం
పొగ మరిగితే
పెదవి మరిచి పోలేదు
దూమ పానాను
భంధం
ఒక జీవిత భంధం
పొగ తాగని వాడు
దున్న పోతై పుట్టున్
అన్నాడోకవి
స్మోకింగ్ రాయుళ్లు
కొవిడ్ బారిన పడి
మృత్యువాత పడ్డారు
పొగ ఊపిరి తిత్తులను
తుత్తునీయలుగా
మార్చును
పొగ త్రాగడం
రకరకాల క్యాన్సర్లకు
శ్వాసకోశ జబ్బులకు
ఆహ్వానం
సిగారుతో స్నేహం
ఆరోగ్యానికి పగ
గుప్పెడు పొగ
గుండెకు సెగ
సిగరెట్ పఫ్ తో
పక్షపాతం
పొగ మోజులో
గుండె జబ్బులు
నోటి క్యాన్సర్లు
క్షయవ్యాధి
విజృంభణ
ధూమపానం
అనారోగ్యానికి
మొదటి మెట్టు
నికోటిన్ మత్తుకు
బానిస గాకు
పొగలో పోలీనియం
నాల్గు వేల హాని
కారకాలు
మెదడుకు
ఊపిరితిత్తులకు
ప్రమాదం
పొగాకు మానుకో
గుండె ఊపిరతిత్తుల
బలం పెంచుకో
రోగనిరోధకతను
సాధించుకో
పొగ వద్దు
ఆరోగ్యమే హద్దు
అణ్వాయుదాలకన్న
ప్రమాధకారిగా
మారుతున్నజి
పొగాకు ఉత్పత్తులపై
నిషేధం విధించాలి
సిగరెట్ చుట్ట
బీడీ ఖైనీ గుట్కా
పాన్ మసాలాలను
అడ్డుకుందాం
ఆరోగ్య సంరక్షణకు
అంకిత మౌదాం
పొగాకు వినియోగం వద్దు
పేదరికాన్ని తుంచు
యువత విద్యార్థులు
పొగాకు రహిత సమాజ
స్థాపనకు
ఉద్యమించాలి
పొగాకు వాడకం
తగ్గిద్ధాం పలు రకాల
రోగాలకు కళ్లెం వేద్దాం
పొగాకు వాడకం మీద
ఖర్చు తగ్గిద్ధాం
దశాబ్ద కాలం పాటు
జీవితకాలాన్ని
పెంచుదాం
పొగ రహిత జీవితం
వైపు అడుగులేద్ధాం
ధూమపాన వ్యసనమనే
సంకెళ్ళను తెంచుకొని
బయట పడుదాం
"ఆహారం కావాలి
పొగాకు కాదు"అనేది
నినాదం కాకుండ
జీవన విధానం కావాలి
పొగాకు పంట తగిద్ధాం
ప్రకృతి పర్యావరణాన్ని రక్షిద్ధాం
పొగాకు మానుదాం
కుటుంబ ఆరోగ్యాన్ని
సౌభాగ్యాన్ని
సంపదను
పెంచుదాం
ఆనందాన్ని
ఆరోగ్యాన్ని
పంచుదాం
ఆరోగ్యమే
మహాభాగ్యమనేది
నినాదం కాకుండా
ప్రజల జీవన విధానం
కావాలి
పొగలొ సెగలో కాలిపోక
పొగలేని ప్రపంచాన్ని
సృష్టిద్ధామని ప్రతిజ్ఞ చేద్దాం

**(మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా)**

**నేదునూరి కనకయ్య అధ్యక్షులు**
**రచయిత, కరీంనగర్**
**9440245771**

# బిర్యానీ తిని లబోదిబో..!

వాంతులు, విరేచనాలు..
ఆసుపత్రి పాలైన కుటుంబం

- కలుషిత ఆహారం తిని 8 మందికి అస్వస్థత
- శంషాబాద్ ప్రైవేట్ ఆసుపత్రిలో బాధితులకు చికిత్స

**పెళ్లి రోజు కదా అని కుటుంబ సభ్యులతో కలసి ఓ వ్యక్తి హోటల్ కు వెళ్ళాడు. బిర్యానీ ఆర్డర్ చేసి తిన్నారు. కొద్ది సేపటికే వాంతులు, విరోచనాలు అయ్యాయి. అవస్థలు పడి ఆసుపత్రిలో చేరారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో చోటు చేసుకుంది.**









షాద్‌నగర్ (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని అప్పరెడ్డిగూడా గ్రామానికి చెందిన కావాలి నరేందర్ తన పెళ్లి రోజు ఉందని ఈ నెల 22వ తేదీన బుధవారం రోజు రాత్రి తొమ్మిది గంటల సమయంలో షాద్ నగర్ పట్టణంలోని సాయిబాబా ఫ్యామిలీ రెస్టారెంట్ లో తన కుటుంబ సభ్యులతో కలిసి మండి బిర్యానీ తిన్నారు. తర్వాత ఇంటికి చేరుకున్న క్రమంలో ఒకరి తర్వాత ఒకరికి వాంతులు విరేచనాలు అయ్యాయి. దీంతో శంషాబాద్ ప్రైవేట్ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. అప్పటికే నరేందర్ కు రక్తపు వాంతులు విరేచనాలు కావడంతో ఐసీయూలో ఉండగా.. ఆయనతో పాటు ఆయన భార్య మంగమ్మ కుటుంబ సభ్యులు దీక్షిత తన్విక, అనిరూద్, అభిలాష్, జోష్ణ, సాయి శ్రీకర్ మొత్తం ఎనిమిది మందికి అస్వస్థత కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. షాద్ నగర్ పట్టణంలో గత కొంతకాలంగా హోటల్స్, రెస్టారెంట్లు బిర్యాని సెంటర్లు ఎక్కడ కూడా పరిశుభ్రత పాటించకపోవడం నాణ్యత ప్రమాణాలు కూడా లేకపోవడంతో నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు ఎక్కడో ఒకచోట బిర్యానీలో ఈగలు, దోమలు, పురుగుల కథనాలు వెలుగులోకి వస్తున్నప్పటికీ.. సంబంధిత అధికారులు మాత్రం తాత్కాలికంగానే ఫైన్లు వేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఎక్కడ కూడా తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించకడం లేదు. పెళ్లిరోజు ఉంది కదా బిర్యాని తిని హోటల్లో వెయ్యి రూపాయలు ఖర్చు చేస్తే ఆసుపత్రిలో లక్ష రూపాయలకు దారితీసింది అంటూ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఫుడ్ ఇన్స్పెక్టర్ తో పాటు సంబంధిత అధికారులు షాద్ నగర్ పట్టణంలో ఉన్న హోటల్లో, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో పరిశుభ్రత పాటించని వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని బోజన ప్రియులు డిమాండ్ చేస్తున్నారు.



## హాస్టళ్ల ఓనర్లతో డెంగ్యూపై అవగాహన సదస్సు

**ఖైరతాబాద్, మే 27 (జనం సాక్షి) :** సోమవారం ఖైతాబాద్ సర్కిల్-17 అమీర్ పేట్ డివిజన్ పరిధిలో హాస్టళ్ల ఓనర్ లతో కమిషనర్ జీహెచ్ఎం సీ సూచన మేరకు ముందస్తు డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం డాక్టర్ ప్రవీణ్ మెడికల్ ఆ ఫీసర్, సీనియర్ ఎంటమలోజిస్ట్ రజనీ, అసిస్టెంట్ ఎంటమలోజిస్ట్, భాస్కర్ ఎంటమలజీ ఆధ్వర్యం లో కార్యక్రమం నిర్వహించారు. ముందు వర్ష కా లంలో డెంగ్యూ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త లు తీసుకోవాలని హాస్టళ్ల ఓనర్లకూ, కాలని ప్రజల కు సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టళ్ల ఓనర్ లు, నాగేందర్, ప్రభాకర్ ఎంటమలజీ స్టాఫ్, కో-ఆర్డినేటర్ రవి పాల్గొన్నారు.

## ముస్తాబాద్‌లో 50 ఇండ్లకు నష్టం



**ముస్తాబాద్ మే 27 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ఈదురుగాలి వర్షానికి తట్టుకోలేక మండలంలో 50 ఇండ్లలో పైన నష్టం వాటిల్లినట్టు తాసిల్దార్ సురేష్ తెలిపారు. అన్ని గ్రామాలలో కూలిపోయిన.ఇండ్లకుపూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని అన్నారు. ఆయన వెంట ఆర్ ఐ రఘు, శ్యామ్ ఉన్నారు.

## ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి



**ఇబ్రహీంపట్నం, మే 27 ( జనం సాక్షి ) :** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి కేటాయించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి కేటాయించాలని కోరుతూ సోమవారం దిల్ సుఖ్ నగర్ లోని అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను తమ యొక్క నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేకు మంత్రి పదవి కేటాయిస్తే ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మరింత బ్రహ్మాండంగా అభివృద్ధిలో ముందుకు పోతుందని అన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే తప్పకుండా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి కేటాయించాలని అధిష్టానని కోరారు. అధిష్టానం మంత్రి పదవి కేటాయించి జిల్లా ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమాకాంత్ రెడ్డి, ఆరుట్ల ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, చీమల జంగయ్య, ముచ్చర్ల వెంకటేష్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనలకు విరుద్దంగా బ్లాస్టింగ్స్

**యాచారం, మే 27 (జనంసాక్షి) :** రాష్ట్ర రాజధానికి అత్యంత సమీపంలో రంగారెడ్డి జిల్లా ఉండటంతోనే ఆ ప్రజలు చేసుకున్న దౌర్భాగ్య మని అనిపిస్తుంది. ఎందుకంటే రియల్ ఎస్టేట్ పెరిటి వ్యాపారులు కొండలను, గుట్టలను తోలిచి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని పర్యావరణం, పంటలు, పశుసంపదను నాశనం చేసేందుకు రియల్ వ్యాపారులు బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. ఈ బ్లాస్టింగ్పై స్థానికులు పిర్యాదులు చేసిన ఫలితం లేకుండా పోయింది. ఈ బ్లాస్టింగ్ శబ్దాలతో స్థానికంగా నివాసముండే పెద్దలు, పిల్లలు పడుకునే పరిస్థితి గ్రామాల్లో లేకపోవడం గమనార్హం. యాచారం మండలంలోని మాల్ నుంచి నల్లవెల్లి వెళ్లే రోడ్డు లో ఓ వెంచర్ లో ఎలాంటి అనుమతులు లేకుండా జిలెటన్‌స్టిక్స్, టిటోనేటర్లు పెట్టి పేలుళ్లకు పాల్పడుతున్నారు. అనుమతులు లేకుండా జిలెటెన్‌స్టిక్స్, పేలుడు పదార్థాలు వినియోగించి పెద్దెత్తున బ్లాస్టింగ్‌కు పాల్పడుతన్నారు. వెంటనే అధికారులు జోక్యం చేసుకొని బ్లాస్టింగ్ పాల్పడుతున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రంగంలోకి ఈఆర్టీ, ఎస్పీటీ బృందాలు

- పరిస్థితుల పర్యవేక్షణకు సెంట్రల్ సేఫ్టీ ప్రొటోకాల్ సెల్
- క్షేత్ర స్థాయిలో మాన్ సూన్ మేనేజ్ మెంట్ ప్లాన్
- ఏ రోజుకు ఆ రోజు నివేదిక తయారీ.. ఉన్నతాధికారులకు సమర్పణ
- జీహెచ్ఎంసీ పరిధిలో డీప్ మ్యాన్ హోల్స్ కి సేఫ్టీ గ్రిల్స్ బిగింపు
- డీప్ మ్యాన్ హోళ్లకు ఎరుపు రంగు వేయాలని ఆదేశం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** వచ్చే వర్షాకాలంలో శక్తి వంచన లేకుండా పనిచేయాలని ఎండీ సుదర్శన్ రెడ్డి సూచించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో జలమండలి అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించిన ఆయన.. వర్షాకాల ప్రణాళికను ప్రకటించారు. ఎండీ మాట్లాడుతూ.. మరో వారం రోజుల్లో వర్షాకాలం ప్రారంభమయ్యే నేపథ్యంలో.. డైరెక్టర్లు మొదలుకొని క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణపైన దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమయంలో కలుషిత నీరు సరఫరా కాకుండా అందులో తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. సీవరేజి ఓవర్ ఫ్లో ను సీరియస్ గా తీసుకుని ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చూడాలని చెప్పారు. వివిధ అంశాలపై వచ్చే ఫిర్యాదుల్ని అరగంటలో పరిష్కరించాలన్నారు. సీవరేజీ ఓవర్ ఫ్లో తో పాటు కలుషిత నీటి సరఫరా వంటి వాటిపై వచ్చే ఫిర్యాదులను.. అరగంటలో పరిష్కరించాలని ఆదేశించారు. వాటర్ హాట్ స్పాట్లు గుర్తించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మ్యాన్ హోల్స్ కు సేఫ్టీ గ్రిల్స్ బిగింపు, ప్రమాదకర మ్యాన్ హోల్స్ వద్ద రెడ్ ఫ్లాగ్స్, సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వివరించారు. వర్షాకాలంలో






కలుషిత నీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ యంత్రాలను సమర్థంగా ఉపయోగించుకోవాలని ఎండీ సూచించారు. జలమండలి, జీహెచ్ఎంసీ 120 వాటర్ లాగింగ్ పాయింట్లను నిత్యం పర్యవేక్షించాలని ఎండీ తెలిపారు. మ్యాన్ హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలను (సిల్ట్) ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. మంచి నీటి పైపు లైను నాలా క్రాసింగ్ వద్ద చెత్త చేరకుండా సంబంధిత అధికారులు జాగ్రత్త వహించాలని సూచించారు. ముంపునకు గురైన మ్యాన్హోళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహదారుల మీద ఉన్న మ్యాన్ హోళ్లకి.. ఎరుపు రంగు వేయాలని ఎండీ ఆదేశించారు. డీప్ మ్యాన్ హోళ్ల దగ్గర సీవరేజి సూపర్వైజర్లు ఉండేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. బోర్డు సిబ్బంది అంతా.. ఈ సీజన్ లో విమర్శలకు తావు లేకుండా పనిచేయాలని సూచించారు.

## బీదర్‌లో కుత్బుల్లాపూర్ బిల్డర్ దారుణ హత్య

### నమ్మిన వాళ్ళే నరరూప రాక్షసులుగా మారారా?



**కుత్బుల్లాపూర్ మే 27( జనం సాక్షి)** ఓ భవన నిర్మాణ దారుడు (బిల్డర్) బీదర్ లో హత్యకు గురైన సంఘటన కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని చింతల్ లో చోటు చేసుకుంది.మృతిని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని పద్మనగర్ ఫేస్ 1 లో నివాసముండే మధు బిల్డర్ గా వ్యాపారం చేసుకొంటున్నాడు.ఈనెల 24 వ తేదీన కల్పన సొసైటికి చెందిన మిత్రుడు రేణుకప్రసాద్ ,మరో ఇద్దరు నికిత్ ,గోపి లు శుక్రవారం మధ్యాహ్నం మధు ఇంటికి వెళ్లి అతనిని తీసుకొని బయటకు వెళ్లారు.ఈ క్రమంలో ఇంటికి కాల్ చేసిన మధు తాను మిత్రులతో కలసి బీదర్ వెళ్తున్నట్లు తెలిపాడు.తిరిగి అదేరోజు రాత్రి కాల్ చేసిన మధు తాము తిరుగు ప్రయాణంలో వున్నట్లు హైద్రాబాద్ వస్తున్నట్లు తెలిపాడు.కానీ ఆ రోజు రాకపోవడం తో కంగారు పడినట్లు తెలిపారు.మరుసటి రోజు ఉదయం 11 గంటలకు కర్ణాటక పోలీస్ ల నుండి కాల్ వచ్చినట్లు వారు తెలియజేశారు.కార్ నెంబర్ ఆధారంగా గుర్తించి తమకు పోలీసులు సమాచారం తెలిపారు. మృతుడి శరీరం పై బీర్ సీసాలలో పొడిచిన ఆనవాళ్లు వున్నట్లు పేర్కొన్నారు. హత్యానంతరం మృతుడి శరీరం పై వున్న బంగారు ఆభరణాలు దాదాపు పది లక్షల విలువైనవి తీసుకెళ్లినట్లు మృతుడి భార్య పేర్కొన్నారు.మృతుడికి భార్య ఇద్దరు కూతుర్లు వున్నట్లు సమాచారం స్నేహితుల పనేనా? తనను ఇంటి వద్దకు వచ్చి తీసుకెళ్లిన వారి పనే అయ్యుఓటుందని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు,బీదర్ జిల్లా మన్నాకెళ్లి పోలీస్‌లు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## బాలుడు మృతికి లక్ష రూపాయల విరాళం అందించిన కేటీఆర్



**శేరిలింగంపల్లి, మే 27 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి సాయి నగర్ కాలనీ లో ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి రేకుల షెడ్డు కూలిన విషయం విధితమే. పెరిగిన రేకులు ఓ మూడు సంవత్సరాల బాలుడు పై పడిన దుర్ఘటనలో సమద్ అనే మూడేళ్ల బాలుడు మృతి చెందగా పరిసర ప్రాంతాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈనపత్యంలో సమాచారం అందుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కల్వకుంట్ల తారక రామారావు సోమవారం స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించి జరిగిన దారుణాన్ని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అభం శుభం తెలియని తమ చిన్నారి ఇలా దుర్మరణం చెందడం తమకెంతో ఒక శోభను మిగిలించిందని, ఎలాగైనా తమకు న్యాయం జరగాలని వారు కేటీఆర్ తో మొరపెట్టుకోవడం జరిగింది. ఈ క్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి విజ్ఞప్తి మేరకు సమద్ కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించి అక్కడికక్కడే అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజల సుఖశాంతులతో వెలసిల్లారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేయడంతో ప్రజలు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారని, ఉదయం లేచింది మొదలు ఊకదంపుడు ఉపన్యాసాలు దంచి కొట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా కంటక పాలనను దుయ్యబట్టారు. రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పరిపాలనను అందిస్తామని, శేరిలింగంపల్లి నియోజక అభివృద్ధికి పెద్దపీట వేస్తామని ఆయన భరోసాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు మంచి వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సింగరేణి సంస్థదే

### కనీసం మంచినీళ్లు అందించకపోవడం దురదృష్టకరమే గుర్తించుకోవాలే : జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్

**రామగిరి, (జనంసాక్షి) :** దేశానికి వెలుగులుఇచ్చే సింగరేణి కార్మికులకు మంచి వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సింగరేణి సంస్థదేనని జిల్లా పరిషత్‌చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. సోమవారం రామగుండం -ఆర్జీ 3 పరిధిలోని రామగిరి మండలం సెంటనరీకాలనీలోని గోదావరి రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రతి మనిషి మంచిగా జీవించే హక్కును రాజ్యాంగం కల్పించిందని, అందులో నీళ్లు, గాలి, మంచి వాతావరణం కల్పించే బాధ్యతను కూడా పొందుపర్చుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులు తమ రక్తాన్ని ధార పోసి బొగ్గును వెలికి తీసి దేశానికి వెలుగులు అందిస్తున్నారని, సింగరేణి సంస్థలకు వేల కోట్ల ఆదాయం సమకూర్చుతున్నారని ఆయన తెలిపారు. ఇన్ని కష్టాలు పడుతున్న సింగరేణి కార్మికులకు కనీసం మంచినీళ్లను సంస్థ అందించకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సెంటనరీ కాలనీ ఒక



పెద్ద కార్మిక క్షేత్రమని, ఇక్కడ ఓసీ 2, ఏఎల్‌పీ గనుల్లో పనిచేసే కార్మికులు ఎక్కువగా ఉంటారని అన్నారు. అయితే రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను సింగరేణి సంస్థ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. వేల కోట్లు లాభాలుగడిస్తున్న సంస్థ లాభాల వైపే చూస్తుంది కానీ అందుకు కారణమైన కార్మికుల కష్టాలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మిక కుటుంబాలకు మంచినీళ్లు అందిస్తున్నామని సంస్థ చెప్తోందని, కానీ ఇక్కడి ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తే కార్మిక కుటుంబాలకు బురదతో కూడి మడుగునీళ్లు అందిస్తున్నట్లు కనబడుతోందని ఆయన తెలిపారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలబడిపోరాటం చేస్తామని, ఈ విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే ఇక్కడకు వచ్చి ఫిల్టర్ బెడ్ పరిశీలించామని తెలిపారు. సింగరేణి ఆర్జీ 3 జీఎంతో పాటు అధికారులు హుటాహుటీన ఇక్కడకు వచ్చి ఫిల్టర్ బెడ్‌ను సందర్శించాలన్నారు. ఫిల్టర్ బెడ్‌ను బాగు చేయించి కార్మికులకు మంచినీళ్లు అందించి కార్మికుల కష్టాలు తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

## విజయ డెయిరి డైరెక్టర్ ఎర్నేని సీతాదేవి అకాల మృతికి ప్రముఖుల సంతాపం



**శేరిలింగంపల్లి, మే 27 (జనంసాక్షి) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, విజయ డెయిరీ డైరెక్టర్ యెర్నేని సీతాదేవి సోమవారం ఉదయం గుండెపోటుతో అకాల మృతి చెందడం విధితమే. ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మాజీ మంత్రి సీతాదేవి మృతి సమాచారం అందుకొని మాదాపూర్ లోని వసంత సిటీ లోని ఆమె నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అందరితో కలివిడిగా ఉండే కుటుంబం కావడం, రాజకీయ నేపథ్యాన్ని కలిగి ఉండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో మంత్రిగా బాధ్యతలను చేపట్టడంతో ఆమెకు పరిచయం ఉన్న ప్రముఖులు సైతం సీతాదేవి నివాసానికి చేరుకొని శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు, గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము, కెఎల్ నారాయణతో కలిసి ఆమె పార్థివ దేహంపై పుష్ప గుచ్చం ఉంచి, శ్రద్ధాంజలి ఘటించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి ని తెలియచేశారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ విజయ పాల డెయిరీ డైరెక్టర్, మాజీ మంత్రి సీతాదేవి మరణం చాలా బాధాకరమని, ఆమె రాజకీయాల్లో కొత్త ఒరవడిని సృష్టించారని గుర్తు చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నామని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే గాంధీ తదితరులు పేర్కొన్నారు.



## యూనిఫామ్‌లు కుట్టుట వేగవంతం చేయండి

**జమ్మికుంట, (జనంసాక్షి) :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫామ్ లు కుట్టు కేంద్రాలను సోమవారం మెప్మా పిడి స్వరూప రాణి, కమీషనర్ మొహమ్మద్ అయాజ్, డిఎంసి శ్రీవాణి, ఏడిఎంసి మల్లీశ్వరిలు పరిశీలించారు. అనంతరం పలు కేంద్రాలను పరిశీలించి, యూనిఫామ్ లు నాణ్యతగా ఉండేలా ప్రభుత్వం ఇచ్చిన సూచనలతో కుట్టాలని, యూనిఫామ్ లుకుట్టుట వేగవంతం చేయాలని వారిని ఆదేశించారు. మెప్మా అధికారులు సతీష్, సీఎల్ఆర్పీలు జ్యోతి, మంజుల, ఆర్పీలు, కుట్టు మిషన్ నిర్వాహకురాలు అభేద, భానులతో పాటు పలువురు పాల్గొన్నారు.

# యువతకు మాదక ద్రవ్యాలపై అవగాహన

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్



**వనపర్తి బ్యూరో మే 27 (జనం సాక్షి)**

యువత మాదక ద్రవ్యాల వినియోగం, చెడు అలవాట్లు నుండి దూరం ఉండే విధంగా కళాశాలలు ప్రారంభం అయ్యే నాటి నుండి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం ఐడిఒసి కాన్ఫరెన్స్ హాల్లో జూమ్ మీటింగ్ ద్వారా మాదక ద్రవ్యాల నియంత్రణ జిల్లా స్థాయి సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుందని, అడ్మిషన్లు పూర్తి అయిన వెంటనే కళాశాలల విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకం వల్ల జరిగే దుష్పరిణామాల పై అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకు ఒక ప్రత్యేక నోడల్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా తగు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో గంజాయి సాగు అయ్యే ప్రమాదం ఉందని, దీనిని అరికట్టేందుకు వ్యవసాయ, అటవీ శాఖ, పోలీస్ శాఖ ద్వారా సమిష్టి గా నిఘా ఉంచాలని ఆదేశించారు. సాగు చేస్తూ పట్టుబడితే క్రిమినల్ కేసులు పెట్టడమే కాకుండా రైతుబందు రద్దు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, తహసిల్దార్ కిషన్ నాయక్, జూమ్ ద్వారా అదనపు ఎస్పీ రామదాసు తేజావత్ ఆర్డీఓ పద్మావతి, డ్రగ్ ఇన్స్పెక్టర్ తసీతారులు పాల్గొన్నారు. గృహ నిర్మాణాలకు, ప్రభుత్వ పనులకు నాణ్యమైన ఇసుకను అందుబాటులో గృహ నిర్మాణాలకు, ప్రభుత్వ పనులకు నాణ్యమైన ఇసుకను అందుబాటులో ఉంచే విధంగా తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం ఐ.డి. ఒ.సి. కాన్ఫరెన్స్ హాల్లో మన ఇసుక వాహనం పై జిల్లాస్థాయి కమిటీతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో ఇసుక మాఫియా లేకుండా చేసేందుకు పంచాయతీ సెక్రటరీ నుండి అనుమతి పొందిన గృహ నిర్మాణాలకు, ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో జరుగుచున్న ప్రభుత్వ నిర్మాణ పనులకు నాణ్యమైన ఇసుకను ప్రభుత్వ ధరకు సరఫరా చేసేవిధంగా తహశీల్దార్లు వే బిల్లు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. స్థానిక అవసరాలకు ఇసుకను ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం వే బిల్లులు ఇవ్వాలని, అనుమతి కంటే ఎక్కువ ఇసుక తరలిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, ఏ.డి.మైన్స్ పి. శ్రీనివాస్, తహసిల్దార్ కిషన్ నాయక్, జూమ్ యాప్ ద్వారా తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



### ప్రజా ఫిర్యాదులను స్వీకరించిన మహబూబ్ నగర్ జిల్లా ఎస్పి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

ప్రజా పిర్యాదుల కార్యక్రమంలో భాగంగా సోమవారం మహబూబ్ నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పిర్యాదుదారులు హాజరై సమస్యలను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ కు వివరించి అర్జిలను సమర్పించారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకొని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యదు దారులకు సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. మొత్తం 15 ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని, సత్వరమే పరిష్కరిస్తామన్నారు. సామాన్య ప్రజలకు పోలీసు అండగా ఉండాలని, ప్రజలతో పోలీసులు స్నేహబావంగా మేసులు కోవాలని ఆయన సూచించారు.

# కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కొన్న ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించాలి
- అడిషనల్ కలెక్టర్ మాధవి



**ఝరాసంగం, మే 27 (జనం సాక్షి)**

సొసైటీలలో రైతుల నుండి విక్రయిస్తున్న జొన్న కొనుగోలను వేగవంతం చేసి కొన్న ధాన్యాన్ని వెంటనే లారీలలో గోదాములకు తరలించాలని సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధవి తెలిపారు. ఝరాసంగం మండల పరిధిలోని ఏడాకులపల్లి, ఝరా సంగం కేంద్రాలలో మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో విక్రయిస్తున్న కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేసారు. ఈనెల 31వ తేదీ వరకు జొన్న ల కొనుగోళ్ళను పూర్తి చేయాలని, విక్రయించిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు పంపించాలని మార్క్ఫెడ్ డిఎం శ్రీదేవికి ఆదేశించారు. ఆమె వెంట జహీరాబాద్ ఆర్డిఓ ఎస్ రాజు, తహసిల్దార్ సంజీవరావు, మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, ఆర్ ఐ రామారావు, సొసైటీ సీఈవోలు నిసార్, శ్రీశైలం తదితరులున్నారు.

# కౌంటింగ్‌లో విధులు జాగ్రత్తగా నిర్వహించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

జూన్ 4 వ తేదీన నిర్వహించే మహబూబ్ నగర్ లోక్ సభ నియోజకవర్గ కౌంటింగ్ ఎన్నికల నిబంధనల ననుసరించి విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి , జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ అన్నారు. సోమవారం మహబూబ్ నగర్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించే కౌంటింగ్ సూపర్ వైజర్ లు, కౌంటింగ్ అసిస్టెంట్‌లు, మైక్రో అబ్జర్వర్‌లకు, కౌంటింగ్ నిర్వహణ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్ మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది విధులను జాగ్రత్తగా నిర్వహించాలని, పాలమూరు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో సమయ పాలన పాటించాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల్లో అనధికార వ్యక్తులు అనుమతించబడరని, ప్రతీ ఒక్కరు ఐడెంటిటీ కార్డు ధరించాలని అన్నారు. పోటీ అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది అందరూ కౌంటింగ్ హాల్ వద్దకు సకాలంలోకి చేరుకోవాలని తెలిపారు. మహబూబ్ నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజక వర్గాలకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బంది (కౌంటింగ్ సూపర్ వైజర్లు, సహాయకులు మరియు మైక్రో అబ్జర్వర్లకు) శిక్షణ ద్వారా అన్ని అంశాలు నేర్చుకోవాలని అన్నారు. అదనపు పాలనాధికారులు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావులు మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది ఈ.వి.యం కౌంటింగ్ పద్ధతులను తప్పక అనుసరించాలని అన్నారు. ఒక్కో కౌంటింగ్ హాల్ లో 14 టేబుళ్లు ఏర్పాటు చేయబడుతాయని, ఒక్కో టేబుల్ కు ఒక సూపర్ వైజర్, ఇద్దరు సహాయకులు మరియు ఒక మైక్రో అబ్జర్వర్ ను నియమించడం జరుగుతుందని అన్నారు. సిబ్బంది కౌంటింగ్ విధి-విధానాలను తప్పక అవగతం చేసుకోవాలని అన్నారు. శిక్షణ నోడల్ అధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ సిబ్బంది వివరాలు తెలిపారు. ఈ శిక్షణలో 83 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 98 మంది సహాయకులు మరియు 75 మంది మైక్రో అబ్జర్వర్లు, 12 మంది ట్యాబ్యులేషన్ సిబ్బందితో పాటు ఈ కార్యక్రమంలో సహాయక రిటర్నింగ్ అధికారులు, డీఈఓ రవీందర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ భాస్కర్, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్, శ్రీకాంత్ మరియు ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించిన జిల్లా వ్యవసాయ అధికారి

**కృష్ణ. మే 27 (జనం సాక్షి)**

మండలంలోని విత్తన మరియు ఎరువుల దుకాణాలలో జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా డీలర్ల షాప్ నందు స్టాకు రికార్డులు మరియు బిల్ బుక్కులు పరిశీలించడం జరిగింది. నకిలీ విత్తనాలు అమ్మకాలు జరిగితే కఠిన చర్యలతో పాటు, పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడం జరిగింది. విత్తన డీలర్లకు విత్తనాలు పర్మిషన్ ఉన్న కంపెనీ నుండి మాత్రమే తెలుసుకోవాలని తెల్పడం జరిగింది. ఈ సందర్భంగా విత్తన డీలర్స్ కు విధిగా పాటించాల్సిన కొన్ని నియమాలను సూచించారు. షాప్ యొక్క పేరు డోర్ నెంబర్ కనిపించే విధంగా కనిపించాలి. సీడ్ లైసెన్స్ కొనుగోలు దారులకు కనిపించేవిదంగా పెట్టాలి. ధరల పట్టిక రైతులకు కనిపించేవిదంగా పెట్టాలి. బ్లాక్ మార్కెటింగ్ చేయరాదని హెచ్చరించడం జరిగింది. అలాగే నిషేధిత వితనాలైన బీటి -3 విత్తనాలు ఎవరైనా అమ్మితే వ్యవసాయ శాఖ అధికారులకు వేంటనే తెలియజేయాలి అని అన్నారు. అనంతరం కృష్ణ మండలం గుడేబల్లూరు లో రైతు అగ్రో సేవ కేంద్రం నందు జీలుగా విత్తనాలను రైతులకి పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి రైతులు పాల్గొన్నారు



## నఖిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

### బిమండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్

**మాగనూర్ మే 27 (జనం సాక్షి):**

వ్యాపారులు నఖిలి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విత్తన దుకాణాలలో మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్ తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా డీలర్ల షాప్‌ల నందు స్టాకు రికార్డులు, బిల్ బుక్కులు పరిశీలించారు, నకిలీ విత్తనాలు అమ్మకాలు జరిగితే కఠిన చర్యలతో పాటు, పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు విత్తన డీలర్లకు విత్తనాలు పర్మిషన్ ఉన్న కంపెనీ నుండి మాత్రమే తిసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విత్తన డీలర్స్ కు విధిగా పాటించాల్సిన నియమాలను సూచించారు. షాప్ పేరు డోర్ నెంబర్ కనిపించే విధంగాఉండాలి, సీడ్ లైసెన్స్ కొనుగోలు దారులకు కనిపించేవిదంగా పెట్టాలి, ధరల పట్టిక రైతులకు కనిపించే విదంగా పెట్టాలని సూచించారు. బ్లాక్ మార్కెటింగ్ చేయరాదని హెచ్చరించారు. అలాగే నిషేధిత వితనాలైన బీటి-3 విత్తనాలు ఎవరైనా అమ్మితే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ఈ తనిఖీలు ఏఈఓ హరీష్, దుకాణ యజమానులు కడెచూర్, తిమ్మయ్య ,మహేష్ యాదవ్‌లు ఉన్నారు

## తాగునీటి కొరత తీర్చాలని మున్సిపల్ కమిష్‌నర్‌కు వినతి

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

గత 6నెలల నుండి 3వ వార్డు శ్రీనగర్ కాలనీలో తీవ్ర త్రాగునిటి ఎద్దడి ఉన్నందున వార్డ్ ప్రజలకు వెంటనే త్రాగునిరు ఎద్దడిని తీర్చాలని ఆవార్డ్ మాజీ కౌన్స్ లర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిష్ నర్ కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం మాజీ కౌన్స్ లర్ కాకర్ల నారాయణమ్మ మాట్లాడుతు నేను కౌన్స్ లర్ ఉన్న హయాంలో ప్రత్యేకంగా శ్రీనగర్ కాలానిప్రజల త్రాగు నీటి కొరత తీర్చేందుకు మిషన్ భగీరథ పైప్ లైన్ వేయించడం జరిగిందని క్రమం తప్పకుండ వచ్చే త్రాగునీరు గత 6నెల ల నుండి త్రాగునిరు నిలిపోయిందని వెంటనే సంబంధిత అధికారులు పైప్ లైన్ మరామత్తు చేయించి నీటి ఎద్దడి నివారించేందుకు కృషి చేయాలని అన్నారు.

# సివిల్ ఫిర్యాదులను కోర్టు లోనే పరిష్కరించుకోవాలి



### జిల్లా ఎస్పీ యోగేష్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

సివిల్ కేసులను కోర్టులోనే పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ.యోగేష్ గౌతమ్ తెలిపారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బాధితుల నుండి భూ తగాదాలకు సంబంధించి-5 ఫిర్యాదులు, ఫ్యామిలీ గొడవలు-02, డబ్బులకు సంబంధించి-01 మొత్తం08 ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిశీలించవలసిందిగా సి ఐ, ఎస్సై లకు సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారులకు ఎస్పీ సూచించారు. బాధితులు తీసుకొవచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్లో ఉంచరాదని వాటిని వెంటనే పరిష్కరించాలని ఫోన్లో మాట్లాడి సంబంధిత అధికారులకు సూచించారు.శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగుతున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

# వనపర్తి నేల మరిచిపోలేని వ్యక్తి జవహర్లాల్ నెహ్రూ

### ఎమ్మెల్యే మేఘా రెడ్డి



**వనపర్తి బ్యూరో మే 27 (జనం సాక్షి)**

భారత మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ నీ వనపర్తి నేల ఎల్లప్పటికి గుర్తుంచుకుంటుందని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అన్నారు. 1959 అక్టోబర్ 11న మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించారనీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. సోమవారం ఆయన వర్ధంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని నంది హిల్స్లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ప్రధానమంత్రిగా కొనసాగిన జవహర్లాల్ నెహ్రూ కి చిన్న పిల్లలంటే చాలా ఇష్టమని ఆయన కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టత కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఛీర్ల చందర్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, వనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, కౌన్సిలర్లు చీర్ల సత్యం, జంపన్న, కృష్ణ బాబు, యాదగిరి, మధు గౌడ్, వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, మైనార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రహీం, పట్టణ ప్రముఖ వైద్యులు పగిడాల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సత్యశీల రెడ్డి, చుక్కరాజు బొంబాయి మన్నెంకొండ నందిమల్ల చంద్రమౌళి, లతీఫ్, కో ఆప్షన్ నెంబర్ కైరున్ షఫీ, ఎంపీటీసీ నాగరాజు నాయక్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ ఉపాధిపై యువత ముందుచూపుతో నడవాలి



పెబ్బేర్లో హొటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**వనపర్తి బ్యూరో మే 27 (జనం సాక్షి)**

యువత ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల కోసం ప్రయత్నం చేస్తూనే వారి సొంత కాలపై నిలబడేందుకు కావలసిన ఉపాధి మార్గాలను ఎంచుకొని భవిష్యత్తులో రాణించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి పేర్కొన్నారు. చిన్నంబావి మండలం కొప్పునూరు గ్రామానికి చెందిన ఉప్పల ప్రవీణ్ కుమార్ రెడ్డి పెబ్బేరు పట్టణంలో ఏర్పాటు చేసుకున్న బావార్చి హొటల్ ను ఆయన సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువకులు ఉద్యోగ లను పొందేందుకు ప్రయత్నాలు చేస్తూనే స్వయం ఉపాధిపై దృష్టి సారించి ఇలాంటి ఉపాధి మార్గాలను ఎన్నుకొని భవిష్యత్తులో రాణించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు అశ్విని సత్యనారాయణ, అక్కమ్మ, భాను ప్రకాష్ రెడ్డి, సురేందర్ గౌడ్, గుమ్మడం వెంకట్రాంరెడ్డి, శ్రీరంగాపురం మండ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలి

### జడ్పిసిఓ ఎల్లయ్య

**వెల్దుర్తి మే 27 (జనం సాక్షి)**

మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు కూలీల సంఖ్యను పెంచాలని జెడ్పిసిఓ ఎల్లయ్య అధికారులను ఆదేశించారు వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం పరిచారు. త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని చూడాలని ఎంపీడీవో కార్యాలయ అధికారులు ఆయన ఆదేశించారు. ఉపాధి హామీ నర్సరీ ఏ విధంగా ఉందని మొక్కలను సంరక్షించాలని ఆయన సూచించారు.






## సాంప్రదాయ కళలకు నిలయాలు బాలకేంద్రాలు

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

భారతీయ సంస్కృతి సాంప్రదాయ కళలకు నిలయాలు బాలకేంద్రలని లయన్స్ క్లబ్ డిస్టిక్ చీప్ కో- ఆర్డినేటర్ శకుంతల ఆత్మ రాం ఏడికే దంపతులు అన్నారు. సోమావారం బాలకేంద్రంలో వివిధ కళాంశాలలో శిక్షణ పొందుతున్న 60మంది చిన్నారుకు పరీక్ష ప్యాడ్‌లతో పాటు స్నాక్స్ పంపిణి చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు నేటి పోటీ ప్రపంచంలో కనుమరుగవుతున్న కళలకు బాలకేంద్రాలు జీవం పోస్తున్నాయని నృత్య సంగీతం తబలా గాత్రం సితార్ చిత్రాలేఖనంలో 60మంది చిన్నారులు శిక్షణ పొందడం అభినంద నీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలకేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పండుగలు ముందుతారాల సమాజ ఐక్యతకు నాంది

### మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి

**వనపర్తి బ్యూరో మే 27 (జనం సాక్షి)**

పెద్దగూడెం తండాలో ఎంపిటిసి దర్మానాయక్ నిర్వహించిన కందూరు, పోచమ్మ పండుగలలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొనీ పూజలు నిర్వహించారు. అనంతరం రావుల చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ గిరిజనులు ఆరాధ్యదైవంగా భావించే పోచమ్మ తల్లి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆశీర్వదించాలని కోరుకున్నారు. పండుగల వల్ల ప్రజలలో సంబందాలు బలపడతాయి అని అన్నారు. రావుల వెంట ఉంగ్లమ్. తిరుమల్, యాదయ్య, ఎం. డి.గౌస్ ఉన్నారు.


### నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయండి

**మల్దకల్ మే 27 (జనం సాక్షి)**

మండల పరిధిలోని అమరవాయి,మల్లెందొడ్డి,కుర్తి రావులచెరువు, గ్రామాలలో సోమవారం రైతులకి నాణ్యమైన విత్తనాల కొనుగోలు గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ..రైతులు వ్యవసాయ శాఖ ద్వారా జారీ చేయబడిన లైసెన్స్ డీలర్లు వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని కొనుగోలు సమయాలలో తప్పనిసరిగా రసీదు పై విత్తన కంపెనీ విత్తన రకం పేరు, లాట్ నెంబర్,డీలర్ సంతకం తప్పకుండ ఉండేలా చూడాలి. లూజ్ సంచులు, పగిలిన ప్యాకెట్ ,డబ్బాల విత్తనాలు,గడువు ముగిసిన విత్తనాలు కొనుగోలు చేయరాదన్నారు.విత్తన ప్యాకెట్ సీల్ ఉన్నదా లేదా విత్తన ప్యాకెట్ పై ముద్రించిన సమాచారాన్ని బిల్లులో ఉన్న వివరాలతో సరిచూసుకోవాలి. రైతులు అధిక దిగుబడి వచ్చే మంచి పేరు గల విత్తనాలనే ఎంచుకోవాలి,రైతులకి ఆశలను అదునుగా చేసుకొని గ్రామాలలో తిరుగుతూ.. ఎలాంటి లైసెన్స్ లేకుండా ఎలాంటి బిల్స్ లేకుండా ఎవరైనా విత్తనాలు రైతులకి అమ్మకానికి చూస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఖాజా భాష, హారిక, సుజాత, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్,ఎంపిటిసి గోపాల్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

# నేటి సమాజంలో విద్యావ్యవస్థ-సవాళ్ళు





బోధించడానికి మరియు మెరుగుపరచడానికి తక్కువ వనరులు వున్న పాఠశాలల్లో సభ్యులుగా యువ నిపుణులను ప్రోత్సహించి విద్యా అసమానతలను తగ్గించడం లక్ష్యం గా పనిచేస్తుంది. విద్య కోసం ఆశా అనే సంస్థ భారతదేశం అంతటా విద్యా ప్రాజెక్టులకు మద్దతు ఇస్తుంది, తక్కువ-ఆదాయ కుటుంబాల పిల్లలకు ప్రాథమిక విద్యపై దృష్టి సారిస్తుంది. అట్టడుగు కార్యక్రమాలకు నిధులు,


అభియాన్ ద్వారా మూడు మునుపటి పథకాలను ఏకీకృతం చేస్తుంది. SSA, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (RMSA), మరియు ఉపాధ్యాయ విద్య (TE) కలిపి దృష్టిసారిస్తోంది. మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రభుత్వ మరియు ప్రభుత్వ-సహాయక పాఠశాలల్లో పిల్లలకు ఉచిత భోజనాన్ని అందిస్తుంది. ముఖ్యంగా పేద కుటుంబాల పిల్లలలో పోషకాహార స్థాయిలను మెరుగుపరచడం, హాజరు మరియు ఎన్రోల్ మెంట్ రేట్లను పెంచడం దీని ప్రధాన ఉదేశ్యం. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (KGBV) ప్రోగ్రాం ద్వారా విద్యపరంగా వెనుకబడిన బ్లాకులలో వెనుకబడిన వర్గాల బాలికల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యలో లింగ అసమానతలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్న కార్యక్రమం. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2019 లో ప్రారంభించిన నాడు-నేడు కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మరియు మొత్తం విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం ద్వారా ప్రైవేట్ సంస్థలతో పోల్చదగిన నాణ్యమైన విద్యను అందించడానికి పాఠశాలలను ఆధునీకరించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం విజయవంతంగా 15,715 పాఠశాలలను పునరుద్ధరించింది, మరుగుదొడ్లు, తాగునీరు, ఫర్నిచర్ మరియు డిజిటల్ తరగతి గదులు వంటి సౌకర్యాలను మెరుగుపరిచింది. అలాగే 2015 లోనే ఢిల్లీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, కొత్త టీచింగ్ మెథడ్స్ (హ్యాపీనెస్ కరికులమ్, ఎంటర్ప్రెన్యూర్‌షిప్ మైండ్‌సెట్ కరికులమ్, దేశభక్తి కరికులమ్) మరియు డిజిటల్ క్లాసురూంస్ ఏర్పాటు చేసి దేశంలోనే ఈ రెండు ప్రభుత్వాలు విద్య లో మంచి ఉదాహరణగా నిలిచాయి.

అలాగే ప్రభుత్వానికి విద్య విషయం లో సహాయానికి నేనున్నాను అనే స్వచ్ఛంద సంస్థలు (NGO\T) మన దేశంలో కోకొల్లలు. ప్రథం అనే సంస్థ పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లల ఫలితాలను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తుంది. రెమిడియల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లను అమలు చేస్తుంది మరియు విద్య నాణ్యతను అంచనా వేయడానికి వార్షిక సర్వేలు (ASER) నిర్వహిస్తుంది. Teach For India అనే సంస్థ నాణ్యమైన విద్య వనరులు అందిస్తుంది. బైజూస్, ఖాన్ అకాడమీ మరియు ఇతర టెక్ సంస్థలు ఉచిత లేదా తక్కువ-ధరతో ఆన్‌లైన్ విద్యా వనరులను అందచేస్తున్నాయి. 'బైజూస్ గివ్' వంటి కార్యక్రమాలు వెనుకబడిన తరగతికి చెందిన పిల్లలకు ఉచిత విద్యా విషయాలను అందచేస్తున్నాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) ద్వారా టాటా, ఇన్ఫోసిస్ మరియు రిలయన్స్ వంటి ప్రముఖ కంపెనీలు గణనీయమైన విద్యా కార్యక్రమాలు అందిస్తున్నాయి.

మరి మన దేశ చదువులు నాణ్యమైన ఉద్యోగులను అందిస్తుందా? భారతదేశంలోని విద్యా వ్యవస్థ చాలా మంది అధిక అర్హత కలిగిన నిపుణులను ఉత్పత్తి చేస్తున్నప్పటికీ అనేక అంశాలు ఉన్నాయి.

అసలు బలాలు ఏంటంటే భారతదేశం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (IITలు), ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (IIMలు), మరియు ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (AIIMS) వంటి అనేక ప్రతిష్టాత్మక సంస్థలను కలిగి ఉంది, అవి వాటి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఈ సంస్థల నుండి గ్రాడ్యుయేట్లు తరచుగా భారతదేశం మరియు విదేశాలలో అధిక-వేతనంతో కూడిన ఉద్యోగాలను పొందుతున్నారు. భారతదేశం ప్రతి సంవత్సరం పెద్ద సంఖ్యలో ఇంజనీర్లు, వైద్యులు మరియు IT నిపుణులను ఉత్పత్తి చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న భారతీయ నిపుణులతో గ్లోబల్ ఐటి పరిశ్రమలో దేశం గణనీయమైన ఉన్నత స్థానంలో వుంది. బలహీనతలు తీసుకుంటే నాణ్యత వ్యత్యాసం, నైపుణ్యం సరిపోలలేదు తీవ్రంగా వుంది. ఉదాహరణకు, ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2021 పరిశ్రమ ప్రమాణాల ప్రకారం కేవలం 45.9% గ్రాడ్యుయేట్లు మాత్రమే ఉపాధి పొందగలరని తేల్చిచెప్పింది. నిర్దిష్ట వ్యాపారాలు, వృత్తుల కోసం విద్యార్థులను సిద్ధం చేయడానికి నైపుణ్యం ఆధారిత శిక్షణ మరియు వృత్తి విద్యా కోర్సులపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

మరి ఈ లోటుని పూడ్చటానికి ప్రభుత్వం ఏం చేస్తుంది అంటే స్కిల్ ఇండియా మిషన్ ద్వారా 2022 నాటికి 400 మిలియన్ల మందికి వివిధ నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వడానికి ప్రారంభించబడింది. స్వల్పకాలిక శిక్షణ మరియు ధృవీకరణను అందించే ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (PMKVY) వంటి కార్యక్రమాలను కలిగి ఉంటుంది. జాతీయ విద్యా విధానం (NEP) 2020 ద్వారా క్రిటికల్ థింకింగ్, సృజనాత్మకత మరియు మల్టీడిసిప్లినరీ లెర్నింగ్‌కు ప్రాధాన్యతనిస్తూ విద్యావ్యవస్థను మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. పాఠ్యాంశాలు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉండేలా విద్యా సంస్థలు మరియు పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంచడం. ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లు, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లు మరియు పరిశ్రమ-ప్రాయోజిత పరిశోధన ప్రాజెక్ట్‌లు నిర్వహించి నిరుద్యోగ నిర్మూలనకి పాటుపడుతున్నాయి.




భారతదేశ విద్యా వ్యవస్థ నాణ్యమైన ఉపాధి అవకాశాలను అందించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ, ఈ సామర్థ్యాన్ని పూర్తిగా గ్రహించడానికి అనేక సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. విద్య యొక్క నాణ్యతని మెరుగుపరచడం, నైపుణ్యం-ఆధారిత శిక్షణను పెంపొందించడం, పరిశ్రమ-విద్యా భాగస్వామ్యంను ప్రోత్సహించడం కీలకం. భారతదేశంలో కొనసాగుతున్న సంస్కరణలు విద్య మరియు ఉపాధికి మధ్య అంతరాన్ని తగ్గించే దిశగా సానుకూల పథంలో ఉంది అని చెప్పటానికి ఎటువంటి సందేహము లేదు.



**ఇమ్మడి సంధ్య సతీష్**
**కోదాడరి**

# తల్లిదండ్రులే మొదటి గురువులు



పిల్లల సమగ్ర అభివృద్ధిలో పాఠశాల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలక పాత్ర పోషిస్తారు. తల్లిదండ్రులు పిల్లలకు మొదటి గురువు మరియు ఉపాధ్యాయుడు రెండవవారు. పిల్లల వ్యక్తిత్వాన్ని రూపొందించడంలో ఇద్దరికీ అపారమైన సహకారం మరియు బాధ్యత ఉంది.

ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి అలవాట్లను అందించాలి. పిల్లలు తమ తల్లిదండ్రుల నుండి ప్రతిదీ నేర్చుకుంటారు. మంచి మర్యాదగల పిల్లలు ఎల్లప్పుడూ మంచి లక్షణాలతో ఉంటారు. తల్లిదండ్రులు పిల్లల్లో మంచి అలవాట్లు పెంపొందిస్తే అలాంటి పిల్లలు తల్లిదండ్రుల పేరును వెలుగులోకి తెస్తారు. ఒక వ్యక్తి తన జీవితంలో చీకటిని తొలగించాలంటే విద్య చాలా ముఖ్యం. విద్య మనిషి జీవితంలోని అన్ని రకాల చీకట్లను తొలగిస్తుంది. విద్య ద్వారా మనిషి తన జీవితాన్ని సార్థకం చేసుకోగలడు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువులో ఎప్పుడూ ప్రోత్సహించాలి. తమ పిల్లలకు మంచి విద్యను అందించడంలో ఎప్పుడూ విఫలం కాకూడదు. విద్య లేని వాడు వింత పశువు అని అందుకే అంటారు.

తల్లిదండ్రులు మొదటి నుండి పిల్లలకు మంచి చెడుల గురించి అవగాహన కల్పించాలి. పిల్లలు కూడా నిజం మాట్లాడేలా ప్రోత్సహించాలి. మీ బిడ్డ ఏదైనా తప్పు చేస్తున్నట్లు మీరు చూస్తే, వారిని సమర్థించే బదులు ఏది ఒప్పో ఏది తప్పుదో నేర్పించాలి. అలాగే జీవితంలో స్ఫూర్తిని పొందేందుకు వారిని ఎల్లప్పుడూ ప్రేరేపించాలి. తల్లిదండ్రులు మొదటి నుండి పిల్లలకు క్రమశిక్షణ నేర్పాలి. పిల్లల్లో క్రమశిక్షణ ఉంటేనే జీవితంలో అన్నీ సమయానికి జరుగుతాయి. క్రమశిక్షణ ద్వారా, పనిని సమయానికి పూర్తి చేయడం ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటారు. క్రమశిక్షణ కలిగిన పిల్లలు మెరుగైన లక్ష్యాలను సులభంగా సాధిస్తారని గురువులు చెప్తారు.

నేడు పెరుగుతున్న పిల్లలు అందరితో పోటీగా పెరిగే పరిస్థితికి బలవుతున్నారు. జీవితంలో ఏ దశకు వెళ్లినా తమ స్థానాన్ని దక్కించుకోవడానికి ఎవరితోనైనా పోటీ పడాల్సిందే. కొన్నిసార్లు వారి ప్రయత్నాలు కొన్ని విఫలం కావచ్చు. కానీ అలాంటి వాటి కోసం వారు హృదయాన్ని కోల్పోకూడదు. ఎన్ని ఆపదలు వచ్చినా, కష్టాలు వచ్చినా ఆటోమేటిక్‌గా కోలుకుని తన లక్ష్యం వైపు వెళ్లాలి,లక్ష్య-ఆధారితంగా మార్చడంలో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమైనది. తల్లిదండ్రులు తమ పిల్లలకు నేర్పించగల ముఖ్యమైన లక్షణాలలో స్వీయ ప్రేరణ ఒకటి. తల్లిదండ్రులు తమ పిల్లలకు దీన్ని సరిగ్గా నేర్పిస్తే, పిల్లలు తమ జీవితాలను తాము చూసుకుంటారు. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను స్వీయ ప్రేరణతో పెంచడానికి కొన్ని సాధారణ దశలను అనుసరించాలి.

పిల్లలకు స్వీయ-ప్రేరణను నేర్పడానికి, ముందుగా వారికి సాధించగల లక్ష్యాన్ని నిర్దేశించండి. మరియు ఆ లక్ష్యాన్ని సాధించడానికి వారు స్వయంగా ప్రణాళికలు వేసుకోవాలి మరియు ఆ లక్ష్యం వైపు వెళ్ళడానికి వారిని ప్రోత్సహించాలి. ఇలా చేయడం ద్వారా, పిల్లలు ముందుగా ఏమి చేయాలి . సంభావ్య ప్రాముఖ్యత గురించి బాగా నేర్చుకుంటారు. వారు తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి కష్టపడుతుంటే వారికి చిన్నపాటి సహాయాన్ని అందించి ప్రోత్సహించవచ్చు.

కృషి ముఖ్యం, ఫలితాలు కాదు: లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన కృషి గురించి ఎల్లప్పుడూ బోధించండి. ఫలితం ఏమైనప్పటికీ, మనం మన 100% కృషి మరియు కృషిని అందించాలి.

మీ పిల్లల పనితీరు , ప్రవర్తనల గురించి వారితో స్పష్టంగా కమ్యూనికేట్ చేయడం ముఖ్యం. ఇది వారి స్వంత అభివృద్ధిపై దృష్టి పెట్టడానికి, వారి తల్లిదండ్రులు వారి నుండి ఏమి ఆశించడానికి అనుమతిస్తుంది.వారు ఇష్టపడే పనులను ఎంచుకునే హక్కును వారికి ఇవ్వండి. అందువల్ల, వారు ఏదైనా చేయాలని ఎంచుకున్నప్పుడు, వారి అన్ని పరిణామాలకు వారు బాధ్యత వహిస్తారు. ముందుగా, ఏదైనా తప్పు జరిగితే, ఆ తప్పుకు తామే బాధ్యులమని భావించి, దాన్ని సరిదిద్దడానికి ప్రయత్నిస్తారు. తల్లిదండ్రులు పిల్లల్ని స్వేచ్ఛగా చదవనీయాలి అన్ని విషయాల్లో అవగాహన వచ్చే విధంగా చెప్పాలి ముందు మనం ఆదర్శంగా వాళ్ళకి నిలవాలి చదువు అనేది ఇష్టంగా చదవాలి కానీ కష్టంగా చదవొద్దు వారికి ఎందులో నైపుణ్యం ఉంటే దాని వైపే అడుగులు వేయించాలి. అప్పుడే నూతన రూపకల్పన జరుగుతాయి నూతన ఆవిష్కరణలు జరుగుతాయి.

భవిష్యత్తు తరాలను సువర్ణ అక్షరాలతో లికించే భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుదాం



**వీరవెల్లి శ్రీలత**
**ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్**
**నేరేడుచర్ల**

# తెలంగాణ సాహిత్యానికి సురవరం చేసిన కృషి చిరస్మరణీయం

- జిల్లా అధ్యక్షులు సాహితీ కళా వేదిక పలుస శంకర్ గౌడ్
- సీనియర్ కవులకు సన్మానం

**వనపర్తి బ్యూరో మే27( జనంసాక్షి) :**
సురవరం ప్రతాపరెడ్డి జయంతిని పురస్కరించుకొని సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి పట్టణానికి చెందిన సీనియర్ కవులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు సాహిత్యానికి విశిష్టమైన సేవలందించారని గుర్తు చేశారు. ప్రతాపరెడ్డి రచించిన గోల్కొండ కవుల సంచిక,ఆంధ్రుల సాంఘిక చరిత్ర,హైందవ ధర్మ వీరులు,హిందువుల పండుగలు మున్నగు గ్రంధాలు ఆయన ప్రతిభకు నిదర్శనంగా పేర్కొన్నారు. ఆయన సంపాదకత్వం వహించిన గోల్కొండ కవుల సంచిక తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిందని వివరించారు. తెలుగు సాహిత్యానికి తమవంతు సేవలందిస్తున్న కవులు కందూరు నారాయణరెడ్డి, జనజ్వాల, సందాపురం బిచ్చయ్య, వీరాచారి, నాగేంద్ర గౌడ్, మాందాపురం సుజాతమ్మ లను నిర్వాహకులు శాలువా జ్ఞాపికలతో సన్మానించారు. ఈనాటి కార్యక్రమంలో బైరోజు చంద్ర శేఖర్,సత్తార్,హెడ్ మాస్టర్స్ సూర చంద్ర శేఖర్,మద్దిలేటి,రాములు యాదవ్,డా.బి.శ్యాం సుందర్,డా.నరేశ్ కుమార్ , బొజ్జీ బాబు,బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# కౌంటింగ్ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు

- మల్కాజిగిరి రిటర్నింగ్ అధికారి గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 27 (జనంసాక్షి) :**
మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల ఓట్ల కౌంటింగ్ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎన్నికల మల్కాజిగిరి రిటర్నింగ్ అధికారి గౌతమ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జూన్ 4న జరగనున్న మల్కాజ్గిరి ఏడు పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ను పకడ్బందీగా నిర్వహించాలని, మల్కాజ్గిరి జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్ నియోజకవర్గం ఏ ఆర్ఓ లను ఆదేశించారు. సోమవారం విసి మీటింగ్ హాల్లో మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్ పల్లి, ఉప్పల్, ఎల్ బి నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గాల ఏ ఆర్వోలతో కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 4న జరుగుతున్న ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పగడ్బందీగా నిర్వహించాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన చర్యల గురించి, ఏఆర్వోలకు కలెక్టర్ సూచనలు చేశారు. జూన్ 4వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలు పెట్టాలన్నారు. కౌంటింగ్ కు కావలసిన టేబుల్స్ నియోజకవర్గాల వారీగా మేడ్చల్ 28, మల్కాజిగిరి 20, కుత్బుల్లాపూర్ 28, కూకట్ పల్లి 20, ఉప్పల్ 20, ఎల్ బి నగర్ 28, సికింద్రాబాద్ కంటోన్మెంట్ 14, పోస్టల్ బ్యాలెట్ కు 20 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్ పల్లి,ఉప్పల్, నియోజకవర్గాలకు కౌంటింగ్ కేంద్రాలు హోలీ మేరీ కాలేజీలో నిర్వహించడం జరుగుతుంది.ఎల్ బి నగర్ నియోజక వర్గానికిగానూ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ సిఎస్ఐ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ టెక్నాలజీ వెస్లీ కాలేజీలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందనీ తెలిపారు. అన్ని నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ హోలీ మేరీ కాలేజీలో నిర్వహించడం జరుగుతుందనీ తెలిపారు. ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పకడ్బందీగా పోలీసులను ఏర్పాటు చేయాలన్నారు. గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. మొబైల్ ఫోన్లు లోపలికి అనుమతించడం జరగదనీ తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కౌంటింగ్ హాల్లో టేబుల్స్, సీసీ కెమెరాలు, విద్యుత్, ఇంటర్నెట్, ఫ్యాన్స్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి టి, స్నాక్స్, భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, విజేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, ఏడు నియోజకవర్గాల ఏఆర్వోలు, ఎలక్షన్ సెల్ సూపర్నెంట్ రాజేశ్వర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# మంథనిలో 60 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



**మంథని, మే 27 (జనంసాక్షి) :** రామగుండము పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాసులు .ఐపీఎస్., (ఐజీ) ఆదేశాల మేరకు సోమవారం పెద్దపల్లి జోన్ మంథని పోలీస్ స్టేషన్ పరిధి చుట్టప్రక్కల ప్రాంతాల నుండి తక్కువ ధరలకు కొనుగోలు చేసి మంథని పట్టణం లయన్ గడ్డ ఏరియా లోని ఒక ఇంట్లో నుండి ట్రాలీ ద్వారా అక్రమంగా పిడిఎస్ రైస్ తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్సై, సిబ్బంది ఆకస్మిత తనిఖీ చేయగా పిడిఎస్ రైస్ నింపిన ట్రాలీ ఒకటి గుర్తించడం జరిగింది. దానిలో సుమారు 40 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ గలదు అట్టి పిడియస్ రైస్ సయ్యద్ అస్లాంకి చెందినదిగా గుర్తించడం జరిగింది. అదేవిధంగా మంథని గంగాపూర్ గ్రామ శివారు ఏరియా లోని ఒక గుడిసె వేసి పిడియస్ బియ్యాన్ని నిల్వ ఉంచారనే నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్సు సిబ్బంది తనిఖీ నిర్వహించగా బ్యాగ్ లలో నింపి ఉన్న 20 క్వింటాళ్ల పిడియస్ రైస్ రాచర్ల రమేష్ కి చెందినవి గా గుర్తించి పిడిఎస్ రైస్ స్వాధీన పరుచుకోవడం జరిగింది. రెండు ప్రాంతాలలో పట్టుకొన్న 60 క్వింటాళ్ల పిడియస్ రైస్, ట్రాలీని తదుపరి విచారణ నిమిత్తం మంథని పోలీస్ స్టేషన్ వారికీ అప్పగించడం జరిగింది.

## నూతన బీజేఎంసీ భవనాన్ని పరిశీలించిన మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్

రాజేంద్రనగర్, మే27 (జనం సాక్షి)
బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మహిళా మేయర్‌గా మద్దెల లతా ప్రేమ్ గౌడ్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత సోమవారం కిస్మత్పుర్ లోని మున్సిపల్ కార్పొరేషన్ భవనాన్ని డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, కార్పొరేషన్ కార్పొరేటర్లతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బి.శరత్ చంద్ర, డిఇఇ యాదయ్య ,కార్పొరేటర్లు నిఖిల సంగారెడ్డి, అనిత వెంకటేష్, అస్లంబిన్ అబ్దుల్లా, రవీందర్ రెడ్డి, ప్రశాంత్ నాయక్ , నాయకులు ప్రేమ్ గౌడ్, రాజిరెడ్డి, గోపాల్ ముదిరాజ్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.






## అతిపెద్ద అవుట్‌లెట్‌ను ప్రారంభించిన దాదూస్

### కన్వెన్షన్ వ్యాపారంలో ప్రవేశించినట్లు వెల్లడించిన గ్రూప్


**ఖైరతాబాద్, మే 27 (జనం సాక్షి) :**
సాంప్రదాయ, సమకాలీన భారతీయ స్వీట్లు, స్నాక్స్‌కు ప్రసిద్ధి చెందిన ప్రఖ్యాత బ్రాండ్ దాదూస్ తమ సరికొత్త అవుట్‌లెట్‌ను హైదరాబాద్‌లోని కొంపల్లిలో ప్రారంభించినట్లు దాదూస్ యజమాని రాజేష్ దాదు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తాజా అవుట్‌లెట్ వారి అతిపెద్ద అవుట్‌లెట్స్‌లో ఒకటిగా నిలవడమే కాకుండా నగరంలో వారి పదవ స్టోర్‌గా నిలుస్తుందన్నారు. అన్ని రకాల ఉత్పత్తులను సౌకర్యవంతంగా ఒకే చోట ఇక్కడ అందించనున్నారు. దాని ప్రఖ్యాత ఆల్-వెజిటేరియన్ మెనూతో, వారు శాఖాహార భోజన ప్రియుల ప్రాధాన్యతలను తీర్చగల అనేక రకాల వంటకాలను అందిస్తారు. అసాధారణమైన ఆహారం, డెజర్ట్‌లను అభినందిస్తున్న యువత, నగర వాసుల అభిరుచులను తీర్చడానికి ఇది రూపొందించబడిందన్నారు. మేనేజింగ్ పార్టనర్ ముస్కాన్ దాదు మాట్లాడుతూ మసాలా రిపబ్లిక్ లోని మెనూలో ఫ్యూజన్ చాట్, మోడరన్ ఇండియన్, కాంటినెంటల్, చైనీస్, ఇతర రకాల శ్రేణి వంటకాలు అందుబాటులో ఉంటాయన్నారు. శాఖాహారం పట్ల రెస్టారెంట్ యొక్క అంకితభావం వారి ట్యాగ్‌లైన్, ది వెజిటేరియన్ లో ప్రతిబింబిస్తుందన్నారు.

# మెడికల్ కళశాల కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- మృతి చెందిన రావుల విజయ్ కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలి
- పెద్దపల్లి జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి (ఏఎల్ఓ)కు వినతి పత్రం

**గోదావరిఖని, మే 27, (జనం సాక్షి):**
స్థానిక మెడికల్ కళాశాల నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్మాణం చేస్తున్న ప్రాంతంలో ఎలాంటి భద్రత, రక్షణ చర్యలు చేపట్టకుండా ప్రజల ప్రాణాలు పోయే విధంగా చేలాగాటమాడుతున్నారని పెద్దపెల్లి జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి (ఏఎల్ఓ) రామ్మోహన్ కి డిహెచ్పిఎస్ నాయకులు జిల్లా కేంద్రంలోని తన ఛాంబర్ లో సోమవారం రోజున దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి రాజారత్నం, రాష్ట్ర సమితి సభ్యులు మద్దెల దినేష్, రామగుండం నగర కార్యదర్శి ఎర్రల రాజయ్య, జిల్లా నాయకులు బోద్దుల రమేష్ కలిసి వినతిపత్రం ఇచ్చారు.

అనంతరం మద్దెల దినేష్, రాజారత్నం మాట్లాడుతూ నియంతలాగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ పనులు చేస్తున్న ప్రదేశంలో కార్మికులకు సరైన పనిముట్లు వారికి ఎలాంటి భద్రత లేకుండా శ్రమదోపిడి చేస్తే ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా ప్రజల ప్రాణాలు పోయే విధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బుధవారం రోజున రావుల విజయ్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ముందు నూతన బిల్డింగ్ నిర్మిస్తున్న మెడికల్ కళాశాల కాంట్రాక్టర్ ఎలాంటి భద్రత రక్షణ చర్యలు చేపట్టకుండా పనులు చేస్తుండగా రావుల విజయ్ అతి పెద్ద గోతిలో పడి మృతి చెందితే, మాకు ఎలాంటి సంబంధం లేదని కంట్రాక్టర్ చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. నిరుపేద దళితుడైనటువంటి విజయ్ కుటుంబానికి ఎలాంటి ఆధారం లేదని ఉన్న కొడుకును పోగొట్టుకొని తల్లి దుఃఖ సాగరంలో ఉందని కనీసం మానవత్వం లేని నియంత అయిన కాంట్రాక్టర్ మానవతా దృక్పథంతోనైనా నష్టపరిహారం ఇవ్వకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నారని కావున కాంట్రాక్టర్ పై హత్య నేరం కేసు నమోదు చేసి మృతి చెందిన విజయ్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని అసిస్టెంట్ లేబర్ అధికారి రామ్మోహన్ కి విన్నవించడం జరిగిందన్నారు. వారు కూడా సానుకూలంగా స్పందించి సమగ్ర విచారణ చేసి మృతి చెందిన కుటుంబానికి న్యాయం చేసేలాగా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.







## ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ గౌతమ్ దంపతులు

**ఖమ్మం అర్బన్, (జనంసాక్షి):**
.శాసనమండలి వరంగల్-ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉపఎన్నికల పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ దంపతులు ఓటు హక్కు వినియోగింబుకున్నారు. ఖమ్మం ఎస్ఆర్%ಡ%బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలను సందర్శించి, కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల సంఖ్య 313, 314, 315, 316 లలో ఓటింగ్ సరళిని ఖమ్మం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ పరిశీలించారు.



## ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ వెంకట్రావు

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
ఓటు అమూల్యమైందని,పట్టభద్రులు తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరుగుతుందని తెలిపారు.అనంతరం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తో కలసి జిల్లాలో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. పట్టభద్రులు విధిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ సిఈఓ అప్పారావు, డిఆర్డిఎ పిడి మధుసూదన్ రాజు, డిపిఓ సురేష్ కుమార్, ఏఓ సుదర్శన్ రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, తహశీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

### పోలింగ్ ముగిసే సమయానికి 73.56 శాతం పోలింగ్ నమోదు..

### పటిష్టమైన పోలీసు భద్రత వ్యవస్థ - ఓటు హక్కు వినియోగించుకున్న గ్రాడ్యుయేట్స్

**దేవరకొండ (జనంసాక్షి):**
వరంగల్-ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పోలింగ్ ఉదయం 8 గంటలకే ప్రారంభమైంది. అన్ని చోట్ల ఎలాంటి సమస్యలూ లేకుండా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. దేవరకొండ సెగ్మెంట్ లో 15 పోలింగ్ కేంద్రాలను అధి కారులు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బ్యాలెట్ పద్ధతిలో ఎమ్మెల్సీ ఎన్నిక ప్రారంభం అయ్యింది. పోలింగ్ కేంద్రాల వద్ద దేవరకొండ డిఎస్పీ గంటా గిరిబాబు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు నల్గొండలోని స్ట్రాంగ్ రూంకు అధికారులు తరలించారు. దేవరకొండ సెగ్మెంట్లో 15 పోలింగ్ కేంద్రాలు, మొత్తం ఓటర్లు11626 గాను 8552 ఓట్లు 73.56 శాతం పోలయ్యాయని అధికారులు వెల్లడించారు. 8063 పురుషులలో 6055 మంది,3568 మహిళా ఓటర్లలలో 2497 మంది ఓటు హక్కును వినియోగించు కున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను నల్లగొండ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నిక ఫలితాలను జూన్ 5వ తేదీన వెల్లడించనున్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి నిదర్శనం

### ఓటు వేయకపోవడమంటే మనల్ని మనం నష్టం చేసుకోవడమే

### సూర్యాపేటలో ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
ఓటు హక్కును వినియోగించుకోవడం అనేది ప్రజాస్వామ్యానికి నిదర్శనం అని, ఓటు వేయకపోవడం మనల్ని మనం మోసం చేసుకోవడమేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ సందర్భంగా సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రారంభ సమయం 8 గంటలకే 457వ పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్న ఆయన ఆ బూతులో 673 మంది ఓటర్లు ఉండగా మొదటి ఓటు వేసి ఆదర్శప్రాయంగా నిలిచారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మన సమస్యలను ప్రతిబింబిస్తూ సమాజానికి ఉపయోగపడే వ్యక్తులను ఎన్నుకోవాలని కోరారు.పట్టభద్రులు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.



## ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్



**ఖమ్మం బ్యూరో, మే 27 (జనంసాక్షి):**
ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరుగుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. సోమవారం శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ పురస్కరించుకుని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల తనిఖీ చేసి, పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఎంత మంది ఓటర్లు ఉన్నది, అప్పటికి ఎంతమంది ఓటుహక్కు వినియోగించుకున్నది అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రం బయట పోలింగ్ ప్రక్రియ విధానం, ఎలా ఓటు వేయాలో వివరిస్తూ తయారుచేసిన ఫ్లెక్సీ ని పరిశీలించారు. ఓటు ప్రాధాన్యతాక్రమంలో వేయాలి కాబట్టి, ఓటు ఇన్వాలిడ్ అవకుండా ఓటర్లకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించ బడుతుందని ఆయన తెలిపారు. పట్టభద్రులు ఓటర్లు కనుక, వారు చైతన్యవంతులని, విషయజ్ఞానం ఉన్నవారని అన్నారు. నమోదైన పట్టభద్రులందరు ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో 15 సెక్టార్లను ఏర్పాటు చేసి, ఆర్మ్ గార్డ్ తో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రాలకు, పోలింగ్ అనంతరం, ఏజెంట్ల సమక్షంలో సీల్ చేసి, తిరిగి రిసిప్షన్ కేంద్రానికి చేరుకొని, అక్కడి నుండి నల్గొండలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంలకు భద్రత నడుమ తరలిస్తామని ఆయన అన్నారు.

## ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతం

**కల్లూరు మే 27(జనంసాక్షి):**
ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు కల్లూరు మండలంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగినఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది . రెవిన్యూ డివిజన్ కేంద్రం కల్లూరు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 3720.ఓట్లకు 2505 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ బూత్ నెంబర్ 289లో మొత్తం 931 మంది ఓటర్లకు గాను 635 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బూత్ నంబర్ 290లో 616/930, పోలింగ్ బూత్ నెంబర్ 291 లో633/928, పోలింగ్ బూత్ నెంబర్ 292లో. 621/931 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకున్న రు. మొత్తంగా పోలింగ్ 67.33 శాతం నమోదయింది. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ పర్యవేక్షణ కు సంబంధించి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి గా కల్లూరు ఆర్డిఓ రాజేంద్ర గౌడ్, అబ్జర్వర్ గా తాసిల్దార్ పులి సాంబ శివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, రెవిన్యూ శాఖ గిర్దావర్లు స్టాలిన్, అన్వర్, సిబ్బంది విధులు నిర్వహించారు . పోలింగ్ సందర్భంగా ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా కల్లూరు ఏసిపి అని శెట్టి రఘు ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై ఎస్కే షాకీర్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి సిబ్బందితో కలిసి విధులు నిర్వహించారు.

## ప్రశాంతంగా ముగిసిన పట్టభద్రులు ఎన్నికలు

### - 68% పోలింగ్ నమోదు

**సత్తుపల్లి, మే 27 (జనంసాక్షి) :**
సత్తుపల్లి నియోజకవర్గంలో పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఐదు మండలాల పరిధిలో 20 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయం ముసేసరికి 70 శాతం మంది పట్టబద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా 10 గంటల వరకు 8.56 శాతం, 12 గంటల వరకు 30 శాతం, మధ్యాహ్నం రెండు గంటల వరకు 53 శాతం, పోలింగ్ సమయం విశ్లేష సమయానికి 68 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నా రు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగియటం పట్ల అధికారులు రాజకీయ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్, డాక్టర్ దయానంద్ విజయ్ కుమార్ దంపతులు క్యూలైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగించు కున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎన్నికల సరళి ని పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్ని మండల కేంద్రాలను కలిగి తిరిగారు. బి ఆర్ ఎస్ పార్టీ నాయకులతో పోలింగ్ సందర్భంగా అనుసరించిన విధానాలపై చర్చలు జరిపారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

### విలువైన మోటార్ సైకిల్ (67) మోటార్ సైకిల్లు స్వాధీనము : జిల్లా యస్పీ చందనా దీప్తి

**నల్గొండటౌన్, మే 27(జనంసాక్షి)**
గత కొంత కాలం నుండి తెలంగాణ రాష్ట్రం లో నల్లగొండ, తిప్పర్తి, మిర్యాలగూడ, నార్కెట్ పల్లి, నకిరేకల్, సూర్యాపేట, భువనగిరి, మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లోని పిడుగురాళ్ల, దాచేపల్లి, చిలకలూరిపేట, యెడ్ల పాడు, మంగళగిరి, గుంటూరు ప్రాంతాల్లో బుల్లెట్ మరియు పల్సర్ మోటార్ సైకిళ్ళు దొంగతనాలకు పాల్పడుచూ పోలీసులకు సవాలు గా మారిన (05) గురు సభ్యులు గల అంతర్రాష్ట్ర దొంగల ముఠాను జిల్లా ఎస్ పి చందనా దీప్తి ఆదేశాల మేరకు నల్గొండ డీస్పీ కే.శివరాం రెడ్డి పర్యవేక్షణ లో నల్గొండ-II టౌన్ సర్కిల్ సీఐ బి.డానియెల్ కుమార్ ఆధ్వర్యం లో నల్గొండ-IIటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ ఐ ఆర్.నాగరాజు మరియు హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్ గిరి, కానిస్టేబుల్ లు బాలకోటి, లింగస్వామి, మహేశ్ లు అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.90 లక్షల విలువైన (20) బుల్లెట్ మోటార్ సైకిళ్ళ మరియు (47) పల్సర్ మోటార్ సైకిళ్ళు మొత్తం 67 బైకులు స్వాధీనము చేసుకున్నారు.పై నేరస్తులు రెండు ముఠాలుగా ఏర్పడి తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నల్గొండ ,తిప్పర్తి ,మిర్యాలగూడ ,సూర్యపేట , భువనగిరి , పిడుగురాళ్ల, దాచేపల్లి ,చిలకలూరిపేట , యెడ్లపాడు,మంగళగిరి పట్టణాలలో రద్దీ గా ఉన్న ప్రదేశాలలో మరియు ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న బైక్ లను రెక్కి నిర్వహించి ఎవరికి అనుమానం రాకుండా నేరాలు చేస్తారు. వారిలో నేరస్థుడు A1 అయిన తుపాకుల వెంకటేష్ బైక్ యొక్క హాండిల్ లాక్ లను విరగొట్టి బ్యాటరీ వైర్లను కలిపి బైక్ లను స్టార్ట్ చేసి దొంగలించుకొని,అట్టి బైక్ ల నెంబర్ మార్చి అదే రంగు మరియు అదే కంపెనీ కి చెందిన మరొక బైక్ యొక్క నెంబర్ అమర్చుతారు. A3 అయిన అంకమ్మ రావు మరియు A4 అయిన శ్రీకాంత్ దొంగిలించి తెచ్చిన బైక్ లను A1 మరియు A2 యొక్క ఆదేశాలతో నెంబర్ ప్లేట్లను మార్చి రహస్య ప్రదేశాలలో దాచి అట్టి బైక్ లను అమాయక ప్రజలకు అమ్ముతారు. ఆ విధంగా వచ్చిన డబ్బులను అందరూ సమానంగా పంచుకుంటారు. నల్గొండ పానగల్ బైపాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పై నేరస్థులు అనుమానాస్పదం గా కనిపించడం తో నల్గొండ-II టౌన్ పోలీసులు పట్టుబడి చేసి నేరస్తుల నుండి బైక్ లు, మొబైల్ ఫోన్లు మరియు ఒక డమ్మీ పిస్టల్ ను స్వాదీన పరచుకోవడం జరిగింది.పై నేరస్థులను అరెస్టు చేసి, బైక్ లను స్వాదీనం చేసుకోవడం లో ప్రతిభ కనబరచిన పోలీస్ అధికారులైన మహేశ్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.



## పోలీస్ గ్రీవెన్స్ డేకు ఆరు ఫిర్యాదులు

### జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా వివిధ సమస్యలపై బాధితుల నుండి వచ్చిన అర్జిలను స్వీకరించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ఆరు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలీసు స్టేషన్ ల అధికారులతో మాట్లాడుతూ పోలీస్ పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. బాధితులకు కచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. భార్యాభర్తల తగాదాల వల్ల సమస్యలు పెరిగి కుటుంబం విడిపోతుందని, పిల్లలు మంచి భవిష్యత్తును కోల్పోతారని, సమాజంలో గౌరవం తగ్గుతుంది కావున భార్యాభర్తలు సమస్యలను అధిగమించి మంచి తల్లిదండ్రులుగా ఉండాలని కోరారు.

## రాయల వెంకట శేషగిరిరావుకు ఎంపీ నామ నాగేశ్వరరావు నివాళి



**ఖమ్మం టౌన్, మే 27 (జనంసాక్షి)**
డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశ దిన కర్మ సందర్భంగా బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్ల మెంట్ సభ్యులు నామనాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. ఈసందర్భంగా ఆయన పార్టీకి ప్రజలకు చేసిన ఎనలేని సేవలను స్మరించుకున్నారు. తెలుగుదేశం పార్టీలో పని చేసినప్పటి నుంచి రాయలతో తనకున్న అనుబంధాన్ని నామ ఈ సందర్భంగా గుర్తు చేసు కున్నారు. రాయల నిబద్ధత గల రాజకీయ నాయకుడని కొని యాడారు. వివిధ పదవుల ద్వారా రాయల ప్రజలకు, ముఖ్యంగా రైతాంగానికి ఎంతో ఎవ చేసి, తనదైన ముద్ర వేశారని అన్నారు. రాయల పార్టీకి ఎనలేని సేవలు అందిం చారని అన్నారు. ఎల్లప్పుడు వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఆయన అడుగు జాడల్లో నడవాలని కార్య కర్తలకు సూచించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో టీడీపీలో చేరి.వివిధ పదవుల ద్వారా రాయల శేషగిరిరావు ప్రజలకు ఎంతో సేవ చేశారని అన్నారు. చనిపోయేంత వరకు రైతు పక్షపాతిగా ఉంటూ రైతాంగ సమస్యలపై అలుపెరగనిపోరాటం చేశారని, రైతుల కోసం ఎంతో శ్రమించారని చెప్పారు. టీడీపీలో ఉన్న ప్పుడు తల్లాడ మండలం గంగదేవిపాడు సొసైటీ అధ్యక్షునిగా రైతుల కోసం పాటుపడ్డారని చెప్పారు. డీసీసీబీ డైరెక్టర్ గా పని చేశారన్నారు. తర్వాత 2019 నుంచి 2023 వరకుడీసీఎంఎస్ చైర్మన్ గా పని చేసి, ప్రజలకు ఎనలేని సేవలు అందించిన నేత రాయల అనినామ కొనియాడారు. పార్టీ బలోపేతానికి ఆద్యాంతం శ్రమించిన నాయకుడని పేర్కొన్నారు. శోకతప్తులైన వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నట్లు నామ నాగేశ్వ రరావు పేర్కొన్నారు. శేషగిరిరావు చనిపోయిన రోజు కూడా అంత్యక్రియల్లో స్వయంగా పాడె మోసి, కడసారి కన్నీటి వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే..

## ఎన్నికల కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉండాలి






**ఖమ్మం బ్యూరో, మె27((జనంసాక్షి)**
లోకసభ సాధారణ ఎన్నికల కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధంగా ఉండాలని భారత ఎన్నికల కమిషన్ ముఖ్య ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ అన్నారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల కమిషన్ ముఖ్య ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు గ్యానేష్ కుమార్, డా. సుక్ భీర్ సింగ్ సందులతో కలిసి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ, సన్నద్ధతపై నిర్వహించిన వీడియో సమావేశంలో హైదరాబాద్ నుండి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి పాల్గొనగా, ఖమ్మం నూతన కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా భారత ఎన్నికల కమిషన్ ముఖ్య ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ, జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ప్రకటించే కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని, దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ కేంద్రంలో ఫలితాలు వెలువడించేందుకు మీడియాకు ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేయాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మంచి ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కు ప్రత్యేక కౌంటింగ్ హాల్ ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హల్ కు ఇవిఎం యంత్రాల తరలింపుకు అవసరమైన మేర సిబ్బంది ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల కౌంటింగ్ విధులు నిర్వహించే ప్రతి సిబ్బందికి వారు నిర్వహించాల్సిన విధులపై సంపూర్ణ శిక్షణ అందించాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ల ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేక టేబుల్ ఏర్పాటు చేయాలని, వివిప్యాట్ లెక్కింపుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి కౌంటింగ్ హాల్లో అవసరమైన మేర కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయాలని, ప్రతి టేబుల్ వద్ద ప్రత్యేక బృందాలను నియమించాలని అన్నారు. కౌంటింగ్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరగాలని ఎక్కడ ఎటువంటి చిన్న పొరపాటు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని, కౌంటింగ్ కేంద్రాలను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఈ వీడియో సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జెడ్పి సిఇఓ వినోద్, డిఆర్డీవో సన్యాసయ్య, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, ఆర్ అండ్ బి ఇఇ శ్యామ్ ప్రసాద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విపణి



### తొలిసారి 76k భారీ లాభాల్లోకి ఆఖర్లో లాభాలన్నీ ఆవిరి

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. ఉదయం ఆసియా మార్కెట్ నుంచి సానుకూల సంకేతాలతో లాభాల్లో ప్రారంభమైన సూచీలు..ఇంట్రాడేలో భారీ లాభాల్లోకి వెళ్లాయి. ఈ క్రమంలో రెండు ప్రధాన సూచీలు సరికొత్త గరిష్ఠాలను నమోదు చేశాయి. ఓ దశలో 600 పాయింట్ల మేర లాభపడిన సెన్సెక్స్.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో లాభాలన్నీ కోల్పోయి ఫ్లాట్‌గా ముగిసింది. నిఫ్టీ 22,900 ఎగువన ముగిసింది.సెన్సెక్స్ ఉదయం 75,655.46 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,009.68 పాయింట్ల వద్ద జీవనకాల గరిష్ఠాలను నమోదు చేసింది. చివరికి 19.89 పాయింట్ల నష్టంతో 75,390.50 వద్ద ముగిసింది. నిఫ్టీ 24.65 పాయింట్లు కోల్పోయి 22,932.45 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.13గా ఉంది. సెన్సెక్స్‌లో ఇండస్ ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ షేర్లు లాభపడగా.. విప్రో, ఎన్టీపీసీ, సన్‌ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ చమురు ధర 82.62 వద్ద ట్రేడవుతుండగా.. ఔన్సు బంగారం ధర 2345.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



# బలహీన పడిన 'రెమాల్'

## ఊపిరి పీల్చుకున్న బెంగాల్



బంగాళాఖాతంలో ఏర్పడిన 'రెమాల్' తుపాను బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్ సరిహద్దుల్లో తీరం దాటిన తర్వాత విధ్వంసం సృష్టించింది. తీరం దాటే సమయంలో తుపాను దాటికి బెంగాల్ వణికిపోయింది. 135 కి.మీ వేగంతో వీచిన బలమైన గాలులకు వందల సంఖ్యలో వృక్షాలు నేలకొరిగాయి. సాధారణ రైలు, మెట్రో రైలు సర్వీసులతోపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోల్‌కతాలో అనేక చోట్ల నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.సోమవారం ఉదయం నుంచి తుపాను బలహీన పడినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో రాష్ట్ర, జాతీయ విపత్తు ప్రతిస్పందన నిర్వహణ దళాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల నుంచి ముందస్తుగా సుమారు లక్షకుపైగా మందిని సురక్షిత ప్రాంతాలకు అధిరారులు తరలించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో తీర రాష్ట్రం ఊపిరి పీల్చు కున్నట్లయ్యింది. నిలిపివేసిన విమాన సర్వీసులు.. 21 గంటల తర్వాత తిరిగి ప్రారంభమయ్యాయి. పట్టాలపై నీరు నిలిచిపోవడంతో పలు మార్గాల్లో మెట్రో సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. రెస్క్యూ బృందాలు సహాయక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాయి. గతంలో విధ్వంసం సృష్టించిన అంపన్ తుపానుతో పోలిస్తే రెమాల్ ప్రభావం తక్కువేనని కోల్‌కతా మేయర్ ఫర్హాద్ హకీమ్ వెల్లడించారు. కూలిన వృక్షాల తొలగింపు చర్యలు చేపట్టామన్నారు. సుందర్బన్ ప్రాంతంలోని గోసాబాలో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయాలపాలైనట్లు సమాచారం. అటు బంగ్లాదేశ్ కూడా 8లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.33 | ₹ 5.52 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

**హైదరాబాద్**

| ₹66,650 (22 క్యారెట్లు) | ₹72,710 (24 క్యారెట్లు) |
|---|---|

**చెన్నై**

| ₹62,220 (22 క్యారెట్లు) | ₹73,310 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్ ₹ 97,500

## మేమే స్పైస్‌జెట్ నుంచి 1,323 కోట్లు కోరతాం: కళానిధి మారన్

దిల్లీ: స్పైస్‌జెట్ విషయంలో ఇటీవల దిల్లీ హైకోర్టు వెలువరించిన తీర్పుపై ఆ సంస్థ మాజీ ప్రమోటర్ కళానిధి మారన్ స్పందించారు. ఈ తీర్పును సవాల్ చేయనున్నామని తెలిపారు.అలాగే, తమకు జరిగిన నష్టానికి గానూ స్పైస్‌జెట్ నుంచి రూ.1,323 కోట్లు పరిహారం కోరనున్నట్లు తెలిపారు. మారన్ నుంచి రూ.450 కోట్లు పరిహారం కోరతామని స్పైస్‌జెట్ వెల్లడించిన నేపథ్యంలో మారన్, ఆయన కంపెనీ కేఏఎల్ ఎయిర్‌వేస్ నుంచి ఈ ప్రకటన వెలువడటం గమనార్హం.కళానిధి మారన్‌కు రూ.579 కోట్లను వడ్డీతో పాటు చెల్లించాలని స్పైస్‌జెట్, ప్రస్తుత ప్రమోటరు అజయ్‌సింగ్‌కు గతంలో జారీ చేసిన మధ్యవర్తిత్వ ఆదేశాలను సమర్థించిన ఏకసభ్య ధర్మాసనం ఉత్తర్వులను హైకోర్టు డివిజన్ బెంచ్ ఈనెల 17న దిల్లీ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం పక్కనపెట్టింది. దీంతో కళానిధి మారన్, ఆయన సంస్థ కేఏఎల్ ఎయిర్‌వేస్‌కు చెల్లించిన రూ.730 కోట్ల మొత్తం నుంచి రూ.450 కోట్ల రిఫండ్ కోరనున్నట్లు స్పైస్‌జెట్ ఇటీవల తెలిపింది.
దీనిపై మారన్ స్పందించారు. తమ మధ్య ఉన్న వివాదంపై కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేయనున్నట్లు తెలిపారు. న్యాయ నిపుణులతో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకోనున్నామని తెలిపారు. అలాగే, ఎఫ్‌టీఐ కన్సల్టింగ్ ఎల్ఎల్‌పీ నిర్ణయించిన రూ.1323 కోట్ల నష్టాన్ని సైతం స్పైస్‌జెట్ నుంచి కోరనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు కూడా తమకు అనుకూలంగా వెలువడిందని గుర్తు చేశారు. గతంలో స్పైస్‌జెట్‌కు ప్రమోటర్‌గా వ్యవహరించిన కళానిధి మారన్.. తనకున్న 58.46 శాతం వాటాను ప్రస్తుత ప్రమోటర్ అజయ్‌సింగ్‌కు బదిలీ చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా తనకు వారంట్స్, షేర్లు జారీ చేయలేదని మారన్ ఆరోపించారు. దీంతో ఈ వ్యవహారం కోర్టుకెళ్లింది. దీనిపై మధ్యవర్తిత్వ కోర్టు, దిల్లీ సింగిల్ బెంచ్ తీర్పులను అనుసరించిన స్పైస్‌జెట్.. మారన్, ఆయనకు చెందిన కాల్ ఎయిర్‌వేస్‌కు రూ.580 కోట్లు అసలు, రూ.150 కోట్లు వడ్డీ చొప్పున రూ.730 కోట్లు చెల్లించింది.




# కొండచరియల ప్రమాదంలో 2,000 మంది సజీవ సమాధి



పాపువా న్యూగినీలో కొండచరియలు విరిగి పడిన ఘటనలో సజీవ సమాధి అయిన వారి సంఖ్య భారీగా పెరిగి వేలకు చేరింది. ఈ విషయాన్ని అక్కడి ప్రభుత్వం ఐరాసకు వెల్లడించింది. "కొండచరియలు విరిగి పడిన ఘటనలో 2,000 మంది ప్రజలు సజీవ సమాధి అయ్యారు" అని ఆ దేశంలోని నేషనల్ డిజాస్టర్ సెంటర్‌నుంచి ఐరాస ఆఫీస్‌కు సమాచారం వెళ్లింది. ఈ మేరకు సోమవారం ఉదయం లేఖను ఆ కార్యాలయానికి పంపింది. దాదాపు 200 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఈ బీభత్సం సంభవించింది. కొన్ని చోట్ల 8 మీటర్ల ఎత్తున శిథిలాలు కుప్పలు పడినట్లు తెలుస్తోంది.ఇప్పటికీ చాలా చోట్ల కొండచరియలు విరిగిపడుతుండటంతో.. శిథిలాల కిందే ఉండిపోయిన క్షతగాత్రుల ప్రాణాలకు, సహాయక చర్యల్లో పాల్గొంటున్న బృందాలకు సవాల్‌గా మారింది. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు సైన్యం, ఇతర బృందాలను కూడా సిద్ధం చేస్తున్నారు. మిత్రదేశాలు అందించే సాయాన్ని డిజాస్టర్ సెంటర్ ద్వారా సమన్వయం చేసుకొంటామని అక్కడి ప్రభుత్వం పేర్కొంది.శుక్రవారం తెల్లవారుజామున ఈ దేశంలోని ఎంగా ప్రావిన్స్‌లోని యంబాలి గ్రామంపై మౌంట్ ముంగాల కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ దెబ్బకు ఆ ప్రావిన్స్‌లో చాలా ప్రాంతాలు తుడిచి పెట్టుకు పోయాయి. తొలుత పదుల సంఖ్యలో ఇళ్లు నేలమట్టమయ్యాయని భావించారు. కానీ, భారీ భవనాలు, పంటలు కూడా వీటి కింద చిక్కుకుపోయినట్లు తేలింది. ఈ ప్రమాదం ఆ దేశ ఆర్థిక పరిస్థితిపై కూడా ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. పోర్గెర మైన్‌కు వెళ్లే ప్రధాన జాతీయ రహదారి ఈ ఘటనలో తీవ్రంగా దెబ్బతింది. ఫలితంగా రవాణాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

## జనంసాక్షి జాతీయం అంతర్జాతీయం



### ఆ విషయాల్లో ఇద్దరమూ ఒక్కటే.. రిషి దంపతుల ఆసక్తికర పోస్ట్

మరికొన్ని రోజుల్లో బ్రిటన్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే దేశ ప్రధానమంత్రి రిషి సునాక్ దంపతులు కీలక విషయాలు వెల్లడించారు.ఇద్దరి అభిరుచులకు సంబంధించి అనేకమంది అడిగే ప్రశ్నలను ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్టు పెట్టారు. దాంపత్య జీవితంలో వారి అభిరుచులు, పనిపట్ల నిబద్ధత, తాము అనుసరించే మానవ విలువల గురించి అందులో వివరించారు. "మేమిద్దరం కలిసి ఎక్కడికి వెళ్లినా ఇతరుల నుంచి ఎదురయ్యే మొదటి ప్రశ్న.. మీలో కామన్‌గా కనిపించే విషయం ఏంటి? అని. దాంపత్య జీవితంలో కలిసి సినిమాలు చూడడం, నచ్చిన ఆహారాన్ని తినడం మాత్రమే కాదు. అంతకన్నా ముఖ్యమైన విషయం ఉంది. అదే విలువలను పంచుకోవడం. జీవితంలో ఏ స్థాయిలో ఉండాలో మన కష్టమే నిర్ణయిస్తుంది. దాన్నే మేమిద్దరం విశ్వసిస్తాం. ఏదైనా సాధించాలంటే మాత్రం సాహసోపేతమైన నిర్ణయాలు అవసరమనే విషయంలోనూ ఇద్దరిదీ ఒకటే మాట. దాని ఫలితంగా మనకంటే మెరుగైన ప్రపంచాన్ని మన పిల్లలు వారసత్వంగా పొందుతారని మా విశ్వాసం. ప్రజలతో సత్సంబంధాలు మెరుగుపరుచుకోవడం అనే విలువలను వారికి పంచుతున్నాం" అని పోస్టు పెట్టారు.
రిషి, అక్షతా సంయుక్తంగా పెట్టిన ఈ పోస్టుకు తమ ఫొటోను జత చేశారు. ఇది నెట్టింట వైరల్‌గా మారింది. దాంపత్య జీవితంలో పాటిస్తున్న విలువలు, సహకారం, భవిష్యత్తుపై వారికి ఉన్న నిబద్ధత, ముందుచూపుపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇదిలాఉండగా.. జులై 4న ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో భర్త సునాక్‌కు పూర్తి మద్దతుగా నిలుస్తానని అక్షతా వెల్లడించారు. తాజాగా వీరిద్దరూ పెట్టిన పోస్టు అందరినీ ఆకట్టుకుంటోంది.

## జోకులేసినవారికి ఇచ్చి పడేశా!



ఐపీఎల్ 2024 మినీ వేలంలో ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఏకంగా రూ. 24.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఇంత మొత్తం అవసరమా?, ఒక్కో బంతికి అన్ని లక్షలా? అంటూ అటు కేకేఆర్‌పై.. ఇటు స్టార్క్‌పై జోకులు పేలాయి. అందుకు తగ్గట్టుగానే లీగ్ స్టేజ్‌లో పెద్దగా ప్రభావం చూపలేదు. 12 మ్యాచుల్లో కేవలం 12 వికెట్స్ మాత్రమే తీశాడు. కొన్ని మ్యాచ్‌లలో అయితే భారీగానే పరుగులు ఇచ్చుకున్నాడు. అయ్యితే కీలక నాకౌట్‌లలో మాత్రం రెచ్చిపోయాడు. రెండు మ్యాచుల్లోనే 5 వికెట్లు తీశాడు. అద్భుత బౌలింగ్‌తో ఐపీఎల్ 2024 ఫైనల్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు కైవసం చేసుకున్నాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్న సందర్భంగా తన పారితోషికంపై చాలా ట్రోల్స్ వచ్చాయని మిచెల్ స్టార్క్ తెలిపాడు. నాకౌట్‌లలో రాణించడంతో సంతోషంగా ఉందన్నాడు. 'కోల్‌కతాకు ఇదొక అద్భుతమైన సీజన్. ఫైనల్‌లో రెండు అత్యుత్తమ టీమ్స్ తలపడ్డాయి. ఐపీఎల్ 2024 ఆరంభం నుంచి ప్రతి మ్యాచ్ బాగా సాగింది. అత్యుత్తమ బ్యాటర్లు, బౌలర్లు మా జట్టులో ఉన్నారు. నిలకడగా ఆడుతో.. ప్రతి ఒక్కరూ జట్టు విజయాల్లో భాగం అయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో మేం టాస్ ఓడిపోయినప్పటికీ.. బౌలింగ్ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాం' అని స్టార్క్ తెలిపాడు. 'రెండు రోజుల కిందట చెపాక్ పిచ్‌పై జరిగిన మ్యాచ్‌ను గమనించాం. పిచ్ ఎలా స్పందిస్తుందన్న అంశం మాకు అర్థం కాలేదు. దాంతో మ్యాచ్ పరిస్థితులకు త్వరగా అలవాటు పడాలని నిర్ణయించుకున్నాం. శ్రేయస్ అయ్యర్ రూపంలో మాకు అద్భుతమైన కెప్టెన్ ఉన్నాడు. బౌలర్లను, ఫీల్డర్లను ఎలా వాడుకోవాలో అతడికి బాగా తెలుసు. టోర్నీ ప్రారంభానికి ముందు నా పారితోషికంపై చాలా జోకులు వచ్చాయి. నేను ఐపీఎల్‌లో ఆడి చాలా ఏళ్లయింది. మొదట్లో నాపై భారీగా అంచనాలు ఉండేవి. వాటిని మేనేజ్ చేయగలిగా. విజయంలో నా పాత్ర ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. జట్టు విజేతగా నిలవడం కోసం ప్లేయర్లతో పాటు సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. భవిష్యత్తులో అన్ని ఫార్మాట్లలో ఆడకపోవచ్చు కానీ.. తప్పకుండా ఫ్రాంచైజీ క్రికెట్‌లో ఆడుతా' అని మిచెల్ స్టార్క్ చెప్పుకొచ్చాడు.

## అంబటి రాయుడు ఓ జోకర్ : కేవిన్ పీటర్సన్



టీమిండియా మాజీ క్రికెటర్, తెలుగు తేజం అంబటి రాయుడిని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్, ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ మాథ్యూ హెడెన్ ఓ ఆట ఆడుకున్నారు. లైవ్ షోలో.. రాయుడి ద్వంద వైఖరిని ఎండగడుతూ విమర్శలు గుప్పించారు. అంబటి రాయుడు ఓ జోకర్ అంటూ కెవిన్ పీటర్సన్ అతన్ని తీసిపారేసాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఐపీఎల్ 2024 సీజన్‌లో కేకేఆర్ ఛాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఆదివారం చెపాక్ వేదికగా ఏకపక్షంగా సాగిన ఫైనల్లో కేకేఆర్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో ముచ్చటగా మూరోసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. ఈ మ్యాచ్ అనంతరం మాథ్యూ హెడెన్, కెవిన్ పీటర్సన్, స్టార్ స్పోర్ట్స్ హెూస్ట్ మయాంతి లాంగర్‌తో కలిసి మాట్లాడిన రాయుడు.. కేకేఆర్‌ను ప్రశంసిస్తూనే ఆర్‌సీబీ, విరాట్ కోహ్లీపై విమర్శలు గుప్పించాడు. ఆరెంజ్ క్యాప్‌లతో టైటిల్ గెలవలేమని, సమష్టి ప్రదర్శనలే ఛాంపియన్‌గా నిలబెడుతాయని చెబుతూ.. ఈ సీజన్‌లో కోహ్లీ చేసిన 741 పరుగులను తక్కువ చేస్తూ మాట్లాడాడు. అంతటితో ఆగకుండా ఆర్‌సీబీ టైటిల్ గెలవాలంటే కోహ్లీ తన అత్యుత్తమ ప్రమాణికాలను తగ్గించుకోవాలని, కుర్రాళ్లు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసేందుకు తక్కువ పరుగులు చేయాలని సూచించాడు. ఈ వ్యాఖ్యలతో పాటు మ్యాచ్‌కు ముందు ఆరెంజ్ జాకెట్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు సపోర్ట్ చేసిన రాయుడు.. కేకేఆర్ విజయానంతరం పర్పుల్ కలర్ జాకెట్ ధరించడంతో అతన్ని పీటర్సన్, మాథ్యూ హెడెన్ ఓ ఆట ఆడుకున్నారు. ఆర్‌సీబీ, కోహ్లీని ఉద్దేశించి అతను చేసిన వ్యాఖ్యలను, సన్‌రైజర్స్‌కు మద్దతు తెలిపి ఓడిపోవడంతో యూటర్న్ తీసుకోవడాన్ని ప్రస్తావిస్తూ రాయుడిని ఎగతాళి చేశారు.

## 'గాంభీర్య'మే గెలిపించింది..!

గత మూడు సీజన్లలో కనీసం ప్లే ఆఫ్స్ చేరలేకపోయిన కేకేఆర్.. గంభీర్ రాకతో ఛాంపియన్‌గా నిలిచింది. ఈ సీజన్‌లో కేకేఆర్ కేవలం మూడు మ్యాచ్‌ల్లోనే ఓటమిపాలైందంటే ఆ జట్టు ఎంతలా ఆధిపత్యం చెలాయించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఎప్పుడూ సీరియస్‌గా ఉండే గంభీర్.. టైటిల్ గెలిచిన అనంతరం చిరునవ్వులు చిందించాడు. సునీల్ నరైన్‌తో కలిసి ఆనందాన్ని పంచుకున్నాడు. ఇద్దరిని ఒకరినొకరు ఎత్తుకున్నారు. కేకేఆర్ ఓనర్ షారూఖ్ ఖాన్ సైతం గంభీర్‌ను ప్రశంసిస్తూ ఓ ముద్దు పెట్టాడు. సునీల్ నరైన్‌ను ఓపెనర్‌గా ఆడించడం.. ఆండ్రీ రస్సెల్ గతంలో మాదిరి చెలరేగడం, మిచెల్ స్టార్క్‌ను రూ. 24.75 కోట్లు పెట్టి కొనుగోలు చేయడంతో పాటు అతనిపై పూర్తి నమ్మకం ఉంచడం గంభీర్ మార్క్ నిర్ణయాలుగా చెప్పవచ్చు. ఈ విజయానంతరం ఏం మాట్లాడని గంభీర్.. ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టాడు. ఇప్పుడు అది సోషల్ మీడియా వేదికగా వైరల్‌గా మారింది. 'ఎవరి ఆలోచనలు, చర్యలు సత్యంపై ఆధారపడి ఉంటాయో వారికి ఇప్పటికీ శ్రీకృష్ణుడే రథసారథి'అంటూ హిందీలో చేసిన తాత్వికతతో కూడిన పోస్ట్‌ను పంచుకున్నాడు. ప్రస్తుతం ఈ ట్వీట్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. అయితే ఈ పోస్ట్ వెనుక ఉద్దేశం ఏంటనేది మాత్రం అర్థం కావడం లేదు. 2011, 2007 టీ20 ప్రపంచకప్‌లను భారత్ అందుకోవడంలో గంభీర్‌ది కీలక పాత్ర. ఈ రెండు మెగా ఫైనల్లో గంభీర్ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. కానీ అతనికి రావాల్సిన గుర్తింపు రాలేదు. కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకే ఈ క్రెడిట్ దక్కింది. ఈ విషయంలో గంభీర్.. చాలా సార్లు అసంతృప్తిని వ్యక్తం చేశాడు. అయితే తాజా విజయంతో అంతటి కంటే ఎక్కువ పేరు వచ్చిందని నెటిజన్లు గంభీర్‌ను ప్రశంసిస్తున్నారు. ఇది దేవుడు రాసిన రాతని, ఎవరూ తప్పించుకోలేరని కామెంట్ చేస్తున్నారు. గతంలో కేకేఆర్ కెప్టెన్‌గా 2012, 2014 సీజన్ల టైటిళ్లను అందుకున్న గంభీర్.. 10 ఏళ్ల నిరీక్షణ తర్వాత మెంటార్‌గా మరో సారి తన జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టాడు.

## కాంగ్రెస్ పార్టీలోనే పదవి అడిగే స్వేచ్ఛ

- ఇతర ఏ పార్టీలోనూ ఉండదు..
- మోడీ ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా?
- మీడియా సమావేశంలో జగ్గారెడ్డి సూటి వ్యాఖ్యలు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** పీసీసీ అధ్యక్ష పదవిని అడిగే స్వేచ్ఛ కాంగ్రెస్ పార్టీలో మాత్రమే ఉంటుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. బీజేపీలో ఢిల్లీకి వెళ్లి అడిగే స్వేచ్ఛ ఉండదని, ఇక బీఆర్ఎస్‌లో అయితే మరొకరికి అవకాశమే లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో అయితే ఎవరైనా అడగవచ్చునని చెప్పారు. దేశంలో.. తెలంగాణలో 60 ఏళ్లు పాలించి వారు ఏమీ చేయకుండానే ఇదంతా బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లే చేశారా? ఆయన ప్రశ్నించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ ఆస్తులను కాంగ్రెస్ పార్టీ పెంచితే... వాటిని ప్రయివేటువారికి బీజేపీ ధారాదత్తం చేసిందని విమర్శించారు. 70 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందని బీజేపీ నేతలు మాట్లాడటం విడ్డూరమన్నారు. నాగార్జునసాగర్, బాక్రానంగల్ ప్రాజెక్టులను నిర్మించింది కాంగ్రెస్సే అన్నారు. హైదరాబాద్‌కు సాగునీటిని అందించేందుకు జంట జలాశయాలు నిర్మించింది తమ పార్టీయే అన్నారు. సింగూరు, మంజీరా నీళ్లు బీజేపీ నేతలు తాగడం లేదా? అని నిలదీశారు. హైదరాబాద్‌కు వస్తోన్న తాగునీళ్లు కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టుల నుంచే వస్తున్నాయన్నారు. 17 ఏళ్ల నెహ్రూ కాలంలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించామన్నారు. ఒక్క డ్యాం కూడా కట్టని ప్రధాని.. ప్రాజెక్టుల గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. బీజేపీ ఈ పదేళ్లలో ఎన్ని పరిశ్రమలు తెచ్చింది? ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు? అని నిలదీశారు. బీజేపీ హయాంలో పెట్రోల్, డీజిల్, బంగారం.. ఇలా అన్ని ధరలూ పెరిగాయని విమర్శించారు.

## విద్యార్థులకు శుభవార్త!!



హైదరాబాద్, వరంగల్‌లోని టిజిఎస్ఆర్టీసీ ఐటీఐ కళాశాలల్లో వివిధ ట్రేడ్‌లలో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి సంస్థ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హత కలిగిన విద్యార్థులు జూన్ 10లోపు ఆన్‌లైన్ (https://iti.telangana.gov.in)లో దరఖాస్తు చేసుకోవాలి. మోటార్ మెకానిక్ వెహికిల్, మెకానిక్ డిజిల్, వెల్డర్, పెయింటర్ ట్రెడ్‌లలో ప్రవేశాలు జరుగుతున్నాయి. స్వయం ఉపాధి రంగంలో స్థిరపడాలనుకునే వారికి ఐటీఐ కోర్సులు వరంలాంటివి. నిరుద్యోగ యువతకు చక్కటి శిక్షణ, బంగారు భవిష్యత్ అందించడంతో పాటు తక్కువ వ్యవధిలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఐటీఐ కళాశాలలను సంస్థ ఏర్పాటు చేసింది. నిపుణులైన అధ్యాపకులతో పాటు అపార అనుభవంగల ఆర్టీసీ అధికారులచే తరగతులను నిర్వహిస్తోంది. ఈ ట్రేడ్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు కోరుకున్న టీజీఎస్ఆర్టీసీ డిపోల్లో అప్రెంటీషిప్ సౌకర్యం కల్పిస్తున్నాం. ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు హైదరాబాద్ ఐటీఐ కళాశాల ఫోన్ నంబర్లు 9100664452, 040-23450033, వరంగల్ ఐటీఐ కళాశాల ఫోన్ నంబర్లు 9849425319, 8008136611ను సంప్రదించగలరు. పూర్తి వివరాలను https://iti.telangana.gov.in/వెబ్‌సైట్‌లోనూ చూడొచ్చు.

## ఉప్పల్ స్టేడియంకు ఐపీఎల్ అవార్డు!

ఐపీఎల్ 2024లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) తుది పోరులో చేతులెత్తేసింది. ఆదివారం చెపాక్ మైదానంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన ఫైనల్‌లో సన్‌రైజర్స్ ఓడిపోయింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో తేలిపోయిన ఎస్ఆర్‌హెచ్.. రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఎస్ఆర్‌హెచ్ ఓటమితో అభిమానులే కాదు ఆ జట్టు ఓనర్ కావ్య మారన్ కూడా కన్నీటి పర్యంతం అయ్యారు. అయితే ఓటమి బాధలో ఉన్న సన్‌రైజర్స్‌కు చిన్న ఓదార్పు దక్కింది. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంకు ఐపీఎల్ అవార్డు దక్కింది. బెస్ట్ పిచ్, బెస్ట్ గ్రౌండ్‌గా ఉప్పల్ స్టేడియంను అవార్డు వరించింది. ఐపీఎల్ 17వ సీజన్ ఫైనల్ మ్యాచ్ అనంతరం ఏర్పాటు చేసిన సెర్మనీలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఈ అవార్డును అందుకుంది. అంతేకాదు 50 లక్షల రూపాయల ప్రైజ్‌మనీ కూడా దక్కింది. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరి నాథ్.. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావుకు అవార్డును అందించారు.ఐపీఎల్ 2024లో ఉప్పల్ స్టేడియంపై అన్ని వైపుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఈ సీజన్‌లో బ్లాక్ బస్టర్ మ్యాచ్‌లను ఉప్పల్ స్టేడియం అందించింది. చాలా మ్యాచ్‌లు చివరి వరకు ఉత్కంఠంగా సాగాయి.

## అన్‌సంగ్ హీరోలకు బీసీసీఐ భారీ నజరానా!

ఐపీఎల్ 2024 సీజన్‌ను తెర వెనుక ఉండి నడిపించిన అన్‌సంగ్ హీరోలకు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) భారీ నజరానా ప్రకటించింది. ఐపీఎల్ 2024 సీజన్‌లో 13 వేదికల్లో పిచ్‌లను సిద్ధం చేసిన క్యూరేటర్లతో పాటు మైదానాల సిబ్బందికి బీసీసీఐ క్యాష్ రివార్డ్ అందజేయనున్నట్లు తెలిపింది. ఈ మేరకు బీసీసీఐ సెక్రటరీ జైషా సోమవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. 10 ఫ్రాంచైజీలకు చెందిన హోమ్ గ్రౌండ్స్‌లోని క్యూరేటర్లు, గ్రౌండ్స్‌మెన్‌కు ఒక్కో మైదానం చొప్పున రూ. 25 లక్షల నజరానా ఇవ్వనున్నట్లు బీసీసీఐ పేర్కొంది. అలాగే అదనపు వేదికల్లోని ధర్మశాల, వైజాగ్, గువాహటి గ్రౌండ్స్‌మెన్, క్యూరేటర్లకు ఒక్కో మైదానం చొప్పున రూ. 10 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపింది. ఐపీఎల్ విజయవంతంగా మగియడంలో వీరు కీలక పాత్ర పోషించారని, దాంతోనే క్యాష్ రివార్డ్స్ అందజేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఐపీఎల్ 2024 సీజన్ లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఛాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఆదివారం చెపాక్ వేదికగా ఏకపక్షంగా సాగిన ఫైనల్లో కేకేఆర్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో ముచ్చటగా మూరోసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 18.3 ఓవర్లలో 113 పరుగులకు కుప్పకూలింది. ఎయిడెన్ మార్క్‌రమ్(23 బంతుల్లో 3 ఫోర్లతో 20), ప్యాట్ కమిన్స్(19 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు.

## నాణ్యత ఎంత..?


### మహబూబ్‌నగర్‌లో పెట్రోల్ పంపుల్లో లీగల్ మెట్రాలజీ శాఖ తనిఖీలు



**మహబూబ్‌నగర్ బ్యూరో (జనంసాక్షి) :** పెట్రోల్ పంపులపై అందుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో లీగల్ మెట్రాలజీ శాఖ జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి. రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పలు పెట్రోల్ పంపులలో తనిఖీలు నిర్వహించారు. అందులో ముఖ్యంగా హైటెక్ ఫిల్లింగ్ స్టేషన్, కైలాష్ ఆటో సప్లైస్, రామేశ్వర ఫిల్లింగ్ స్టేషన్, ఆర్ఎస్ రాటీ ఫిల్లింగ్ స్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించారు . ఈ సందర్భంగా జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి. రామకృష్ణ మాట్లాడుతూ ఈ తనిఖీలలో ఎటువంటి ఉల్లంఘనలు, అవకతవకలు ఉన్నట్లు తమ దృష్టికి రాలేదని అన్నారు. పెట్రోల్ పంపు వారు ప్రతి రోజు తమ పెట్రోల్ పంపులు సరిగా పనిచేస్తున్నాయా లేదా అనే విషయాన్ని పెట్రోల్/డీజిల్ డెలివరీ ద్వారా నిర్ధారించుకోన్న తర్వాతే వారి యొక్క పంపులను వాడాలని , వారి పంపులకి ప్రతి సంవత్సరం విధిగా వెరిఫికేషన్ సర్టిఫికెట్ తీసుకోవాలని ఆయన సూచించారు . వెరిఫికేషన్ సర్టిఫికెట్ కాల పరిమితి ముగిసిన తర్వాత వాడినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు . వినియోగదారులు కోరినట్లయితే ఐదు లీటర్ల క్యాన్ తో డెలివరీ లను చెక్ చేసి చూపించాలని ఆయన పేర్కొన్నారు. పై నిబంధనలు ఉల్లంఘించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగు తుందని ఆయన హెచ్చరించారు. పెట్రోల్ పంపులలో అవకతవకలు జరుగుతున్నట్లు వినియోగదారులు గమనిస్తే , మరి ఏదనా సమస్య ఉంటే వినియోగదారులు లీగల్ మెట్రాలజి శాఖ కార్యాలయం ను సంప్రదించవచ్చని లేదా వాట్సాప్ ద్వారా ఫోన్ నెంబర్ 9010651783 కు కంప్లైంట్ నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

## కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

### జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ వినోద్ కుమార్



**జగిత్యాల బ్యూరో, మే 27 (జనంసాక్షి) :** జులై నుంచి అమల్లోకి రానున్న కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు ఎస్పీ వినోద్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కొత్త చట్టాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ కొత్తగా రూపొందించిన మూడు చట్టాలు - భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియమన్నారు. 2023లో చేసిన ఈ మూడు చట్టాలు రానున్న జూలై 1, 2024 నుండి అమలులోకి రానున్నాయని తెలిపారు.అందులో బాగంగా వీటి గురించి జిల్లాలోని పోలీసు అదికారులకు , సిబ్బందికి శిక్షణ కార్యక్రమని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మూడు కొత్త క్రిమినల్ చట్టాలలో సమకాలీన కాలం, వాడుకలో ఉన్న సాంకేతికతలకు అనుగుణంగా అనేక కొత్త నిబంధనలు చేర్చడం జరిగిందని, బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్థవంతంగా నిర్వహించడానికి అనుగుణంగా కొత్త క్రిమినల్ చట్టాలకు చాలా రూపొందించడం జరిగిందన్నారు. క్రిమినల్ చట్టాల సూక్ష్మ నైపుణ్యాలను కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సమాజానికి వాటి ఆచరణాత్మక ఉపయోగం , చుట్టూ జరుగుతున్న నేరాల గురించి అదనపు ఎస్పీ వినోద్ కుమార్ క్లుప్తంగా వివరించారు. కొత్త చట్టాల వర్తింపు, నేరాలు దానికి సంబంధించిన కేసులతో వ్యవహరిస్తున్నప్పుడు వాటిని ఎలా గ్రహించాలనే దానిపై పోలీసు శాఖకు చెందిన డిఎస్పీ నుండి కానిస్టేబుల్ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వినోద్ కుమార్ తెలిపారు.

## మెట్‌పల్లి ఐసీడీఎస్‌లో అక్రమాలు

### ఫ్రీ స్కూల్ కిట్ల పంపిణిలో అవకతవకలు

### కలెక్టర్ ఆదేశాలతో విచారణ.. త్వరలో సీడీపీఓపై చర్యలు?

**జగిత్యాల బ్యూరో (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టులో ఫ్రీ స్కూల్ కిట్ల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు తెలిసింది. మెట్‌పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని చేస్తున్న అక్రమాలు చేసినట్టు ఓ వ్యక్తి జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ శాఖ పరమైన విచారణకు ఆదేశించారు. దీంతో గతవారం జిల్లా సంక్షేమ అధికారి చేసిన విచారణలో 2019 సంవత్సరంలో మెట్‌పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కేంద్రాల్లోని పిల్లలకు ఆట వస్తువుల పంపిణీలో అక్రమాలు జరిగినట్లు తేలింది. దీంతో ఈ మేరకు జిల్లా సంక్షేమ అధికారి కలెక్టర్‌కు నివేదిక పంపించారు. ఈ విషయమై సిడిపిఓపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. 2019 సంవత్సరంలో మెట్పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 312 అంగన్వాడి కేంద్రాలకు పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తులు పంపిణీ చేయడానికి ప్రభుత్వం ఆరు లక్షల రూపాయలను మంజూరు చేసింది. దీంతో పాటు మరో మూడు లక్షల రూపాయలు అదనపు వస్తువుల కొనుగోలు కు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ప్రభుత్వం రెండు రకాల కిట్లు పంపిణీ చేయడానికి డబ్బులు మంజూరు చేసినప్పటికీ మెట్పల్లి ఐసిడిఎస్ అధికారులు మాత్రం నాసిరకం వస్తువులతో కూడుకున్న ఒకే కిట్‌ను అంగన్వాడి కేంద్రాలకు సరఫరా చేసినట్టు తెలుస్తున్నది. 2020లో అదనపు వస్తువుల కోసం కేటాయించిన మూడు లక్షల రూపాయలతో నాసిరకం వస్తువులు కొనుగోలు చేసి అంగన్వాడి కేంద్రాలకు పంపిణీ చేసిన అధికారులు 2019వ సంవత్సరంలో ఇచ్చిన ఆరు లక్షల రూపాయలను ఎలాంటి వస్తువులు కొనుగోలు చేయకుండా కాజేసినట్లు విచారణలో తేలినట్లు సమాచారం.



మెట్పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారినిపై ఫిర్యాదుతో విచారణలో అవినీతి బయటపడడంతో జిల్లాలోని మల్యాల, జగిత్యాల ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై రికార్డులను తారుమారు చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తున్నది.

**మిగతా ప్రాజెక్టులలో కూడా అదే తంతు**

ఇదిలా ఉండగా జగిత్యాల జిల్లాలోని మరో మూడు ప్రాజెక్టులలో కూడా ఇదేతంతు జరిగినట్లు తెలుస్తున్నది. ఫ్రీ స్కూల్ కిట్స్, అదనపు వస్తువుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన సొమ్ము ఎలాంటి వస్తువులు పంపిణీ చేయకుండానే కాజేసినట్లు సమాచారం. కాగా మెట్పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారినిపై ఫిర్యాదుతో విచారణలో అవినీతి బయటపడడంతో జిల్లాలోని మల్యాల, జగిత్యాల ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై రికార్డులను తారుమారు చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే ఈ విషయమై లోతుగా విచారణ జరిపితే దశాబ్ద కాలంగా ఐసిడిఎస్ ప్రాజెక్టులలో జరిగిన అవినీతి బయట పడుతుందని భావిస్తున్నారు.

## కార్పొరేట్ కళాశాలలకు ఇంటర్ బోర్డ్ అధికారుల వత్తాసు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** కార్పొరేట్ కళాశాలలకు ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు వత్తాసు పలుకుతున్నారని, కార్పొరేట్ కళాశాలలను కట్టడి చేయకుండా వారికి సహకరిస్తున్న ఇంటర్ బోర్డ్ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నల్లకుంటలోని నారాయణ, శ్రీచైతన్య అనధికార కళాశాలల వద్ద అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వేసవి తరగతులను బహిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ లు సంయుక్తంగా మాట్లాడుతూ.. ఇంటర్ బోర్డ్ నిబంధనలు భేఖాతరు చేస్తూ అక్రమంగా, అనధికార శ్రీచైతన్య, నారాయణ, రిసోనెన్స్,అక్షర, వాసవి, తదితర కళాశాలలను కట్టడి చేయడంలో ఇంటర్ బోర్డ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కృషి చేయాల్సిన అధికారులు....ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల అభివృద్ధికి సహకరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఒకవేళ అధికారులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి సహకరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఎందుకు లేవని వారు ప్రశ్నించారు?. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యా వ్యాపారం కాకుండా... విద్య స్కామ్ జరుగుతున్నదని విమర్శించారు. పాలకులు విద్యారంగం పట్ల సమూల మార్పులు తేవాల్సిన బాధ్యత ను మరుస్తున్నదని వారు అన్నారు. ఇంటర్ బోర్డ్ అఫిలియేషన్ లేని కళాశాలలు ఎన్ని ఉన్నాయో ఇప్పటివరకు అధికారులు ఎందుకు బహిర్గతం చేయడం లేదో స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకునే వరకు తాము నిరంతరంగా పోరాటాన్ని కొనసాగిస్తామని వారు అన్నారు. తక్షణమే ఇంటర్ బోర్డ్ కార్పొరేట్ కళాశాలల ఆగడాలను ఆపాలని, లేనిపక్షంలో బోర్డ్ ఆదేశాలను భేకాతరు చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై దాడులు చేస్తామని దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్యప్రసాద్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్. బాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీద్, అనిల్, కిరణ్, ఇస్మాయిల్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను అభినందించిన కలెక్టర్ యాస్మిన్ భాష



**జగిత్యాల బ్యూరో, మే 27 (జనంసాక్షి)** కళానిలయం జాతీయస్థాయిలో నృత్య పోటీలు చిలకలూరిపేట పల్నాడు జిల్లా ఆంధ్ర ప్రదేశ్ లో జరిగిన నృత్య పోటీలలో జగిత్యాల పట్టణ శ్రీ మేదిని లలిత కళ క్షేత్రం గురువులు భుజంగరావు , నాట్య సామ్రాట్ బొమ్మిడి నరేష్ కుమార్ విద్యార్థినిలు పోటీలో పాల్గొని నాట్య మయూరి అవార్డు గెలుచుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష చిన్నారి విద్యార్థినిలు జంగిలి ప్రవిష్ణ, బూసి చంద్రహాసిని, నక్షత్ర, చెట్టే భవ్య శ్రీ, కీర్తన, అక్షర, హన్సిక, సెజల్ శాన్వి, నిత్యశ్రీ, హరిణి, శ్రీకృతి, విరానికలను అభినందించారు.




## గ్లోబల్ యాక్సెసిబిలిటీ అవేర్‌నెస్ డే

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆచరణాత్మక ప్రాప్యతపై కేంద్రీకరించి సమగ్ర డిజిటల్ పరిసరాలను సమర్థిస్తూ ఇన్స్టిట్యూట్ ఫర్ విజన్ రీహాబిలిటేషన్ మరియు హల్లోఎ11వై కమ్యూనిటీ సంయుక్తంగా గ్లోబల్ యాక్సెసిబిలిటీ అవేర్‌నెస్ డే (జిఎఎడి) 2024ను నిర్వహించారు. కార్యక్రమంలో 125మందికిపైగా పాల్గొన్నవారిలో దృష్టి పునరావాస, సాంకేతిక నిపుణులు, దృష్టి వైకల్యాలున్న వ్యక్తులు, వారి కుటుంబాలు, రంగంలో క్రియాశీలకంగా పాల్గొంటున్న ఇతర నిపుణులు ఉన్నారు. అందరికీ మరింత సమగ్రమైన డిజిటల్ వాతావరణాన్ని రూపొందిచడానికి వీలుకల్పిస్తూ, మరింత అందుబాటులో ఉండగల వెబ్‌సైట్‌లు, ఈ-కామర్స్ సైట్‌లు, పిడిఎఫ్‌లు రూపొందించడంలో విలువైన అంతర్దృష్టులను పాల్గొన్నవారికి ఈ కార్యక్రమం అందించింది. ఇది అర్థవంతమైన సంభాషణ, సహకారానికి వేదికగా ఉపయోగపడింది. "హల్లోఎ11వై కమ్యూనిటీ సహకారంతో ఇటువంటి విజయవంతమైన కార్యక్రమాన్ని నిర్వహించడం మాకెంతో ఆనందదాయకంగా ఉన్నది. నిపుణులను, వాటాదారులను ఒకచోటికి తీసుకురావడంద్వారా మేము ప్రాప్యతగురించిన సంభాషణను ముందుకు తీసుకువెళ్లడం మరియు మరింత సమగ్ర సమాజం దిశలో స్పష్టమైన చర్యలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నాము," అన్నారు డా బ్యూలా క్రిస్టీ, నెట్వర్క్ అసోసియేట్ డైరెక్టర్ - విజన్ రీహాబిలిటేషన్, ఇన్స్టిట్యూట్ ఫర్ విజన్ రీహాబిలిటేషన్.

# అమెరికాలో రాలిన మరో విద్యాకుసుమం



- రోడ్డుప్రమాదంలో యాదాద్రికి చెందిన యువతి మృతి

**హైదరాబాద్, మే (జనంసాక్షి) :** ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళున్న తెలుగు విద్యార్థులు ఇటీవల పలు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా, ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన తెలంగాణ యువతి అక్కడ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. మృతురాలిని తెలంగాణకు చెందిన గుంటిపల్లి సౌమ్యగా గుర్తించారు. ఆమె స్వస్థలం యాదగిరిగుట్ట శివారులోని యాదగిరిపల్లె కాగా.. స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సౌమ్య న్యూయార్క్‌లో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. అతివేగంతో వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సౌమ్య చదువుతో పాటు పార్ట్ టైం జాబ్ కూడా చేస్తున్నట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. ఉన్నత స్థాయికి ఎదుగుతుందనుకున్న తమ బిడ్డ రోడ్డు ప్రమాదంలో దూరం కావడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. యువతి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అటు, ఏపీకి చెందిన తెలుగు విద్యార్థి బెలెం అచ్యుత్ అనే యువకుడు ఇటీవల న్యూయార్క్ నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. అచ్యుత్ నగరంలోని న్యూయార్క్ స్టేట్ యూనివర్శిటీలో విద్య అభ్యసిస్తున్నాడు. ఈ నెల 22న బుధవారం సాయంత్రం బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని అమెరికాలోని భారత రాయబార కార్యాలయం ధ్రువీకరించింది. 'న్యూయార్క్ స్టేట్ వర్శిటీకి చెందిన విద్యార్థి అచ్యుత్ బైక్ ప్రమాదంలో బుధవారం మధ్యాహ్నం మృతి చెందడం విచారకరం. అతని అకాల మరణం గురించి తెలిసి చాలా బాధపడ్డాం. మృతుడి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం. బాధిత కుటుంబం, స్థానిక ఏజెన్సీలతో సంప్రదింపులు జరుపుతున్నాం. మృతదేహాన్ని త్వరలో భారత్ కు పంపించేందుకు బాధిత కుటుంబానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం.' అని ట్వీట్ చేసింది. కాగా, ఇటీవలే అమెరికాలోని అరిజోనాలో ఫజిల్ క్రీక్ ఫాల్స్‌లో ఇద్దరు తెలుగు విద్యార్థులు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. లక్కిరెడ్డి రాకేశ్ రెడ్డి, రోహిత్ మణికంఠ లేపాల అనే ఇద్దరు విద్యార్థులు జలపాతంలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయారు. గమనించిన స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారి కోసం గాలించి మృతదేహాలను గుర్తించారు. మృతుల్లో తెలంగాణ విద్యార్థి లక్కిరెడ్డి రాకేశ్ రెడ్డి.. ఖమ్మం నగరంలోని విద్యా రంగ ప్రముఖులు లక్కిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఏకైక కుమారుడు. ఇతను కంప్యూటర్ సైన్స్ లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. ఇక మరో విద్యార్థి రోహిత్ మణికంఠ వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఇక, ఏప్రిల్‌లో ట్రెక్కింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు జారి పడి ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి చెందిన ఘటన స్కాట్లాండ్‌లో జరిగింది. వీరిలో ఒకరు హైదరాబాద్ విద్యార్థి కాగా.. మరో విద్యార్థి ఏపీకి చెందినవారు. యూనివర్శిటీలో మాస్టర్స్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు.. పెర్త్‌షైర్‌లోని లిన్ ఆఫ్ తమ్మెల్‌కు వెళ్లారు. అక్కడ ట్రెక్కింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో జారి పడి కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గాలింపు చేపట్టి ఇద్దరి మృతదేహాలను గుర్తించారు.

# నిస్సహాయుల నేస్తం మహంతి వెంకట్‌రావు



## ఆయన రాతల్లో, మాటల్లో ఆక్రోశం ఉంటుంది

- షష్టిపూర్తికి హాజరైన మద్రాస్ హైకోర్టు జస్టిస్ దేవానంద్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నిస్సహాయుల నేస్తం మహంతి వెంకట్‌రావు అని మద్రాస్ హైకోర్టు జస్టిస్ భట్టు దేవానంద్ పేర్కొన్నారు. ఆయన మాటల్లో, రాతల్లో ఆక్రోశం ఉంటుందని చెప్పారు. సీనియర్ జర్నలిస్టు మహంతి వెంకట్‌రావు 60వ జన్మదిన వేడుకలు (షష్టిపూర్తి) హైదరాబాద్ నగరంలోని ఓ ప్రయివేటు హెూటల్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జస్టిస్ దేవానంద్ మాట్లాడుతూ.. పేదల పక్షాన నిలిచిన నిఖార్సయిన పాత్రికేయుడిగా మహంతి పేరొందారని, ఆయన రచనలు మెరుగైన సమాజ నిర్మాణానికి తోడ్పడ్డాయని వివరించారు. స్వార్థాని మరిచి సమాజ హితం కోసం పనిచేసిన మహంతి.. ఎక్కడ అన్యాయం జరిగినా తన గళం వినిపించేవారని అన్నారు. జీవితకాలం సమాజ హితం కోసం ఆయన పని కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో వివిధ సందర్భాల్లో రాసిన అంశాలను మహంతి మ్యూజింగ్స్ పేరిట రాసిన సంకలనాన్ని జస్టిస్ దేవానంద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ మంగారి రాజేందర్, ఐజీ రంగనాథ్, ప్రొఫెసర్ కేవీ రావు, మహంతి సతీమణి విజయ, డాక్టర్ సమీరా తదితరులు పాల్గొన్నారు. మహంతి దంపతులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.





# బుంగల బెంగ!



**కాళేశ్వరం ప్రాజెక్టు బారాజ్‌ల వద్ద పిల్లర్ల వద్ద తరుచూ ఆటంకాలు**

- తరుముకొస్తున్న కాలం..
- భారీ వర్షాలతో వరదలు వస్తే పరిస్థితి ఏంటి..?
- ఇప్పుడిప్పుడే మొదలవుతున్న పనులు..

**కాళేశ్వరం ప్రాజెక్టుకు బుంగల బెంగ పట్టుకుంది.. గత కొద్ది నెలలక్రితం అన్నారం సరస్వతి బ్యారేజీలో బుంగపడగా ఇసుకబస్తాలు వేసి పూడ్చారు.. అదే తరహాలో ఇటీవలె మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీలో పిల్లర్ వద్ద బుంగ పడడం అధికారులకు తలనొప్పిగా మారింది.. ఓ వైపు కాలం తరుముకొస్తుంది.. భారీ వర్షాలు పడి వరదలు వస్తే పరిస్థితి ఏంటనేది ఆందోళన కలిగిస్తున్నది.. అయినా అధికారులు ఇప్పుడిప్పుడే మొదలుపెట్టడం, దీనికి తరుచూ ఆటంకాలు ఏర్పడడం తలనొప్పిగా మారింది..**

**– జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, మే 27 (జనంసాక్షి):**

కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీలో 7వ బ్లాక్ లోని 20, 21వ పిల్లర్ల వద్ద తాజాగా భారీ బుంగ బయటపడిన విషయం తెలిసిందే. ఓ వైపు రిపేర్లు చేస్తున్న క్రమంలోనే దాదాపుగా రెండు మీటర్ల పొడవు, వెడల్పుతో పిల్లర్లకు అతి సమీపంలోనే ఈ బుంగ ఏర్పడింది. బ్యారేజీలో నిల్వ ఉన్న నీటి ఒత్తిడితోనే కింది నుంచి ఇసుక, మట్టి కొట్టుకుపోయి భారీ బుంగ ఏర్పడినట్లు అధికారులు అభిప్రాయ పడుతున్నారు. మేడిగడ్డ పిల్లర్ల కింద ఈ బుంగ వ్యవహారం కలకలం రేపుతుండగా, మరమ్మతు పనులు చేపట్టిన ఎల్ అండ్ టీ సంస్థ మేడిగడ్డ వద్ద అనుమతి లేనిదే రాకపోకలకు వీలు లేదంటూ అక్కడ బోర్డు కూడా ఏర్పాటు చేసింది. దీంతో మేడిగడ్డ వద్ద అసలు ఏం జరుగుతోందనే అనుమానాలు ఎక్కువయ్యాయి.

### ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ప్రాజెక్టు ఇది..

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా దాదాపు రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. 2016 చేపట్టిన ఈ ప్రాజెక్టును 2019లోనే పూర్తిచేసింది. యుద్ధప్రాతిపదికన చేపట్టిన ఈ ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీ కీలకమైంది. కాగా ఇక్కడ మొత్తం ఎనిమిది బ్లాకులు, 85 గేట్లు ఏర్పాటు చేశారు. ఇదిలాఉంటే ఈ బ్యారేజీని ప్రారంభించిన నాలుగున్నర సంవత్సరాలకు గత ఏడాది అక్టోబర్ 21న లో పిల్లర్లు భూమిలోకి కుంగాయి. అక్కడ ఏడో బ్లాక్ లో ఉన్న 19, 20, 21వ పియర్స్(పిల్లర్స్) దెబ్బతినగా ఆ తరువాత మిగిలిన గేట్లను ఎత్తి బ్యారేజీలో ఉన్న నీటిని మొత్తం కిందికి వదిలేశారు.



### మొరాయిస్తున్న బ్యారేజీ గేట్లు..

ఏడో బ్లాక్ కుంగిపోయి ఉండటంతో ఆ బ్లాక్ లోని 15వ గేటు నుంచి 22వ గేట్ వరకు మొరాయించాయి. ఇదిలా ఉంటే ఏడో బ్లాక్ లోని 16వ గేటును తాజాగా పైకి ఎత్తేందుకు ఇరిగేషన్ అధికారులు ఇటీవల ప్రయత్నం చేయగా, బ్యారేజీ కింద భూభాగం నుంచి పెద్ద ఎత్తున శబ్దాలు వినిపించాయి. దీంతో పనులు నిలిపి వేసిన అధికారులు గందరగోళంలో పడ్డారు. రిపేర్లు చేస్తున్న క్రమంలో భారీ బుంగ బయటపడటంతో బ్యారేజీ నిర్మాణ సమయంలో చేసిన పునాది సక్రమంగా వేయకపోవడం, సిమెంట్ కాంక్రీట్ పనులు నాసిరకంగా చేపట్టడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ దాదాపు 12 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల మేర బొరియ ఏర్పడిందని అధికారులు అంచనాకు వచ్చినట్లు తెలిసింది.

### రెండురోజుల కిందటే మొదలైన పనులు..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఎల్ అండ్ టీ కాంట్రాక్ట్ సంస్థ రెండు రోజుల కిందటే మరమ్మతు పనులు చేపట్టింది. ఇప్పటికే బ్యారేజ్ లోని 85 గేట్లలో 79 గేట్లను ఎత్తి ఉంచగా, కుంగిన ఏడో బ్లాక్ లో ఉన్న గేట్లు పెండింగ్ లో ఉన్నాయి. కానీ అక్కడి పరిస్థితుల దృష్ట్యా వాటిని ఒకేసారి ఎత్తలేని పరిస్థితి నెలకొంది. దీంతోనే ఇటీవల 15వ గేటును పైకెత్తి, మిగతా వాటిని ఎత్తేందుకూ ప్లాన్ చేశారు. ఈ క్రమంలోనే 16వ గేటు ఎత్తుతున్న క్రమంలోనే ఈ భారీ బుంగ వ్యవహారం బయటకు వచ్చింది. కాగా టన్నుల కొద్ది బరువున్న గేట్లను ఎత్తితే పియర్లు మరింత కుంగిపోయి పెను ప్రమాదమే సంభవించే అవకాశం ఉంది. ఓ వైపు భారీ శబ్దాలు, మరో వైపు బుంగ పెద్దగా అవుతున్న నేపథ్యంలో దానిని పూడ్చిన తరువాతే పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులు కూడా నిర్ణయించారు.



### మేడిగడ్డ బ్యారేజ్ వద్ద గ్రావిటింగ్ పనుల కోసం ఏర్పాట్లు..

మేడిగడ్డ బారేజ్ అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ లో కుంగిన పియర్సుల పునాదుల కింద గ్రావిటింగ్ పనులు చేసేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్ డి ఎస్ ఏ సూచనల మేరకు బ్యారేజ్ లోని ఏడవ బ్లాకులో 21, 22వ గేట్లను కట్ చేస్తున్నారు. బ్యారేజ్ డౌన్ స్ట్రీమ్ లో సిసి బ్లాక్ లను క్రేన్ ల సహాయంతో సరిచేస్తున్నారు. బ్యారేజ్ లో కుంగిన దిగువ ప్రాంతంలో ఊటలద్వారా వచ్చే నీటిని యంత్రాలతో మళ్లీస్తున్నారు. ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇసుకను తొలగించి, సరిచేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితుల నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ ఎల్ అండ్ టీ అక్కడ నిషేధాన్ని విధించింది. ఈ మేరకు మేడిగడ్డ ప్రధానదారి గేట్లు క్లోజ్ చేసి, అక్కడికి ఎవరూ వెళ్లకుండా నిషేధాజ్ఞలు చేసింది. అనుమతి లేని వ్యక్తులకు ఎవరికీ ప్రవేశం లేదంటూ క్లోజ్ చేసిన గేట్ల వద్ద బోర్డును కూడా ఏర్పాటు చేసింది. కాగా రిపేర్లు చేస్తున్న క్రమంలోనే భారీ బుంగ వ్యవహారం బయటపడటం, దాంతో మరమ్మతులు చేయాల్సిన సంస్థ గేట్లు క్లోజ్ చేసి ఎవరినీ అనుమతించకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రాజెక్టు భవిష్యత్తుపై నిపుణులు కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులో తరచూ లోపాలు బయటపడటం, చిన్నపాటి వరద తాకిడికి కూడా భారీ బుంగలు ఏర్పడటం, పియర్లు కుంగడం తదితర లోపాల నేపథ్యంలో అసలు కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి ఏంటనే చర్చ జరుగుతోంది. కాగా ఇప్పటికే రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై వివిధ రకాల వాదనలు వినిపిస్తుండగా, లోపాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని ఎదురు చూస్తున్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి





- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో- కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

**హైదరాబాద్, మే 27 (జనంసాక్షి) :** విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో–కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. శిల్పా క్రియేషన్స్ మరియు ఆర్ట్స్ కాపర్తి కాన్సర్ ఫౌండేషన్ ట్రస్ట్ మరియు బాలాజీ చారిటబుల్ ట్రస్ట్ తిరుపతి, శిల్ప ఆర్ట్స్ చైర్మెన్ కాపర్థి ప్రకాశ్ ఆధ్వర్యంలో శ్వేత గార్డెన్ కొత్త పేట లో 2023 –2024 సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 55 మంది విద్యార్థులకు పురస్కారాలు సన్మానించి మరియు 10 మంది ఆదర్శ దంపతులకు పురస్కార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి తల్లిదండ్రలకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని అలాగే భవిష్యత్ లో ఐఏఎస్, పోలీస్ లాంటివి సాధించి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్వీకుమార్, ఎంఎల్ఆర్ గుప్త, దిల్సుక్ నగర్ సాయి బాబా దేవాలయం చెర్మెన్ గుండ మల్లయ్య , బచ్చు గంగాధర్ గుప్త, భుగ్గరపు దయానంద్, ఉపేందర్, ఎల్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బెంగుళూరు డ్రగ్స్ కేస్‌లో మరో ట్విస్ట్

- జ్వరంతో విచారణకు రావడం లేదన్న నటి హేమ

**హైదరాబాద్, మే27 (జనంసాక్షి) :** బెంగుళూరు డ్రగ్స్ కేస్‌లో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. పోలీసుల విచారణకు నటి హేమ దుమ్మా కొట్టారు. విచారణ కు హాజరయ్యేందుకు సమయం కావాలని హేమ కోరినట్టుగా తెలుస్తోంది. తాను వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నానని బెంగుళూరు సీసీబీకి హేమ లేఖ రాసింది. హేమ లేఖను సీసీబీ పరిగణలోకి తీసుకుంది. హేమకు మరో నోటీస్ ఇచ్చేందుకు బెంగుళూరు పోలీసులు సిద్ధమయ్యారు. బెంగుళూరు రేవ్ పార్టీ కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతోంది. ఈ రేవ్ పార్టీలో డ్రగ్స్ తీసుకున్న 8 మందికి సీసీబీ నోటీసులు జారీ చేసింది. వారంతా బెంగళూరు సీసీబీ ఎదుట హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. నోటీసులు అందుకున్న వారిలో నటి హేమ కూడా ఉంది. ఈ రేవ్ పార్టీలో పాల్గొన్న తెలుగు వారందరికీ పాజిటివ్ అని తేలింది. వీరిలో నటి హేమతో పాటు ఆషీరాయ్, పార్టీ నిర్వహించిన వాసుతో పాటు పలువురు ఉన్నారు. అయితే హేమ మాత్రం తాను రేవ్ పార్టీలో లేనంటూ బుకాయించింది. హైదరాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్‌లో ఉన్నానంటూ వీడియో రిలీజ్ చేసింది. కట్ చేస్తే బెంగుళూరు పోలీసులు హేమ ఫోటోను రిలీజ్ చేశారు. అంతే సీన్ మాత్రం రివర్స్. హేమ ఈ పార్టీకి తన పేరుతో కాకుండా కృష్ణవేణి అనే పేరుతో హాజరైంది. పోలీసు రికార్డుల్లోనూ హేమ పేరు కృష్ణవేణిగా

# జూన్ 5 తర్వాత అధికారంలోకి ఇండియా కూటమి

- మాజీ ఎంపీ వీ హనుమంతరావు

**హైదరాబాద్, మే27 (జనంసాక్షి) :** దేశంలో జూన్ 5తర్వాత కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని మాజీ ఎంపీ హనుమంతరావు అన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తరిమి కొట్టినప్పుడు మన దేశంలో గుండు సూది కూడా తయారు కాలేదన్నారు. నెహ్రూ మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడిచి దేశాన్ని నడిపించాడన్నారు. పంచవర్ష ప్రణాళిక లు నెహ్రూ తెచ్చిందని తెలిపారు. దేశంలో డ్యామ్ లు కట్టించింది నెహ్రూ నే అన్నారు. మోడీ ఏమి మాట్లాడుతుండో అర్థం కావట్లేదన్నారు. రాజీవ్ గాంధీ తెచ్చిన ప్రభుత్వ రంగ సంస్థలు కూడా మోడీ ప్రైవేట్ చేస్తుండన్నారు. కాంగ్రెస్ ఏమి తెచ్చింది అంటుండ్రు.. కాంగ్రెస్ స్వాతంత్ర్యాన్ని తెచ్చిందన్నారు. అంబేద్కర్ తెచ్చిన రాజ్యాంగాన్ని మోడీ మార్చాలని చూస్తున్నారని తెలిపారు. బీజేపీ వాళ్ళు రాముడి పేరుతో ఓట్లు అడుగుతున్నారన్నారు. అట్టడుగు వర్గాలకు న్యాయం చేయాలని రాహుల్ గాంధీ ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు నరేంద్ర మోడీ హటావ్,దేశాన్ని బచావ్ అంటున్నారని తెలిపారు. దేశంలో జూన్ 5తర్వాత కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. మరోవైపు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నెహ్రూ ప్రతిష్టను తగ్గించేందుకు ఆర్ఎస్సెస్, బీజేపీ లు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. పండిట్ జవర్ లాల్ నెహ్రూ దేశాన్ని దూర దృష్టితో చూస్తున్నారని తెలిపారు. నెహ్రూను విమర్శించే వాళ్ళను చూసి నిజమైన దేశ భక్తులు ఇప్పుడు బాధ పడుతున్నారని తెలిపారు.

# ఆరోపణలు చేస్తే వ్యక్తిగత విమర్శలా?



- మండిపడ్డ బిజెపి పక్షనేత మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, మే (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 19 ప్రశ్నలతో లేఖ రాస్తే.. ఒక్క ప్రశ్నకు మాత్రమే ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పారని భాజపా శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. తాను చేసిన వ్యాఖ్యలపై ఉత్తమ్ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'పైరవీ చేసి భాజపా ఎల్పీ పదవి తెచ్చుకున్నానని చేసిన వ్యాఖ్యలు సరికాదు. ఇది కాంగ్రెస్ కాదు. అందరి సమన్వయంతో నాకు భాజపాఎల్పీ నేతగా అవకాశం కల్పించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. మీరు పీసీసీ పదవి ఎలా తెచ్చుకున్నారో నాకు తెలియదా..? మీలా దిగజారి ఆరోపణలు చేయలేను. మా అధ్యక్షుడి అనుమతితోనే సీఎంను కలవడానికి వెళ్లాను. ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్‌పై మాట్లాడినప్పుడు స్పందించని ఉత్తమ్.. యూ ట్యాక్స్‌పై మాట్లాడినప్పుడు మాత్రం స్పందించారంటే అవినీతి ఎంత జరిగిందో అర్థం అవుతోంది. పౌరసరఫరాల శాఖలో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరిపించాలి' అని ఆయన డిమాండ్ చేశారు.

# శ్రీధర్ రెడ్డి హత్యపై సమగ్ర విచారణ

**డిజిపికి బిఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు**

**హైదరాబాద్, మే (జనంసాక్షి) :** భారాస నేత శ్రీధర్‌రెడ్డి హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ఆ పార్టీ నేత ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర డీజీపీ రవిగుప్తాకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీధర్‌రెడ్డి హత్య కేసు నిందితులను శిక్షించాలని డీజీపీని కోరినట్లు చెప్పారు. 'హత్య జరిగి నాలుగు రోజులైనా, మంత్రి జూపల్లి కృష్ణారావు మీద ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ కేసులో ఎవరినీ అరెస్ట్ చేయలేదు. ప్రధాన నిందితుడి ఇంట్లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశం పెట్టారు. ముఖ్యమంత్రే ఈ రాష్ట్రానికి హోంమంత్రిగా ఉన్నారు. అందుకే, శ్రీధర్‌రెడ్డి హత్య కేసును ప్రత్యేక దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని డీజీపీని కోరాం. వారం రోజుల్లో ఈ కేసులో న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం'అని ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370